






ఈస్ట్ డివిజన్

# బాక్సైట్ గనుల త్రవ్వకాల పేరుతో చేయబూనుకున్న 1/70 చట్ట సవరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ఆదివాసీ ప్రజానీకం

స్థానికంగా ఆనాడు అల్లూరి నాయకత్వంలో విదేశీ పాలనకు వ్యతిరేకంగా విల్లంబులు సారించితే, నేటి స్వదేశీ దళారీ పాలకుల విధానాలపై కన్నెర్రజేస్తూ గిరిజన ఆదివాసీ ప్రజలు తమ మౌలిక సమస్యలపై పాలకవర్గాల దోపిడీని, సామ్రాజ్యవాదుల విధానాలపై పోరాడుతూనే ఆదివాసీ ప్రజల ప్రత్యేకతలతో ప్రత్యేక హక్కులు, చట్టాలను రాజ్యాంగంలో పొందుపరచబడి సాధించుకున్నారు. అనేక ఆదివాసీ ప్రజల పోరాటాలు, ప్రత్యేకంగా నక్జల్బరీ, శ్రీకాకుళ రైతాంగ పోరాటాలు పాలకవర్గాల విధానాలనే సవాలు చేసింది. బెంబేలెత్తి పాలకులు కొన్ని సవరణలతో 1/70 చట్టం తెచ్చింది. రాజ్యాంగంలో సైతం రాసుకుంది. కానీ దోపిడీ పాలకవర్గాలు 1/70 చట్టం (భూ బదలాయింపు) అడుగడుగునా అడ్డుకుంటూ ఆదివాసేతర ప్రజల ప్రయోజనాల కొమ్ముకాస్తూ వస్తున్నది. పాలక విధానాల ఫలితమే ఏజెన్సీ ప్రాంతాల్లో మైదాన వాసుల వలసలు, గిరిజనేతర భూస్వామ్య వర్గాల చేతుల్లో సారవంతమైన ఆదివాసీల భూములు అన్యాక్రాంత మయ్యింది. గిరిజనుల శ్రమశక్తిని, సంపదను దోచే వ్యాపార వర్గం కోట్లకు పడగలెత్తుతున్నారు. కానీ స్థానిక ఆదివాసీ ప్రజానీకం కొండపోడు బ్రతుకులతో, చాలీ చాలని జీవితాలతో దినదినం గండంగా నిత్యం దగాకు గురౌతున్నారు. అడవిపైన, అడవి సంపదపైన తన జన్మ హక్కులను సైతం హరించి వేయబడుతున్నవి.

గిరిజనుల సంక్షేమం పట్లగాని, గిరిజనుల హక్కుల పట్లగాని పట్టించుకోని పాలకులు, గిరిజనులను పరాయీకరణకు గురిచేసే, నామమాత్రపు చట్టాలను, హక్కులను హరించివేసే కుట్రలకు నిరంతరం పాల్పడుతూనే వున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, ఆదివాసీ ప్రజల హక్కులకు ఆటంకాలు కల్పిస్తూనే వచ్చింది. గిరిజన నాయకులుగా చెలామణి అవుతున్నవారు గిరిజనుల సంక్షేమాన్ని ప్రక్కనబెట్టి మండల స్థాయి నాయకులు మొదలు, యం.యల్.ఏ.లు, యం.పి.ల వరకు మాటమార్చి, భూస్వామ్య దళారీ పెట్టుబడిదార్లతో చేతులు కలుపుతున్నారు. మొత్తం ఆదివాసీ ప్రజల జీవితాలనే నాశనం చేసే కుట్రల్లో భాగస్వాములౌతున్నారు. ఒకవైపు 1/70 చట్టం సవరణపై అల్యూమినియం ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా స్థానికంగా రైతాంగ, విద్యార్థి, ఉద్యోగ సంఘాలు ఉద్యమిస్తున్నా పెదవి విప్పని గిరిజన ప్రజా ప్రతినిధులు పోరాడే ప్రజలపైన పోలీసులను వుసిగొల్పుతున్నారు.

1/70 చట్ట సవరణకే కంకణం కట్టుకున్న తెలుగుదేశం పార్టీ అధికారమెక్కింది. మొదలు ఏజెన్సీ ప్రాంతాలలోని గిరిజనేతర ప్రజానీకంపై ఈ భూబదలాయింపు చట్టం శాపంలా తయారయ్యిందని ప్రచారానికి పూనుకుంది. చట్టాన్ని సవరించాలనే పేరుతో చట్టంలోని మౌలికాంశాన్నే ఎత్తెయ్యటానికి నిరంతరం కుట్రలు పన్నుతున్నది. యన్.టి.ఆర్.ను గద్దె దింపి దొడ్డి దారిన అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ప్రపంచబ్యాంకు ఏజెంటుగా మారి, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు రాష్ట్రాన్ని అప్పులతో తాకట్టు పెడుతున్నాడు. కార్మిక, కర్షక, విద్యార్థి, ఉద్యోగ, ఆదివాసీ ప్రజల వ్యతిరేక విధానాలను కొనసాగిస్తున్నాడు. సామ్రాజ్యవాదుల ఒప్పందాలలో భాగంగా ఆదివాసీ ప్రాంతాలలో నిక్షిప్తమై వున్న ఖనిజ సంపదను సామ్రాజ్యవాదుల ఫ్యాక్టరీలకు అతిచౌకగా అమ్మేస్తున్నాడు. విశాఖ తూర్పు తీర ప్రాంతంలో గల బాక్సైట్ నిల్వల వెలికితీతలోనే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి ముడిపడి వుందని, అల్యూమినియం ఫ్యాక్టరీతోనే గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా వుంటాయని తన సహజ శైలిలో ప్రచారాన్ని కొనసాగిస్తున్నది.

ప్రజాస్వామ్య ముసుగు ధరించిన చంద్రబాబు ప్రభుత్వం ఎన్నడూ కానరాని అడ్వయిజరీ కమిటీ (గిరిజన సలహా మండలి) ని మంత్రి మణికుమారి ఆధ్వర్యంలో 22 మంది యం.యల్.ఏ.లతో విశాఖ ఏజెన్సీ ప్రాంతం సందర్శించకుండానే గిరిజన ప్రాంతాలైన చింతపల్లి, గూడెం, అరకు ప్రజల ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుందని, ప్రజల ఆమోదం వుందనే పత్రికా ప్రకటనలు ఇచ్చారు.

భారీ బందోబస్తుతో కేవలం గూడెం మండల కేంద్రంలో అడ్వయిజరీ కమిటీ మీటింగులో బాక్సైట్ గనుల త్రవ్వకాలను వ్యతిరేకిస్తూ మాట్లాడితే, తుపాకులతో, పశుబలంతో మాట్లాడే స్వేచ్ఛను సైతం అడ్డుకుంది. ఏజెన్సీ వ్యాపితంగా వివిధ వర్గాల నిరసనలను లెక్క చేయకుండా టి.డి.పి. ప్రభుత్వం సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకే కంకణం కట్టుకుంది. చట్ట సవరణ వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములైన కొంతమంది టీచర్స్‌ను సస్పెండ్ చేయటం, అన్నలతో సంబంధాలు వున్నాయని కేసులు బనాయించే కార్యక్రమానికి పాల్పడుతున్నది టి.డి.పి. ప్రభుత్వం.

రాష్ట్ర జనాభాలో 6% కల్గిన ఆదివాసీ ప్రజల అభివృద్ధి గూర్చి తన విజన్ 2020 విధాన పత్రంలో ఏ మాత్రం పేర్కొనని చంద్రబాబు ప్రభుత్వం గనుల త్రవ్వకాల పేరుతో ప్రైవేటు పెట్టుబడిదారులకు అప్పగించటానికి వున్న చట్టాలనే సవరించే ప్రయత్నాలకు ఒడిగడుతున్నది. 1/70 చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరుల చేతుల్లో భూబదలాయింపు ఏ రూపంలో జరగటానికి వీలులేదని, అంటే ఖనిజ సంపదలు, లేదా ఫ్యాక్టరీని నెలకొల్పడంగాని, లీజుకిచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని స్పష్టంగా రూపొందించబడింది. చట్టంలోని ప్రధాన సారాంశంను ఎత్తివేసి గిరిజనేతరులు, బడా పెట్టుబడిదారులు సొమ్ము చేసుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ నిస్తున్నది.

ప్రపంచంలోనే బాక్సైట్ నిల్వలు 40 బిలియన్ టన్నులు వుండగా ఒక్క భారతదేశంలోనే ... మిలియన్ టన్నులు (7.1%) నిక్షేపాల 2525 టన్నులను సులభంగా తియ్యగలిగేవే. ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు తీర ప్రాంతం వెంబడి మరియు ఒరిస్సా రాష్ట్రంతో కలిపి 2,500 మిలియన్ టన్నులు వున్నాయి. మొత్తం తూర్పు తీర ప్రాంతంలో రెండు భాగాలుగా విభజించి, అరకు, చింతపల్లిలలో 570 మిలియన్ టన్నులను పరిశోధించి గుర్తించబడింది.

అరకు భాగమైన గాలికొండ, రక్తికొండ, చిత్తంకొండలలో 55 మిలియన్ టన్నులను, చింతపల్లి విభాగంలోని సప్పర్ల, గూడెం, కాటమరాజు కొండలల్లో 515 మిలియన్ టన్నులు లోహ నాణ్యత గల బాక్సైట్ గనులున్నాయి. అల్యూమినియం కర్మాగారం ఏర్పాటుకు, విస్తృత అవకాశాలకు భౌతిక పునాదిగా వున్న బాక్సైట్ 3 టన్నులతో 1 టన్ను అల్యూమినియం తయారు చేసే సామర్థ్యం కలిగి వుండటంతో సామ్రాజ్యవాదుల డేగకన్ను విశాఖ ఏజెన్సీ ప్రాంతంపై పడింది. దళారీ, ఐ.యం.యఫ్. ఏజెంట్ అయిన చంద్రబాబు 4,500 కోట్ల వ్యయంతో అల్యూమినియం ప్లాంటు ప్రభుత్వ పరంగా అసాధ్యమైందని, అందుకే ప్రైవేటు పెట్టుబడి తప్పని సరని గిరిజన సలహామండలి నాయకురాలు మంత్రి మణికుమారిచే ప్రచారానికి వుపయోగించుకుంటున్నాడు.

బాక్సైట్ గనుల త్రవ్వకాలతో ప్రత్యక్షంగా దెబ్బతినేది స్థానికంగా నివసించే ఆదివాసీ ప్రజలే. సుమారు 177 గ్రామాల గిరిజన ప్రజల జీవితాలనే ప్రశ్నార్థం కాబోయే వినాశకర పరిణామాలను, 1/70 చట్ట సవరణకు వ్యతిరేకంగా వివిధ రాజకీయ పార్టీలు, వుద్యోగ సంఘాలు స్వచ్ఛంద సంస్థలు నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తున్నాయి. తమ రాజకీయ లక్ష్యాలలో భాగంగా ఈ పార్టీలన్నీ, సంస్థలన్ని ఉడతా భక్తితోనే గిరిజన ప్రజల పక్షం వహిస్తున్నారు. కానీ వాస్తవంగా ఈ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలన్ని సామ్రాజ్యవాదుల, దళారీ పాలకుల ప్రయోజనాలకే అంతిమంగా కట్టుబడి పనిచేసేవే.

మన పార్టీ నాయకత్వం అల్యూమినియం ఫ్యాక్టరీ పేరుతో 1/40 చట్టం సవరణ వ్యతిరేకోద్యమాన్ని వివిధ వర్గాల ప్రజలతో, మేధావులతో కార్యక్రమాన్ని చేపట్టింది. అడవి సంపద ఆదివాసీ ప్రజలకేనని, 1/70 యాక్ట్ పరిరక్షణ కమిటీ పేరుతో గ్రామగ్రామాన ప్రజలను చైతన్యపరుస్తూ బూర్జువా రాజకీయ పార్టీల, సంస్థల నాయకుల అసలు రంగును బైటపెడుతూ గ్రామస్థాయి నుంచి పంచాయితీ కమిటీల వరకు నిర్మాణ యుతం చేస్తూ ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శన చేపట్టడం, బాక్సైట్ త్రవ్వకాల ప్రభావిత గ్రమాల ప్రతినిధులతో పాడేరులో ఇండోర్ స్టేడియంలో సదస్సులు నిర్వహించి, ఏజెన్సీ వ్యాప్తంగా వివిధ ఐక్య వేదికలతో అల్యూమినియం ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా 1/70 చట్ట సవరణ వ్యతిరేక ప్రదర్శన కొనసాగాయి.

## సంతకాల సేకరణతో గూడెంలో ఆగస్టు 10న రైతాంగ ర్యాలీ

డి.వి.సి. తీర్మానంలో భాగంగా జూలై 28 నుంచి ఆగస్టు 14 వరకు గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారాన్ని కొనసాగిస్తూ, యువతను కదిలిస్తూ సంతకాల సేకరణోద్యమాన్ని చేపట్టడం, 1/70 చట్టం సవరణ, అల్యూమినియం ఫ్యాక్టరీ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహనా తరగతులు నిర్వహించటం, క్యాంపెయిన్ బ్యాచీలు ఏర్పరచి ప్రచారం సాగిస్తూ, 15 ఆగస్టు నాడు గ్రామగ్రామాన నిరసన సభలు, బహిరంగ సమావేశాలు నిర్వహిస్తూ, బంద్ పాటించారు. చుట్టుప్రక్కల గ్రామాలలో బహిరంగ సభలలో చంద్రబాబు, వాజ్‌పేయిల దిష్టి బొమ్మలను వింటిబద్దలతో వేసే కార్యక్రమం చేపట్టారు.

### కోరుకొండ యల్.జి.యస్. పరిధిలో:

సుమారు 15 గ్రామాల యువకులకు, ప్రతినిధులకు రెండు దఫాలుగా అవగాహనా సదస్సులు నిర్వహించి, బాక్సైట్ గనుల త్రవ్వకాలతో కలిగే దుష్పరిణామాలను అర్థం చేయించారు. ఒకసారి 30 మందితోను, మరొకసారి 60 మందితోను నిర్వహించి ఆగస్టు 10న గూడెం మండల కేంద్రంలో సంతకాల సేకరణతో కుండపోత వర్షాన్ని సైతం లెక్కచేయక సుమారు 600 మంది ప్రజలు యం.ఆర్.ఓ.కు మెమొరాండం అందించి, ''అడవి సంపద ఆదివాసులకే'' అనే నినాదంతో మండల కేంద్రంలో బహిరంగ మీటింగుకు హాజరయ్యారు. గ్రామ గ్రామాన వారపు సంతలలో వాల్ రైటింగ్స్, పోస్టర్లు, బ్యానర్స్‌ను, వాయిస్‌ల ద్వారా ప్రచారం నిర్వహించారు.

చంద్రబాబు ప్రభుత్వ ఆదివాసీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, అడవిపై సర్వహక్కులు ఆదివాసీ ప్రజలకు గ్యారెంటీనిచ్చే వర్గ సంఘాలలో సంఘటితమౌతూ, 1/70 చట్ట పరిరక్షణ ఉద్యమంలో భాగస్వాములౌతు ధైర్యంగా ముందుకు రావాలనే పార్టీ పిలుపుతో, పోలీసు నిర్బంధానికి సైతం వెరవక 18 గ్రామాల ప్రజానీకం గూడెం సభకు హాజరయ్యారు. ఆగస్టు 13న ఆర్.వి. నగర్‌లో స్థానిక యం.యల్.ఏ., అడ్వయిజరీ కమిటీ సభ్యుడు యం.వి.వి. సత్యనారాయణ గడ్డిబొమ్మను నడిరోడ్డులో దించి, స్థానిక రాజకీయ నాయకులపై తమ నిరసనను తెలియజేసారు. ఈ సభకు 150 మంది మహిళలు 850 మందికి పైగా పురుషులు హాజరయ్యారు.

### తాండవ యల్.జి.యస్. పరిధిలో:

1/70 చట్ట సవరణకు, అల్యూమినియం ప్లాంట్ నిర్మాణం పేరుతో బాక్సైట్ గనుల త్రవ్వకాలను బంద్ పెట్టాలని తాండవ యల్.జి.ఎస్. పరిధిలో 25 మంది యాక్టివిస్టులతో ఒకరోజు అవగాహనా తరగతిని (1/70 చట్టం, దాని పుట్టు పూర్వోత్తరాలు, బాక్సైట్ గనుల త్రవ్వకాల వల్ల జరిగే దుష్ఫలితాలపై) ఏర్పాటు చేసి ఒకరిని యూనిట్‌కి బాధ్యునిగా ఎంపిక చేశారు. మొత్తం 4 టీములను ఏర్పాటుచేసి, చుట్టుప్రక్కల గ్రామాలలో ప్రచారం చేస్తూ గ్రామగ్రామాన ఆగస్టు 10న కొయ్యూరు మండల కేంద్రంలో మీటింగుకు హాజరుకావాలని ప్రచారం చేశారు. పోస్టర్లు, బ్యానర్లు, ప్లేకార్డులతో గ్రామగ్రామాన చేసిన సంతకాల సేకరణ పేపర్లతో మెమోరాండం యం.ఆర్.ఓ.కు సమర్పించాలని ప్లాన్ చేసుకున్నా, అదే రోజు పెద్ద ఎత్తున కుండపోత వర్షం పడటంవల్ల 25 మంది మాత్రమే వెళ్ళి యం.ఆర్.ఓ.కు వినతి పత్రం అందించారు. ఇదే ఏరియా నుంచి గూడెం మండలంలో జరిగే ఆగస్టు 10 మీటింగ్‌కు 200 మంది ప్రజలు హాజరయ్యి ర్యాలీని విజయవంతం చేశారు.

## 1/70 చట్ట సవరణకు వ్యతిరేకంగా ఆగస్టు 15 నిరసన సభ

బాక్సైట్ గనుల త్రవ్వకాల పేరుతో చంద్రబాబు ప్రభుత్వం గిరిజనేతరుల ప్రయోజనాలను నెరవేర్చే 1/70 చట్ట సవరణ కుట్రను ఎండగడుతూ, ఏజెన్సీ వ్యాపితంగా గిరిజన, వివిధ వర్గాలకు పిలుపునిస్తూ, ఆగస్టు 15 బూటకపు స్వాతంత్ర్య దినాన్ని బ్లాక్ డే గా పాటించాలని మరియు మన్యం బంద్‌కు పిలుపునిచ్చింది. విశాఖ ఏరియా కమిటీ పరిధిలో కోరుకొండ లోకల్ గెరిల్లా దళం, గూడెం మండలం శ్యామగడ్డ గ్రామంలో ఆగస్టు 15న 1/70 చట్ట సవరణ వ్యతిరేక దినంగా పాటిస్తూ సభ జరిగింది. సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ఏరియా కమిటీ సభ్యుడి ప్రసంగం ప్రారంభమైంది. 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం అనేది పాలకవర్గాలకు, ధన స్వాములకే దక్కిందని, అధికార

మార్పిడి జాతీయ దళారీ బడా బూర్జువా వర్గాలకే కట్టబెట్టిందని, సామ్రాజ్యవాద దోపిడీ అంతం కాలేదని అది మరింత క్రూరమైన దోపిడీ విధానాలను అమలు చేస్తున్నాయని వక్తలు తమ ప్రసంగంలో నొక్కి చెప్పారు. ఇప్పటికి దేశంలో పేదరికం, నిరుద్యోగం, ఆదివాసీ ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించబడలేదని రోజురోజుకు మరింత దిగజారుతున్నాయని, దేశ పాలకులు సామ్రాజ్యవాద బంట్లుగా మారి నూతన ఆర్థిక విధానాలతో ప్రపంచబ్యాంకు విషమ షరతులకు తల్గొగ్గి అమలు చేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పాలన మరింత దోపిడీ విధానాలను కొనసాగిస్తూ పోరాడే ప్రజలపై నిరంతరం అణచివేత కొనసాగిస్తున్నదని, అందులో భాగమే 1/70 చట్ట సవరణ పేరుతో అల్యూమినియం ప్లాంట్ వ్యతిరేక ఉద్యమాలపై నిర్బంధాన్ని కొనసాగిస్తుందని వక్తలు ప్రసంగించారు. పాలకుల దోపిడీ విధానాలకు, 1/70 చట్ట సవరణకు వ్యతిరేకంగా పోరాడాలని, ఆదివాసీ ప్రజల సమైక్య పోరాటమే సరైన మార్గమని ముగిస్తూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభ ముగిసింది.

**డిమాండ్స్**

1. 1/70 భూబదలాయింపు చట్టాన్ని యధాతథంగా అమలు పరచాలి.
2. ఆదివాసీ ప్రజలకే అటవీ సంపదపై సర్వహక్కులు.
3. ఆదివాసీ ప్రాంతాల్లో బాక్సైట్ త్రవ్వకాల పేరుతో మైనింగ్ నిలుపుచేయాలి.

**నినాదాలు**

* అల్యూమినియం మాకొద్దు, కూడు గుడ్డ కావాలి.
* ఆకుపైన, అడవిపైన మాదే హక్కు.
* మంత్రిగారి మాటలకు మోసపోవద్దు, మన్యంపై అధికారం కోల్పోవద్దు.

## శ్రీకాకుళం డివిజన్

## భూపోరాటాలు

ఒరిస్సా రాష్ట్రం రాయగడ జిల్లా గుణుపూర్ బ్లాక్‌లోని గొట్లబద్ర పంచాయితీలోని జగదీష్ సాహు బ్రాహ్మణ భూస్వాములు. ఆదివాసీల భూములను 60 ఎకరాలు అన్యాక్రాంతంగా గత 30 సం॥ల క్రితం కాజేశారు. ఈ భూములను కండగుత్త (కౌలు) భాగానికి (పాలుకు) ఇచ్చి అనుభవిస్తున్నారు.

శ్రీరాంపురం, తోటగూడ ఆదివాసీ ప్రజలు ఆదివాసేతర భూములు అన్యాక్రాంతంగా కాజేసినా, మా భూములుమాకే చెందాలని, భూపోరాట కమిటీల్లో సంఘటితమయి భూపోరాటానికి సిద్ధపడ్డారు. 15, 20 మందితో రెండు గ్రామాల్లో భూపోరాట కమిటీలు మరియు ఉమ్మడి కమిటీ 5 మందితో ఏర్పడింది. ఈ కమిటీ నాయకత్వంలో దాదాపు భూమిపై దిగేకంటే ముందు 6 మాసాల నుండి విస్తృతంగా ప్రచారం చేశాం. పోస్టర్ల, పేపర్ స్టేట్‌మెంట్లు, చుట్టుపక్కల గ్రామాల్లో 10 మందితో 5 రోజులు 2 సార్లు క్యాంపెయిన్ నిర్వహించాం. దీని ద్వారా విస్తృతంగా ప్రచారం జరిగింది.

2000 జూన్ నెలలో భూములపై దిగాలని 60 ఎకరాల్లో దాదాపు 20 ఎర్రజెండాలు ఎగురవేశారు. తర్వాత 40 నుండి 50 మంది స్త్రీ పురుషులు 30 నాగళ్ళతో, కత్తులు, గొడ్డళ్ళు, పారలు పట్టుకుని భూములు దున్నినారు. సమిష్టిగా 2 బస్తాలు వరి విత్తనాలు వేయడంతో, భూమి నంతా సాగు చెయ్యడంతో నిమగ్నమయ్యారు.

భూస్వాములు పోలీసుల అండతో గ్రామానికి వచ్చి ప్రజలను బెదిరించారు. ఈ విధంగా ఈ మొత్తం కాలంలో 4, 5 సార్లు గ్రామాలకు వచ్చి ప్రజల్ని భయపెట్టి, కేసులు పెడతామని హెచ్చరించారు. భూమిపై ఎగురవేసిన ఎర్రజెండాలు తొలగించారు. భూస్వాములు కొంత మందిని ప్రోత్సహించి విత్తనాలు వేసిన భూములను దున్నించారు. ఈ పరిస్థితిని చూసి, పార్టీ పేరుతో భూస్వాములను హెచ్చరిస్తూ, భూమిని దున్నిన వారిని విరమించుకోవాలని పోస్టర్లు, లెటర్ల ద్వారా ప్రచారం చేసి హెచ్చరించాం.

ప్రజలు సంఘటితంగా ఉద్యమిస్తూ గ్రామానికి వచ్చే పోలీసులను నిలదియ్యటం, పోలీసుల ముందే భూమిపై నాగళ్ళు కట్టి దున్నటం జరిగింది. ఎవరిని అరెస్టు చేసినా అందరు పోలీసు స్టేషన్‌కు వెళ్ళాలనే నిర్ణయంతో నిర్భయంగా నిలబడ్డారు. పోరాట భూములను దున్నిన వారిని భూపోరాట కమిటీ సభ్యులు వాళ్ళ నాగళ్ళు విప్పివేసి సీరియస్‌గా హెచ్చరించారు. ఇప్పుడు మొత్తం భూమి రెండు గ్రామాల ప్రజలచే సాగు చేయబడుతోంది.

### బారెడి జీడి తోట పంట స్వాధీనం

1999 నుండి ఒరిస్సా రాష్ట్రం రాయగడ జిల్లా గుణుపూర్ బ్లాక్‌లోని జగన్నాధపురం పంచాయితీలోని చిన్న బారెడ్డి గ్రామంలో విశాఖ పట్టణానికి చెందిన పృథ్వీరాజ్ అనే భూస్వామికి 90 ఎకరాల భూమి ఉన్నది. ఇందులో 40 ఎకరాలు జీడిమామిడి తోట వుంది. గతంలో ఈ భూములన్నీ చిన్న బారెడ్డి పరిసర గ్రామాల ఆదివాసీల భూములు.

ఈ జీడితోటల్లోకి ప్రజలను కదిలించి పంట స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో పరిసర గ్రామాలైన చిన్నబారెడి, జామగూడ, తుమ్మి మానుగూడ, వెలగమాను గూడ గ్రామాల్లో 15 నుండి 20 మంది వరకు గ్రామస్థాయి పంట స్వాధీన కమిటీలు ఏర్పాటు చేసి పంట స్వాధీనానికి సిద్ధమయ్యారు. గత సం॥రం 1999 మే నెలలో 4 గ్రామాల ప్రజలు సుమారు 200 మంది పంట స్వాధీనం చేసుకున్నారు. ప్రజల సంఘటిత శక్తిని చూసి భూస్వామి వెనక్కి తగ్గాడు.

ఈ పోరాట కొనసాగింపులో భాగంగా 10-4-2000 నాడు దళ నాయకత్వంలో ఇదే గ్రామాలకు చెందిన, 100 మంది ప్రజలు పంట స్వాధీన కార్యక్రమంలో పాల్గొన్నారు. మరోసారి సుమారు 10 గ్రామాలకు చెందిన 400 మంది ప్రజలు పంటను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పంట విలువ సుమారు 50 వేలు రూ॥లు వుంటుంది.

భూస్వామి దగ్గర నుండి పంట లీజుకు తీసుకున్న వారికి నచ్చజెప్పి ఈ భూమిపై సర్వహక్కులు ప్రజలకే వున్నాయని ఈ లీజు చెల్లదని

తెలియజేస్తూ వారిని భూమి నుండి వెల్లగొట్టి ప్రజలు పంట స్వాధీనం చేసుకున్నారు.తోటల్లో పని కోసం వచ్చిన కూలీలను కూడ నచ్చజెప్పి పంపివేయడం జరిగింది. పంట స్వాధీనంతో ఉత్తేజం పొందిన ప్రజలు భూమి స్వాధీనం కోసం సిద్ధపడుతున్నారు. ఈ పోరాటం ద్వారా భూమి లేని పేద ప్రజల్లో మంచి ప్రభావాన్ని కల్గించింది.

## పోలీసు ఏజెంట్ టి.కె. చౌదరి గెరిల్లా దళం చేతుల్లో ఖతం

శ్రీకాకుళం జిల్లా మందస మండలం బుడార్ సింగ్ గ్రామ పెత్తందారు, పోలీసు ఏజెంటు అయిన టి.కె. చౌదరిని ముగ్గురితో కూడిన గెరిల్లా దళం మార్చి 9, 2000 సం॥న మట్టుబెట్టింది. వీడు ప్రధానంగా 1990 నుండి మన పార్టీకి వ్యతిరేకంగా వుంటూ పార్టీ రహస్యాలను, సంఘ నాయకుల వివరాలను ఎప్పటికప్పుడు పోలీసులకు తెలియజేసేవాడు. గ్రామంలో మన సంఘం అభివృద్ధి కాకుండా శత విధాల ప్రయత్నాలు చేశాడు. వీడితో పాటు మరి కొంత మందిని కూడా ఏరియాలో పోలీసు ఇన్‌ఫార్మర్స్‌ను తయారు చేశాడు. ఆ గ్రామ చుట్టుప్రక్కల గ్రామాల్లో మన కార్యక్రమాలను యాక్టివ్‌గా చేస్తున్న ఆర్.వై.యల్. కార్యకర్త కా॥ సుభాష్‌ను వీడు, వీడితో పాటు మరికొంత మంది కలిసి చాలా దారుణంగా హత్య చేశారు. వీరికి పూర్తిగా పోలీసుల నుండి సహాయ సహకారాలు అందాయి. అలాగే కంతిగాం గ్రామం దగ్గర పార్టీ సమావేశం అవుతుందనే విషయం తెలుసుకుని వెంటనే పోలీసులకు తెలియజేయటంతో గ్రామంలోకి వెళ్ళి ప్రజలకు మందులు ఇచ్చి తిరిగి క్యాంపు దగ్గరకు వస్తున్న ఇద్దరు కామ్రేడ్స్‌ను పోలీసులు అతి సమీపం నుండి కాల్పులు జరిపి హత్య చేశారు. దీనితో ప్రధాన పాత్ర వీడిదే అన్న విషయం జగమెరిగిన సత్యం . వీడికి వ్యతిరేకంగా గతంలో కూడ మనం పెద్ద ఎత్తున ప్రచారం చేయటం జరిగింది. అయినప్పటికీ వీడి పద్ధతుల్లో మార్పు రాకపోవటం వల్ల ముగ్గురితో కూడిన గెరిల్లా దళం వీడిని ఖతం చేసింది.

## పోలీసు ఇన్‌ఫార్మర్ అల్లేన సౌభాగ్యరావు (భాగ్యం) ప్రజా గెరిల్లాల చేతుల్లో ఖతం

ఒరిస్సా రాష్ట్రం గజపతి జిల్లా గుసాని బ్లాక్ ఉప్పలాడ గ్రామానికి చెందిన అల్లెన సౌభాగ్యరావు గతంలో మన చస్సి ములియ సంఘ్ నాయకుడిగా పనిచేశాడు. గజపతి జిల్లాలో పార్టీ పలుకుబడిని ఉపయోగించుకుని ప్రజలపై దౌర్జన్యం చేయడం, పక్షపాత వైఖరితో తగవులు పరిష్కరించటం, డబ్బులు గుంజడం ద్వారా తమ ఆస్థులను పెంచుకున్నాడు. ఈ తప్పుడు పద్ధతులను సరిదిద్దుకుని ప్రజలకు క్షమాపణ కోరాలని, అక్రమంగా వసూలు చేసిన ప్రజల డబ్బును వాపసు చేయాలని పార్టీ అనేక సార్లు చెప్పినా వినిపించుకోలేదు. తన అక్రమ సంపాదనను నిలబెట్టుకోవడానికి దౌర్జన్యకారులతో చేతులు కలిపి మన ఆచూకీని పోలీసులకు అందజేశాడు. ఈ విధంగా ఆంధ్ర, ఒరిస్సా పోలీసులతో కుమ్మక్కయ్యి, మన దళంపై దాడి చేయించాడు. తమ వాహనాలలో పోలీసులను తీసుకువచ్చి మన పోరాట ప్రాంతంలో దిగవిడిచి పోవటం, నిరంతరం గ్రామాల నుండి సమాచారం సేకరించి పోలీసులకు అందజేయటం, తమ గేరేజీలో పోలీసులకు ఆశ్రయం కల్పించటం ద్వారా ప్రజా శత్రువుగా మారి పోయాడు. పద్ధతులు మార్చుకోవాలని పార్టీ పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం చేసినా పెడచెవిన పెట్టి పార్టీ వ్యతిరేక, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ఉధృతం చేశాడు. దీనితో పార్టీ వీడి అడ్డు తొలగించుకోవాలని ముగ్గురితో కూడిన దళం 8-1-2000 నాడు అతని గ్యారేజీ వద్దనే ఖతం చేసి ప్రజా వ్యతిరేకులకు ప్రజల చేతిలో కుక్క చావు తప్పదని హెచ్చరించి వచ్చారు.

## అధిక పాయిదాలు-ఖండనల వ్యతిరేక పోరాటం

విజయనగరం జిల్లా కొండబారెడి దళం ఏరియాలోని కురుపాం మండలంలో పెద్దగొత్తిలి, జి.శివడ, వలస బల్లేరు, లంక జోడి గ్రామాల వ్యాపారస్తులు అప్పులిచ్చి అధిక మొత్తంలో పంటలను పాయిదాల-ఖండనల పేర కాజేస్తున్నారు. 100 రూ॥లు ఇచ్చి (వరినాట్ల టైంలో) 4, 5 మాసాల తరువాత ధాన్యం కోతలు కోసిన వెంటనే 100 రూ॥లకు 6 కుంచాల ధాన్యం ఇవ్వాలని, ఇంకా 200 రూ॥లు ఇచ్చి 30, 36 కుంచాల ధాన్యం ఇవ్వాలని రైతులతో ఒప్పించుకుని తీసుకుంటున్నారు. ఆ రకంగా వ్యాపారస్తులు నూటికి యాభై శాతం వడ్డీని వసూలు చేసుకుంటున్నారు. పాయిదా అంటే అసలు మొత్తం ఇస్తూ, వడ్డీ కింద పంటను ఇవ్వటమే పాయిదా ఖండన అంటే తీసుకున్న డబ్బు మొత్తానికి నిర్ణయించిన మొత్తం పంట రూపంలో తీసుకోవటమే ఖండన. ఇది అసలు విలువకంటే చాలా ఎక్కువగా వుంటుంది.

ఆ అధిక ఫాయిదాలు, ఖండనలకు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకుని పాయిదా 100 రూ॥కు 4 కుంచాల ధాన్యం తీసుకోవాలని, ఖండన 200 రూ॥లకు 25 కుంచాల ధాన్యం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏరియా వ్యాప్తంగా 40 పోస్టర్లువేసి, అలాగే ఖండనల, పాయిదాల దోపిడీని బహిర్గత పరుస్తూ గోడ పత్రిక సిక్కోలు పిలుపును వేశారు. అలాగే ఏరియాలో వడ్డీ వ్యతిరేక గ్రామస్థాయి పోరాట కమిటీలు 8, ఆయా గ్రామాల ఉమ్మడి కమిటీ కామ్రేడ్స్ దాదాపు 6, 7 గ్రామాల్లో ప్రతిరోజూ రాత్రుల్లో 5 రోజులు క్యాంపెయిన్ చేశారు. దీనిద్వారా ఏరియాలో బాగా ప్రచారం జరిగింది. మనం పోస్టర్లలో వ్యాపారస్తుల పేరు రాసి, వాళ్ళ దోపిడీ శాతాన్ని ఏరియాలో కొన్ని ఉదాహరణలు చూపిస్తూ పోస్టర్లు వేశాము. ప్రజలు వ్యాపారస్తులకు వ్యతిరేకంగా సంఘటిత పడటంతో, దిగివచ్చిన వ్యాపారస్తులు, పార్టీ, సంఘం నిర్ణయించిన రేట్లు ప్రకారం తీసుకున్నారు. కొంత మేరకు ఇది ఆచరణలో జరిగింది.

కొండబారెడి ఏరియాలో పాయిదాల-ఖండనల పేర ఇంకా ఇతర పంటలు (పసుపు, కందులు, చింతపండు) ను కూడా వ్యాపారస్తులు తీసుకుంటున్నారు. వీటి విషయంలో కూడా దళం వడ్డీ వ్యతిరేక పోరాట కమిటీ విస్తృతంగానే ప్రచారం చేశాయి. ప్రజల్లో షావుకార్లను లొంగదీసుకున్న ప్రభావం బాగానే వుంది. పూర్తిగా అన్ని పంటలకు కూడా తగ్గించుకోవాలనే ఉత్సాహంతో ప్రజలున్నారు.

## చింతపండు పోరాటం

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతం, బామిని, కొత్తూరు, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కొమరాడ మండలాల్లోని అన్ని గ్రామాల్లో చింతపండు అధికంగా పండుతున్నా, చింతపండును జి.సి.సి. వాళ్ళు రూ॥ 6.50 పైసల నుండి రూ॥ 7.50 పైసల వరకు కొనుగోలు చేస్తున్నారు. బయట మార్కెట్‌లో రూ॥ 20% వరకు వున్నట్లు మార్కెట్ ప్రకటనలు తెలియజేస్తున్నా జి.సి.సి. వాళ్ళు మాత్రం గత సం॥రం రూ 6.50 పైసలు ఇచ్చి చింతపండు సీజన్ చివరలో 10 రూ॥లకు చెల్లించి ప్రజలను విపరీతంగా దోపిడీ చేస్తున్నారు. తూనికలో

కూడా చింతపండు తడిపారని, పచ్చిగా వుందని కావిడికి 5, 6 కిలోల చొప్పున తరుగు క్రింద తీసుకుంటున్నారు.

జి.సి.సి. దోపిడీకి వ్యతిరేకంగా ఏరియా వ్యాప్తంగా 10 చింతపండు పోరాట కమిటీలు (గ్రామస్థాయి) ఏర్పడి మరియు 10 గ్రామాల ఉమ్మడి కమిటీలో 9 మందితో ఏర్పడి ఒక కిలో చింతపండుకు 15 రూ॥లు ఇవ్వాలని, కావిడి చింతపండుకు 2 కిలోలు మాత్రమే తరుగు క్రింద తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏరియా కమిటీ కామ్రేడ్స్ 10 గ్రామాల్లో క్యాంపెయిన్ చేస్తూ చింతపండు పోరాట కమిటీ పేరుతో 30 వరకు పోస్టర్లు వేశారు. ఒక్కొక్క గ్రామం 200 రూ॥లు చొప్పున కలెక్షన్ చేస్తూ ఒక వ్యాన్ బుక్ చేసుకుని 200 మంది 7-3-2000న పార్వతీపురం ఐ.టి.డి.ఏ. ఆఫీసుకు ఊరేగింపుగా వెళ్ళారు. వ్యాన్‌కు చింతపండు పోరాట కమిటీ బ్యానరు కట్టి, నినాదాలు చేస్తూ పి.ఓ. దమయంతిని రేటు పెంచాలని డిమాండ్ చేస్తూ 2 గంటల పాటు చర్చించారు. పి.ఓ. తమ దోపిడీ స్వభావాన్ని స్పష్టపర్చుకుంటూ మార్కెట్ దళారులను కప్పి పుచ్చుతూ, మార్కెట్ రేటును తెలుసుకోండని, మార్కెట రేటు కంటే ఎక్కువనే చెల్లిస్తున్నామని ప్రజలను నమ్మించ ప్రయత్నం చేసింది. ఈ మోసాన్ని ప్రజలు తెలుసుకుని రేటు పెంచాలనే డిమాండు తిరిగి గ్రామాల్లోని ప్రజల్లో పి.ఓ. స్వభావాన్ని జి.సి.సి. దోపిడీని ఎండగడుతూ ప్రచారం చేశారు.

### పాయిదాలు - ఖండనలు రద్దు

శ్రీకాకుళం డివిజన్‌లోని కొండబారిడి దళం ఏరియాలో 1999 సెప్టెంబర్ నుండి పాయిదాలు, ఖండనలు తగ్గించాలని పావుకార్లతో పోరాటం ప్రారంభించాం. గతం నుండి ఏరియాలో పాయిదాలు, ఖండనల పేర నూటికి రెండు వందల శాతం దోపిడీ కొనసాగుతోంది.

### షావుకార్లు రైతాంగం వద్ద దోచుకుంటున్న పద్ధతి

ధాన్యం 200 రూ॥లకు ఫాయిదాగా 6, 7 కుంచాలు; ఖండనగా 1 బస్తా

పసుపు 100 రూ॥లకు ఫాయిదాగా 5 కేజీలు; ఖండనగా 15, 20 కే.జీ.లు.

కందులు 100 రూ॥లకు పాయిదాగా 3, 4 కుంచాలు; ఖండనగా ....

పై పద్ధతుల్లో అప్పులు ఇస్తూ 6, 7 నెలల కాలానికి పెద్ద మొత్తంలో నికృష్ట దోపిడీ కొనసాగిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు సంఘటితంగా నిలిచి ఈ క్రింది విధంగా తగ్గించుకో గల్గినారు.

ధాన్యం 100 రూ॥లకు 6, 7 నెలలకు పాయిదాగా 3, 4 కుంచాలు; ఖండనగా 25 కుంచాలు

పసుపు 100 రూ॥లకు 6, 7 నెలలకు పాయిదాగా 2½ కేజీలు; ఖండనగా 6,7 కేజీలు

కందులు 100 రూ॥లకు 6, 7 నెలలకు పాయిదాగా 2 కుంచాలు, ఖండన 6 కుంచాలు.

పై పద్ధతిలో షావుకార్లు పాయిదాలు, ఖండనలు తీసుకోవాలని పార్టీ డిమాండ్ చేసింది.

ఈ పోరాటాన్ని తిరిగి బాగా లేదని సమీక్షించుకుని సనాతన ఫ్యూడల్ నికృష్ట దోపిడీని రూపుమాపాలని పాయిదాలు, ఖండనలు పూర్తిగా రద్దు కావాలనే డిమాండ్‌తో ప్రజలను సంఘటిత పరిచాము. ఈ పోరాటంలో సంఘాలు, ప్రజలు 400 మంది, 5 గ్రామాలకు చెందిన 20 మంది షావుకార్లను పిలిచి బహిరంగ సమావేశం జరిపాము. షావుకార్ల దోపిడీ పద్ధతిని, వారు రాసుకున్న పద్దుల్లో జరిగే మోసాల్ని ఎండగట్టాం. ప్రజలు స్వయంగా షావుకార్ల దోపిడీ ఏయే పద్ధతిలో కొనసాగుతుందో మాట్లాడారు. సీమ కాటాల ద్వారా పంటలను కొంటున్నప్పుడు అధికంగా తూకం వేసుకుని పట్టుకెళ్ళేది, మూడు రకాల కుంచాలద్వారా (3, 4, 5 కేజీలది) జరిగే మోసాన్ని, చిన్న మొత్తాలలో రేట్ల తేడా చూపి దినుసులు కొనుగోలు చేస్తున్న దానిని, ఏజెన్సీ రేటుకి, మార్కెట్ రేటుకి అధిక వ్యత్యాసంతో కొనుగోలు చేస్తున్న షావుకార్ల మోసాన్ని ప్రజలు బహిర్గతపరిచారు. అప్పులు ఇచ్చి తీసుకుంటున్న అధిక వడ్డీలను కూడా ప్రజలు వ్యతిరేకించారు.

దీన్నంతా చర్చించి అప్పులు ఇచ్చే షావుకార్లు ఎంత వడ్డీ వుండాలనేది, ఏజెన్సీకి, బయట మార్కెట్ రేటుకి (పంట కొనుగోళ్ళ విషయంలో).

1. 100 రూ॥ల అప్పుకు 1 నెలకు 3 రూ॥ల వడ్డీ తీసుకుని పాయిదాలు, ఖండనలు రద్దు చేయాలి.
2. సీమ కాటాలు, కుంచాలు నిషేధం. పెద్ద కాటాల ద్వారా పంట కొనాలి.
3. ఏజెన్సీకి-బయట మార్కెట్‌కి 50 పైసల నుండి 1 రూ॥ వరకు తేడాతో కొనుగోలు చేయాలని, సమావేశం నిర్ణయించింది. దీనికి షావుకార్లు ఒప్పుకొని ఏ.ఆర్.సి.యస్. నిర్ణయించిన ప్రకారం వ్యాపారాన్ని కొనసాగిస్తామని ఒప్పుకున్నారు. ఇది ఏరియాలో మంచి ప్రభావాన్ని కలగజేసింది. ఇంకా ఇతర ప్రాంతాల్లో కూడా ప్రజలు షావుకార్ల వ్యతిరేక పోరాటానికి సిద్ధపడుతున్నారు.

## పార్టీ సభ్యత్వ క్యాంపెయిన్-రాజకీయ తరగతులు

పార్టీ వ్యాప్తంగా చూసుకున్నప్పటికీ మన పార్టీ నాయకత్వంలో అనేక ప్రజా సంఘాలు ఏర్పడినాయి. అలాగే సంఘాల నాయకత్వంలో, పార్టీ నాయకత్వంలో జరిగిన భూపోరాటాలు, గిట్టుబాటు ధరల పోరాటాలు, ప్రభుత్వ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు, భారత దోపిడీ పాలక వర్గాలకు గుబులు పుట్టించాయి. అలాగే ఎన్ని పోరాటాలు జరిగినప్పటికీ మన పార్టీ నిర్మాణం విషయాన్ని పరిశీలించినప్పుడు, ఎంత తీవ్రంగా పోరాటాలు జరిగాయో, అంత తీవ్రతలో పార్టీ నిర్మాణం జరగలేదు. కాబట్టి మన పార్టీ బలం ఇంకా బలహీనంగా వుంది.

కనుక పార్టీ బలాన్ని పెంపొందించుకొనుటకై విశాఖ ఏరియా కమిటీ పరిధిలోని కోరుకొండ ఎల్.జి.యస్. ఏరియాలోని మన పార్టీ సభ్యత్వం బలహీనంగా వుండడానికి మన సంఘ నిర్మాణాలలో, పార్టీ నిర్మాణాలలో జరుగుతున్న లోపాలను ఏ విధంగా అధిగమించి ఈ దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని ప్రజాపంథా ద్వారానే సాధ్యపడుతుందని, అవకాశ, మితవాద భావాలు, స్పాంటేనిటీ, సెక్టేరియన్ పోకడలను, పెత్తందారీ తనాన్ని మననుండి తొలగించుకొని సర్వం ప్రజల కోసమనే స్వార్థంతో పనిచేస్తూ గ్రామస్థాయి ప్రజాసంఘాల నుండి పార్టీ నిర్మాణాలను జి.ఆర్.సి.; జి.ఆర్.డి.లను పెంపొందించుకుంటూ బలమైన పార్టీ

నిర్మాణం, బలమైన ఎర్రసైన్యం, బలమైన ఐక్య సంఘటన ద్వారానే నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయగలమనే రాజకీయ అవగాహన కలిగించుటకై ఏరియాలోని కొంతమంది సంఘ నాయకులను, భవిష్యత్‌లో మనకు తోడ్పడగలుగుతారనే వ్యక్తులకు ఒకరోజు చొప్పున 4 బ్యాచీలుగా రాజకీత తరగతులు నిర్వహించటం జరిగింది. తరగతులకు హాజరయిన వారిలో పురుషులు 62 మంది, మహిళలు 33 మంది మొత్తం 95 మంది హాజరయ్యారు.

## శిక్షణా తరగతులు

మన పార్టీ ''ఆర్థిక పాలసీ''ని అమలు చేయటంలో భాగంగా ప్రజలకు మన ప్రజాసంఘాలకు అవగాహన కల్పించుటకై కోరుకొండ యల్.జి.యస్. ఏరియాలో రెండు విడతలుగా తరగతులు నిర్వహించటం జరిగింది. మొదటి విడత తరగతులకు ఆదివాసీ విప్లవ మహిళా సంఘం సభ్యులు 23 మంది 7 గ్రామాల నుండి హాజరైనారు. ఒకరోజు జరిగింది. రెండవ విడత తరగతులకు 20 మంది ఆదివాసీ రైతుకూలీ సంఘం సభ్యులు 9 గ్రామాల నుండి హాజరైనారు. వీరికి కూడా ఒకరోజు నిర్వహించటం జరిగింది.

చైనా అక్టోబరు విప్లవ విజయం 50వ వార్షికోత్సవాల సందర్భంగా ఏరియాలో వున్న ప్రజాసంఘాలు (ఏ.ఆర్.సి.యస్., ఏ.వి.యం.యస్.) కు దీర్ఘకాలిక ప్రజాయుద్ధం, వ్యూహం–ఎత్తుగడలు, ప్రజాపంథాపై రాజకీయ తరగతులు నిర్వహించటం జరిగింది. ఏ.వి.యం.యస్.కు ఒకరోజు, ఏ.ఆర్.సి.యస్.కు ఒకరోజు జరిగింది. తరగతులకు ఏ.వి.యం.యస్. సభ్యులు 30 మంది, ఏ.ఆర్.సి.యస్. సభ్యులు 30 మంది చొప్పున హాజరయినారు. అనంతరం జరిగిన సమావేశానికి ఏ.ఆర్.సి.యస్. అధ్యక్షుడు అధ్యక్షత వహించాడు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ చైనా అక్టోబరు విప్లవ విజయం 50వ వార్షికోత్సవాల ప్రాముఖ్యత గురించి మాట్లాడినారు.

## మెడికల్ క్యాంపు

విశాఖ ఏరియా కమిటీ పరిధి కోరుకొండ యల్.జి.యస్. ఏరియాకు చెందిన గూడెం మండలం తడకపల్లి గ్రామంలో దళం ఆధ్వర్యంలో ఒక మెడికల్ క్యాంపు నిర్వహించాం. ఈ సందర్భంగా సుమారు 100 మంది (పిల్లలు, మహిళలు, పురుషులు) ప్రజలకు వివిధ రకాలైన జబ్బులకు, జ్వరాలకు, మలేరియా తదితర వంటి వాటికి టీకా మందులు, మాత్రలు, ఇంజెక్షన్స్ కూడా ఇవ్వటం జరిగింది. ఈ నేపథ్యంలో జరిగిన సమావేశంలో యల్.జి.యస్. బాధ్యుడు మాట్లాడుతూ ఏరియాలో గత 2, 3 సం॥ల నుండి జరుగుతున్న మలేరియా మరణాలను దృష్టిలో వుంచుకుని పార్టీ ఈ కార్యక్రమం చేపట్టిందని, అయితే ఈ మాదిరి కార్యక్రమాల ద్వారానే మొత్తం సమస్య పరిష్కారం కాదనీ, ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మనం పోరాడ వలసిన ఆవశ్యకతను కూడా మాట్లాడటం జరిగింది. అలాగే మూఢ నమ్మకాలనేవి మన ఆదివాసీల్లో బలంగా వుండటానికి కారణం ఎవరనేది, అలాగే దాన్ని నమ్మడానికి మన ఆదివాసీలు వెనుకబడిన ప్రాంతాల్లో వుండటం, మందులు, మాత్రలు వాడాలని, డాక్టర్లను సంప్రదించాలనే చైతన్యం లేకపోవటం కూడా కారణమనేది ప్రజలకు వివరిస్తూ, ఈ సమస్యకు వ్యతిరేకంగా ప్రభుత్వంతో పోరాడాలని, అందుకు వర్గ సంఘాల్లో సంఘటితమైన నాడే మనం ఈ సమస్యను పరిష్కరించుకుని మెరుగైన వైద్య సహాయం పొందగలుగుతామనేది స్పష్టం చేశాం. అలాగే మీ గ్రామాల్లోని, మీ ఇండ్ల చుట్టుప్రక్కల శుభ్రంగా వుంచుకోవాలనీ, అలాగే వర్షానికి నీరు కలుషితం కావటం మూలంగా నీరును మరిగించి త్రాగాలని సూచించినాము. ఈ క్యాంపుకు గొల్లపల్లి, కొండపల్లి, చెలకవీధి, రెయ్యలగడ్డ, పెబ్బెంపల్లి, తోడకపల్లి గ్రామాల ప్రజలు హాజరయినారు.

## ఐక్యతతో పోరాటం సాధ్యమని నిరూపించిన తునికాకు కార్మికులు

ఏరియాలో రెండు రేంజ్‌లు వున్నాయి. తూర్పు గోదావరిలోని ఏలేశ్వరం రేంజ్, విశాఖలోని నర్సీపట్నం రేంజ్ వేరు వేరు కాంట్రాక్టర్లు తునికాకు సేకరణ కోసం గుత్తకు తీసుకుంటారు. గత సంవత్సరమే ప్రభుత్వానికి 3 సంవత్సరాల గుత్త డబ్బును చెల్లించారు. ఈ తుమ్మ (తునికి) ఆకుల తుప్పలను జనవరిలోనే కొట్టటం (నరకటం) జరుగుతుంది. దీనికి ఉదయం 8.00 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పనికి 16 రూ॥లు ఇచ్చారు. రేట్ల విషయంలో ముందే కోతకు వచ్చినపుడు పోస్టర్లు, వాయిస్‌ల ద్వారా 100 ఆకుల కట్టకు 1.40 పైసల వరకు పోరాడి సాధించుకోవాలని, అదే విధంగా కార్మికులపై వివిధ రకాలుగా (చెలకట్ట పేరుతో కట్టలను తీసుకోవటం) గుమస్తాల నుండి కాంట్రాక్టర్ల వరకు చేస్తున్న దోపిడీ ప్రచారం చేయటం జరిగింది. రేట్ల గురించి ప్రజలు విడివిడిగా అడిగి ఈస్ట్‌వాడు ఎంత ఇస్తే మేం అంత ఇస్తాం అని విశాఖ వాడు, విశాఖవాడు ఎంత ఇస్తే మేం అంత ఇస్తాం అంటూ ఈస్ట్‌వాడు, ప్రజలతో రేట్లు డిసైడ్ చేసుకోవటం కాకుండా ఆరోజు వున్న ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో వుంచుకుని ప్రజల పోరాటశక్తిని నీరుగార్చటానికి కొద్దిమంది అవినీతిపరులైన గుమాస్తాలను తయారు చేసుకుని వారిద్వారా కొద్దిమందితో ఈస్ట్‌వాడు, విశాఖవాడు కూడా ఆకులను కోయించ చూసుకున్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు నిలదీయటం, ఏ.ఆర్.సి.యస్., ఏ.వి.యం.యస్. పత్రికా ప్రకటన అనంతరం, స్క్వాడ్ ఏరియా కమిటీ పత్రికా ప్రకటన తర్వాత ఆకులను కోయించటం నిలుపుదల చేసి ప్రజలతో చర్చలకు దిగివచ్చాడు. విశాఖ పరిధిలో పిట్టచెలమ ఊరిలో చర్చలు జరిగి చివరకు కట్టకు రూ 1.35 పైసలు, డైలీవేజ్ రూ॥ 35.00 లు పోరాడి సాధించుకున్నారు. ఈస్ట్ పరిధిలో లోదొడ్డిలో దళం ప్రజల సమక్షంలో చర్చలు జరిపి పై రేట్లనే సాధించుకోవటమైంది. అదే విధంగా చెలకట్ట పేరుతో కట్టలను తీసుకోవటం కూడా రద్దయింది.

## బానదూళి పెత్తందారీ నుంచి పట్టాలను స్వాధీనం చేసుకున్న ఆదివాసులు

ఒరిస్సా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా గుమ్మ బ్లాకు ఏరియాలో బానదూళి గ్రామ పెత్తందారు, రైతులు అడవి నరికి సాగు చేసుకుంటున్న భూమిని గవర్నమెంటు సర్వే చేసి పట్టాలు ఇచ్చారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆరుగురు రైతుల పట్టాలను ఊరు పెత్తందారు తన వద్ద పెట్టుకుని ఆరుగురి భూమిని కూడా నాకే పట్టా వుందని, వారిని భూమి విడిచిపెట్టి వెళ్ళాలని బెదిరించి ఆక్రమించుకున్నాడు. మరొకప్రక్క రైతులు భూములు లేక అరకొరగా వున్న భూములు పండక ఆకలితో అలమటిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ గ్రామ ప్రజలు దళాన్ని కలిసి సమస్యను ముందుకు తెచ్చారు. అయితే దళం ప్రజలు కలిసి ప్రజాపంచాయితీ నిర్వహించగా దళం సమక్షంలో

ప్రజలు ఊరు పెత్తందారుని పిలిచి విచారించగా, ఎవరి పట్టాలుగానీ, భూములుగానీ తనవద్ద లేవని గ్రామస్తులను దబాయిస్తుండటంతో, ఆగ్రహించిన రైతులు తిరగబడటానికి సిద్ధమవ్వగా లొంగివచ్చి ఆరుగురు రైతుల పట్టాలను, భూమిని అప్పజెప్పడానికి ఒప్పుకున్నాడు.

### మోసపోయిన మహిళకు చేయూతనిచ్చిన ఆదివాసీ మహిళలు

విశాఖ జిల్లా కోరుకొండ యల్.జి.యస్. ఏరియాలో గూడెం మండలం గొందిపల్లి గ్రామంలో ఒక పేద కుటుంబంలో పుట్టిన ఎంకులు, అదే గ్రామానికి చెందిన పొట్టిపడాల్ల మధ్య ప్రేమ కుదిరినట్లు ఎంకులు భ్రమలో పడింది. ఎంకులు అమాయకత్వాన్ని గమనించిన పొట్టి పడాల్ చేతికందిన అవకాశాన్ని జారవిడుచుకోకూడదని ఎంకులును అన్నివిధాలా ఉపయోగించుకోవటం ప్రారంభించాడు. ఆ క్రమంలో ఎంకులు సహజంగానే పెళ్ళి ప్రస్తావన తెచ్చింది. కాని పొట్టి పడాల్ నేడు రేపు అంటూ పెళ్ళిని వాయిదా వేస్తూ కాలాన్ని వెళ్ళదీస్తున్న సమయంలో, ఎంకులు గ్రామంలో వున్న ఏ.వి.యం.యస్., ఏ.ఆర్.సి.యస్. ముందుకు తెచ్చింది. ప్రజా సంఘాలు తమ సంఘాల్లో చర్చించుకుని వారిరువురికీ పెళ్ళి చేయాలని నిర్ణయానికి వచ్చి, గ్రామంలో ప్రజాపంచాయితీని నిర్వహించి పెళ్ళి సమస్యను మాట్లాడగా పొట్టి పడాల్ మొండిగా ఎంకులుకి తనకు మధ్య ఎలాంటి సంబంధం లేదన్నాడు. ఎంకులు మాత్రం పూసగుచ్చినట్లు వివరాన్ని ఏకరువు పెట్టింది. ఎంకులుతో పొట్టి పడాల్‌కు వున్న సంబంధాలను గమనించిన ప్రజలు నిజం చెప్పటంతో పెళ్ళి చేసుకుంటానని అంగీకరించాడు. దీంతో ప్రజాసంఘాలు, ప్రజలు కలిసి తమకు తోచిన రీతిలో విప్లవపు పెళ్లి చేశారు. అయితే ఈ కాపురం చిరకాలం నిలుస్తుందన్న నమ్మకం లేదని ప్రజలు–ప్రజాసంఘాలు రేపటి రోజు పొట్టి పడాల్ ఎంకులుకి అన్యాయం చేస్తే, ఆమె జీవితం దుర్భరం కాకూడదనే ముందుచూపుతో ఆమెకు అన్యాయం చేయనని కాగితాలు రాయించుకున్నారు.

అయితే ప్రజాసంఘాలు, ప్రజలు ఊహించిన విధంగానే ఎంకులును పొట్టి పడాల్ మోసగించాడు. పెళ్ళి అయి 6 నెలల గడవక ముందే గ్రామాన్ని విడచి చింతపల్లి పరిసర ప్రాంతంలో వున్న తన బంధువుల దగ్గర మకాం పెట్టాడు. పొట్టి పడాల్ పరిస్థితి ఆచరణ అనుభవించి కనువిప్పు కలిగిన ఎంకులు మళ్ళీ ప్రజాసంఘాల ముందు విలపించింది. మళ్ళీ ప్రజాసంఘాలు గ్రామంలో ప్రజాపంచాయితీ నిర్వహించి ఎంకులును, పొట్టి పడాల్‌ను మందలించి, ఎంకులు కోరుతున్నట్లుగా, ఆమె బ్రతకడానికి కావాల్సిన నష్ట పరిహారం భూమి రూపంలో చెల్లించాలని తీర్పు చెప్పగా, పొట్టి పడాల్ తన వాటా భూమి నుండి రెండు మడి చెక్కలు (రెండు పొలాలు, 20 సెంట్లు) ఇవ్వడానికి అంగీకరించాడు. ఈ తీర్పు అమలుకు 5 గురితో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు వున్నారు.

ఎంకులు మొదట పొట్టి పడాల్‌ను అతివిశ్వాసంతో నమ్మి మోసపోయిందనీ, తన జీవితం మంచి మలుపు తిరుగుతుందని ఆశపడి అన్నివిధాలా నష్టపోయిందని ఏ.వి.యం.యస్. వివరించింది. ఈ వ్యవస్థలో మహిళలకు ఎలాంటి భద్రత లేదనీ, పితృస్వామ్య వ్యవస్థలో డబ్బు, అధికారపు హోదాలే అన్నింటినీ మించి పోయాయని, ప్రేమ–పరస్పర అవగాహనలకు, ఆశలకు–ఆశయాలకు ఈ దోపిడీ వ్యవస్థలో స్థానం లేకుండాపోయి, మహిళలు అడుగడుగున వంచించ బడుతున్నారని, ఎంకులు లాంటి అభాగినులు పోరాట మార్గాన్ని ఎంచుకోక తప్పదని స్పష్టం చేశారు.

పత్రికా రిపోర్టు

### టి.డి.పి.కి చెందిన ప్రజాద్రోహి, అవినీతిపరుడిని నిలదీసిన గిరిజనులు

విశాఖ ఏరియా పరిధిలోని కోరుకొండ ఎల్.జి.యస్. ఏరియా గూడెం కొత్తవీధి మండలంలోని, గూడెం గ్రామానికి చెందిన ముక్కలి కామేశ్వరరావు తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా వుంటూ అవినీతి, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ చాలాకాలం నుండి, దోపిడీ ప్రభుత్వం వైపు నుండి వస్తున్న చేదోడు వాదోడు స్కీములైన పెంకులు, స్కూలు బిల్డింగ్స్ కోసం, ముఖ్యంగా పెంకుల కోసం గదబగొండిపల్లి అనే గ్రామం నుండి 4 సం॥ల క్రితం 500 రూ॥లు పెంకుల కోసమని వాడుకుని పెంకులు తెచ్చి ఇవ్వకుండా, అలాగే స్కూలు బిల్డింగ్ కట్టడంలో కూలీ పనులు చేసిన వారికి డబ్బులు చెల్లించకుండా తప్పించుకుని తిరిగేవాడు. జి.పి.లో మన సంఘ నాయకులను తమ టి.డి.పి. పార్టీలో చేరండని వత్తిడి తెచ్చేవాడు. ఇలాంటి ప్రజా వ్యతిరేక, అవినీతిపూరిత కార్యక్రమాలకు పాల్పడుతున్న కామేశ్వరరావును నాలుగు గ్రామాలకు చెందిన 100 మంది ప్రజల మధ్య నిలదీసి వాళ్ళకు ఇవ్వవలసిన పెంకులు, కూలి డబ్బుల్లో, గొందిపల్లి వారికి కూలీ డబ్బులు 10,000 రూ॥లు ఇవ్వవలసి వుండగా ఆ గ్రామస్థులంతా ఇంతకాలం ఆలస్యం అయినందుకు పదివేలకు, పదివేలు కలిపి 20 వేల రూ॥లను ఇవ్వాలని డిమాండ్ చేయటంతో, ఇస్తానని ఒప్పుకున్నాడు. ఇంకొక ప్రక్క గ్రామంలో పెంకులు ఇప్పిస్తానని 5 వందల రూ॥లు తీసుకొని 4, 5 సం॥లు అయినా ఇప్పించనందుకు ఆ గ్రామస్థులు 500 రూ॥లకు 500 రూ॥లు వడ్డీ కలుపుకుని చెల్లించాలని డిమాండ్ చేయటంతో దీన్ని కూడా ఇస్తానని ఒప్పుకున్నాడు. అలాగే బోనంగిపల్లె గ్రామానికి చెందిన నాగేశ్వరరావు వద్ద నుండపి 4,500 రూ॥లు అడిగి కూలీలకు చెల్లించి మరలా ఆయనకు తిరిగి ఇవ్వలేదు. కాబట్టి ఈయన 4,000 రూ॥లు రొక్కం కూడా జూన్ 15 తేదీ లోపు చెల్లిస్తానని హామీ పత్రం రాసి ఇచ్చాడు. చెల్లించక పోతే ప్రజాకోర్టులో శిక్షిస్తామని ప్రజలు హెచ్చరించారు.

అలాగే ఓటు వేయండని, తమ పార్టీలో చేరండని వత్తిడి చేసినందుకు ఈయనను టి.డి.పి. పార్టీకి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేయటంతో ప్రజల మధ్య నిలబడి, ప్రజలకు దండం పెట్టి నన్ను క్షమించండి. ఇంక రాజకీయాలతో జోక్యం చేసుకోనని ప్రజలకు క్షమాపణ చెప్పాడు. ఈ విధంగా ఈ ప్రజా వ్యతిరేక అవినీతి పరుడిని ప్రజలు ఐక్యమై మెడలు వంచి తగిన బుద్ధి చెప్పారు.

అక్రమాలకు పాల్పడుతున్న సర్పంచ్, సెక్రటరీ, సేల్స్‌మెన్‌లను ప్రజా పంచాయితీలో నిలదీసిన ఆదివాసీలు

ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా గుమ్మ బ్లాకు ఏరియాలో రాళ్ళగెడ్డ పంచాయితీ సర్పంచ్, పంచాయితీ సెక్రటరీ, నిత్యావసరాల డిపో సేల్స్‌మెన్ ముగ్గురూ ఏకమై, పంచాయితీకి చెందిన నిధులు ప్రజల కోసం ఖర్చు చేస్తున్నామన్న పేరుతో అక్రమార్జనకు దిగారు. అలాగే ప్రజలకు నిత్యావసరాల కోసం పంపిణీ చేస్తున్న దాంట్లో కూడా బ్లాక్‌మెయిల్

చేస్తున్నారు. పై విషయాలు జనాలు తెలుసుకుని నిలదీస్తే వారిపై దౌర్జన్యం చేయటం, బెదిరించటం చేస్తున్నారు. సర్పంచ్, సెక్రటరీ కలిసి పంచాయితీ నిధులను వివిధ అభివృద్ధి పనుల పేరున కాజేయటం, రోజు కూలీ వేతనంగా కాకుండా కాంట్రాక్టు పని చేయిస్తూ కూలీల శ్రమ ఫలితాన్ని కూడా దోచుకుంటున్నారు. ప్రజలకు అందవలసిన నిత్యావసర సరుకులను కూడా కోటా పద్ధతిలో కాకుండా తమ ఇష్టం వచ్చినట్లు పంపిణీ చేస్తూ మిగిలిన దాన్ని బ్లాకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలకు చాలినంత కోటా అందక అనేక ఇబ్బ,దులు ఎదుర్కొంటున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిని కొట్టటం చేస్తున్నారు. పై అక్రమాలకు, దౌర్జన్యాలకు సర్పంచ్ తనకున్న అధికారాలను వుపయోగిస్తున్నాడు. అందుకనే తన అక్రమాలకు అడ్డు లేకుండా పోతుంది. ఇలాంటి దౌర్జన్యం వల్లనే ఒక అమాయక రైతు ప్రాణాలు కూడా కోల్పోయాడు. పై ముగ్గురు చేస్తున్న అక్రమాలకు, దౌర్జన్యాలకు విసిగిపోయిన ప్రజలు ప్రజా పంచాయితీ నిర్వహించి తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారు. పంచాయితీ నిర్వహించటానికి 9 మందితో ఒక కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ పంచాయితీకి చెందిన గ్రామాలకు పై ముగ్గురి అక్రమాలను వివరిస్తూ ప్రచారం చేసి 2000 జనవరి నెలలో 500 మందితో పంచాయితీ నిర్వహించి సర్పంచ్‌ను, సెక్రటరీని, సేల్స్‌మెన్‌లు చేస్తున్న అక్రమాలను వివరించగా తమ తప్పులను ఒప్పుకోవటంలో మొండి వైఖరి అవలంభిస్తున్న ముగ్గురిపై ప్రజలు ఆగ్రహంతో దాడిచేసి సేల్స్‌మెన్‌ను కొట్టగా మిగిలిన ఇద్దరు కూడా లొంగి వచ్చి చేసిన అక్రమాలను ఒప్పుకుని, ప్రజలు పెట్టిన 4 డిమాండ్స్ కూడా ఒప్పుకుని, 50 గుంజీలు చొప్పునతీసి, ప్రజలకు క్షమాపణ చెప్పుకున్నారు.

* తూకం సక్రమంగా జరగాలి. ఎవరి కోటా వారికి సక్రమంగా ఇవ్వాలి.

* కార్డులు లేని వారికి 5 కేజీల బియ్యం, మిగిలిన సరుకులు ఇవ్వాలి.

* పంచాయితీకి చెందిన అభివృద్ధి పనులు, ఏ గ్రామానికి చెందినది ఆ గ్రామస్థులకే పని కల్పించి, రోజుకూలీ 40 రూ॥లు ఇవ్వాలి. కాంట్రాక్టు పని బంద్ పెట్టాలి. అనే డిమాండ్స్‌ను కూడా సాధించుకున్నారు.

## ప్రజా పంచాయితీ

కోరుకొండ ఎల్.జి.యస్. ఏరియా ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా గుమ్మ బ్లాక్‌లోని పలగరేవు దగ్గర రాళ్ళగెడ్డ పంచాయితీ గ్రామాల ప్రజల కోసం ప్రభుత్వం ఒక నిత్యావసర సరుకుల డిపోను నడిపిస్తున్నది. 2000 జనవరి నెలలో నిత్యావసర సరుకుల కోసం చీకటిపల్లి గ్రామం నుండి నారాయణ, మరొక రైతు ఇద్దరు కలిసి పలగరేవుకు వచ్చారు. అదే రోజు అక్కడ వారం సంత కూడా జరుగుతోంది. దీనితో నిత్యావసరాల డిపో దగ్గర రద్దీ ఎక్కువయి జనాలు తోపులాడుకుంటున్నారు. అదే సమయంలో స్థానిక సర్పంచ్ వచ్చి డిపో దూరి తనకు కావాల్సిన సరుకులు తీసుకుని, అలాగే తనకు దగ్గరి వారికి, తన చుట్టాలకు ముందు ఇచ్చిన తరువాతనే మిగతా వారికి ఇవ్వాలని సేల్స్‌మెన్‌తో చెప్పటంతో, సేల్స్‌మెన్‌కు రైతులిద్దరితో గొడవ జరిగింది. ఇందులో సర్పంచ్ జోక్యం చేసుకుని వీళ్ళిద్దరిని (చీకటిపల్లి రైతుల్ని) చితకబాది పక్కనున్న నదిలోకి నెట్టడానికి తీసుకెళ్తుండగా అక్కడ వున్న కొంతమంది సంతవాళ్ళు అడ్డుకుని విడిపించారు. ఆ తరువాత దిక్కుతోచని స్థితిలో పడివుండి, వుదయానికి వేరే వారి సహాయంతో గ్రామానికి ఆ రైతులు చేరుకున్నారు. వారం రోజులు గడిచిన తరువాత ఇద్దరిలో నారాయణ చనిపోయాడు. ఇద్దరు పిల్లలు, భార్య దిక్కులేని వారయ్యారు. పై విషయాన్ని బాధితుని కుటుంబం దళం ముందుకు తీసుకురాగా, దళం పనుల రీత్యా ఈ సమస్యను సకాలంలో పరిష్కంచరించ పూనుకోలేదు. ఈ విషయం దళం దగ్గరికి వెళ్ళిందనే విషయాన్ని తెలుసుకున్న సర్పంచ్ మాజీ సంఘ నాయకులను కలుసుకుని తన తప్పును కప్పిపుచ్చుకోవటానికి మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లిస్తానని భ్రమింపజేసి, తన దగ్గరకు పిలిపించుకుని మాజీ సంఘనాయకులు, సర్పంచ్ కలిసి మృతుని కుటుంబాన్ని మీరు అన్నలకి ఫిర్యాదు చేశారు కాబట్టి మిమ్మల్ని పోలీసు ఠాణాకు తీసుకెళ్ళి అరెస్ట్ చేయిస్తానని బెదిరించినారు. ఈ విషయం తెలుసుకున్న దళం వెంటనే ప్రజా పంచాయితీ నిర్వహించాలని అనుకుని చుట్టుప్రక్కల నుండి ప్రజలను కూడగట్టి సర్పంచ్, మృతుని కుటుంబాన్ని పిలిపించి ప్రజాపంచాయితీ నిర్వహించి సర్పంచ్‌ను విచారించటం జరిగింది. మొదట సర్పంచ్ మొండిగా తను ఏ తప్పూ చేయలేదని, నారాయణ మరణంతో తనకెలాంటి సంబంధం లేదని దబాయించాడు. కానీ ఆరోజు జరిగిన సంఘటనను ప్రత్యక్షంగా చూసినవారు, అలాగే ఆ ఇద్దరు రైతులలో బ్రతికి వున్నతను కూడా సర్పంచే బాధ్యుడని చెప్పటంతో ఇక తన ఆటలు సాగవని ప్రజల సమక్షంలో తన తప్పును ఒప్పుకున్నాడు. అయితే నష్ట పరిహారం ఏ రూపంలో ఇప్పిస్తే బాగుంటుందని ప్రజల అభిప్రాయం కోరగా, ప్రజలు 25 వేల రూ॥లు, 3 బస్తాల బియ్యం డిమాండ్ చేయాలని చెప్పారు. అదే అభిప్రాయాన్ని మృతుని కుటుంబం కూడా చెప్పటంతో దాన్నే ప్రజా తీర్పుగా ప్రకటించారు. దానికి సర్పంచ్ కూడా అంగీకరించాడు. అలాగే సమస్య ప్రక్కతోవ పట్టించడానికి సర్పంచ్‌కి సహకరిస్తూ వచ్చిన మాజీ సంఘనాయకులను ప్రజల ముందు పెట్టి హెచ్చరించారు. సర్పంచ్ చెప్పిన మాటలకు తలజగ్గి ఇద్దరు అమాయక రైతులను కొట్టిన వారిని కూడా ప్రజల ముందు హెచ్చరించారు.

## నకిలీ నక్సలైటుకు బుద్ధి చెప్పిన ప్రజలు

విశాఖ ఏరియా కమిటీ పరిధిలోని కోరుకొండ ఎల్.జి.యస్. ఏరియా గూడెం మండలానికి చెందిన సిరిబాలు గ్రామానికి చెందిన ఏబులం రామచందర్ అనే వ్యక్తి నకిలీ నక్సలైట్ల పేరుతో ఒక ముఠాని నడుపుతూ వివిధ వర్గాల నుండి (వ్యాపారులు, రాజకీయ నాయకులు, ప్రజలు) పెద్ద మొత్తంలో డబ్బును వసూలు చేయటం, ఇవ్వని వారిపై బెదిరించటం, తుపాకి చూపించి దాడి చేస్తామని హెచ్చరించి, తమకు లొంగే విధంగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతుండేవారు. ఒకసారి పోలీసులకు పట్టుబడి జైలుకు కూడా వెళ్ళినారు. ఈ మధ్య మనం ధారకొండ పోలీసు ఔట్‌పోస్టుపై దాడి చేసిన మరుసటి రోజే మన పార్టీ పేరు మీద వుత్తరం రాసి చింతపల్లికి చెందిన ఒక వ్యాపారి వద్ద నుండి 5 వేల రూ॥లను వసూలు చేశారు. ఇదే మాదిరిగా గతంలో జి.మాడుగుల, పాడేరు తదితర ప్రాంతాల్లో కూడా దోపిడీలకు పాల్పడిన సంఘటనలు వున్నాయి. పై విషయాలు మన దళం ఏరియాలో వుంటున్న క్రమంలో ప్రజల దగ్గర నుండి అలాగే మనకు పరిచయాలున్న ఇతరుల ద్వారా కూడా పై ముఠా కార్యక్రమాల సమాచారం తెలుసుకోవటం జరిగింది. పై సమాచారాన్ని ఆధారం చేసుకుని ఆ గ్రామం (సిరిబాలు)లో, చుట్టుప్రక్కల గ్రామాల వారిని కూడా పిలిపించి, ప్రజాకోర్టు నిర్వహించి, విచారించగా మొదట తను ఏ తప్పూ చేయలేదని, పై విషయాలతో నాకెలాంటి సంబంధం లేదని, నేను

వ్యవసాయం చేస్తూ బ్రతుకుతున్నానని చెప్పి మొండికేశాడు. ప్రజలు తనపై ఎంత ఒత్తిడి తెచ్చినా తను నిజాలు చెప్పక పోవటంతో, మన దగ్గర వున్న సమాచారాన్ని ప్రజలముందు వుంచటంతో ఇక చేసేది లేక, తను చేసిన తప్పులను ఒప్పుకుంటూ, ఇప్పటివరకూ చేసిన తన ముఠా కార్యక్రమాలను కూడా ప్రజల ముందు బయట పెట్టినాడు. తను చేసిన తప్పులకు గ్రామంలో ఊరేగించారు. అలాగే తనని కట్టడి చేయటానికి ప్రజలు కొన్ని షరతులు విధిస్తూ తీర్పు చెప్పారు.

1. గ్రామం నుండి బయటకు వెళ్ళే ముందు ఎక్కడికి వెళ్తున్నది, ఎవరి దగ్గరికి వెళ్తున్నది, ఎప్పుడు తిరిగి వచ్చేది, కాగితంలో రాసి ప్రజలకు ఇవ్వాలి. ఈ షరతులు ఉల్లంఘిస్తే గ్రామ బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

### ప్రచారం

* రాష్ట్రంలో టి.డి.పి. ప్రభుత్వం చేపట్టిన 11వ విడత జన్మభూమి కార్యక్రమాన్ని బహిష్కరించాలని పిలుపునిస్తూ, సుమారు 50 వాల్ పోస్టర్లు ఏరియాలో వేశారు.

* ప్రజలు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, షావుకార్ల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 100 పోస్టర్లు ఏరియాలో వేశారు.

* విశాఖ జిల్లాలో పోలీసులు నిర్వహిస్తుండిన కౌన్సిలింగ్‌ను బహిష్కరించాలని ప్రజలకు, ఉద్యమ కార్యకర్తల కుటుంబాలను కోరుతూ ఏరియాలో 50 పోస్టర్లు వేశారు.

* ఫిబ్రవరి 18న విశాఖ జిల్లా దారకొండ పోలీసు ఔట్‌పోస్టుపై దాడి జరిగిన సందర్భంగా అమరులైన కా॥ శ్రీధర్, బాలక్రిష్ణల అమరత్వాన్ని ప్రజలకు వివరిస్తూ 70 పోస్టర్లు, 10 బ్యానర్లు వేశారు. మూడు చోట్ల గూడెం మండలంలోని చెక్కరాయి, చింతపల్లి మండలంలోని బురదమామిడి, మల్కన్‌గిరి జిల్లా గుమ్మ బ్లాక్‌కు చెందిన దాగుడు పల్లిలలో బహిరంగ సభలు కూడా జరిగాయి.

* 1999 డిసెంబర్ 2న కొయ్యూరులో అమరులైన కేంద్రకమిటీ సభ్యుల బూటకపు ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా, ప్రభుత్వం అమలు చేస్తున్న ఫాసిస్టు నిర్బంధ కాండను వ్యతిరేకిస్తూ ఏరియాలో 60 పోస్టర్లు వేశారు.

* మే 16న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మల్కన్‌గిరి జిల్లా గుమ్మ బ్లాక్ పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వం, పోలీసులు నియమిస్తున్న చౌకిదారు (గ్రామ పోలీసు) లపై 30 పోస్టర్లు వేసి, చౌకిదారులు వెంటనే చౌకిదారు పని మానివేయాలి, అలాగే కొత్తగా ఎవరూ చౌకిదారు ఉద్యోగానికి వెళ్ళకూడదు, ప్రజల్ని మోసం చేయడానికి, ప్రజల మధ్య తగాదాలు సృష్టించడానికి ప్రభుత్వం, పోలీసులు చేస్తున్న కుట్ర వంటి విషయాలను రాసి ప్రచారం చేశారు.

* జనవరి 26న బ్లాక్ డే గా పాటించాలని, జాతీయ జెండా ఆవిష్కరణను బహిష్కరిస్తూ, దాని స్థానంలో నల్లజెండా ఎగురవేసి, స్వాతంత్ర్య బూటకత్వాన్ని తెలియజేయాలని పిలుపునిస్తూ ఏరియాలో 45 పోస్టర్లు వేశారు.

### కాగడాల ప్రదర్శన

1999 డిసెంబరు 31న కోరుకొండ ఎల్.జి.యస్. పరిధిలోని విశాఖ జిల్లా గూడెం మండలంలో చైనా అక్టోబరు విప్లవ విజయం 50వ వార్షికోత్సవాల సందర్భంగా 5 గ్రామాల ప్రజలు సుమారు 100 మంది ఆర్.వి. నగర్ సెంటర్ నుండి కోరాపల్లి గ్రామం వరకు కాగడాలతో ప్రదర్శన నిర్వహించినారు. ప్రదర్శనకు 20 మంది మహిళలు కూడా హాజరయినారు. ప్రదర్శనకారులు మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి!, గ్రామ రాజ్య కమిటీలకే సర్వాధికారాలు! నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి! వంటి పలు నినాదాలు ఇచ్చారు. ఏరియాలో సుమారు 50 పోస్టర్లు వేయటం జరిగింది.

### డిసెంబర్ 6న హిందూ మతోన్మాద వ్యతిరేక దినం పాటించిన ఆదివాసీలు

కోరుకొండ ఎల్.జి.యస్. ఏరియాలోని విశాఖ జిల్లా గూడెం మండలం తడకపల్లి గ్రామంలో డిసెంబర్ 6న సుమారు 13 గ్రామాల నుండి 250 మంది ప్రజలు తరలివచ్చి హిందూ మతోన్మాద వ్యతిరేక దినాన్ని పాటించారు. ఆ సందర్భంగా జరిగిన సమావేశానికి విశాఖ ఏరియా కమిటీ సభ్యుడు అధ్యక్షత వహించారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ దేశంలో మైనారిటీలపై జరుగుతున్న అత్యాచారాలను, సజీవ దహనాలను ఖండిస్తూ, హిందూ మత దురహంకారాన్ని ఎదుర్కోవడానికి మతపరమైన మైనారిటీలు, పీడిత వర్గాలు, పీడిత కులాలు, దళితులు, జాతులు అందరూ సమైక్యంగా హిందూ ఫాసిజాన్ని ఓడించడానికి అన్ని రకాల పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఊరేగింపు నిర్వహించి, హిందూ మతోన్మాద నాయకులైన ఎల్.కె. అద్వానీ, ఏ.బి. వాజ్‌పేయి, బాల్‌థాకరే వంటి వారి దిష్టి బొమ్మలను ప్రజలు తగుల పెట్టారు. హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

### విప్లవోత్సాహంతో జరిగిన అంతర్జాతీయ మహిళా దినం

తరతరాలుగా స్త్రీలపై జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా గత 90 సం॥లుగా మార్చి 8 ని అంతర్జాతీయ మహిళా దినంగా, పోరాటానికి సంకేతంగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా విశాఖ జిల్లా కొయ్యూరు మండలం పలకజీడి ప్రాంతంలో అంతర్జాతీయ మహిళా దినం ప్రాముఖ్యతను అర్థం చేయిస్తూ ఏడుగురితో కూడిన మహిళా టీం 15 గ్రామాలు తిరిగి క్యాంపెయిన్ చేశారు. 2000 మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినం గంగవరం గ్రామంలో 15 గ్రామాల ఆదివాసీ విప్లవ మహిళా సంఘం ప్రతినిధులు 200 మంది హాజరై జరుపుకున్నారు.

ఈ సభకు ఎల్లవరం దళం డిప్యూటీ కా॥ స్వర్ణ అధ్యక్షత వహించి విశాఖ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన స్త్రీలపై భూస్వాములు, షావుకార్లు, గ్రామ మునసబులు, పెత్తందార్లు ఆచార కట్టుబాట్లు విధించడం ద్వారా ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అణచివేతకు గురి చేస్తున్నారని, స్త్రీలకు గవర్నమెంటు 33% రిజర్వేషన్లు కల్పిస్తానని ఈరోజు చంద్రబాబు ఉపన్యాసాలు ఇవ్వడమే జరుగుతున్నది కానీ మహిళలు ఒక అడుగు కూడా ముందుకు వేయలేక పోతున్నారని ఈ సమాజాన్ని మార్చాలంటే, తిరుగుబాటే మహిళల ముందు వున్నదని మాట్లాడింది.

ఈ సభకు వచ్చిన వక్తలు కా॥ భగత్, అనిత, ప్రసాద్‌లు మాట్లాడారు. భూస్వామ్య సంస్కృతికి వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ విప్లవకరమైన ఉత్సాహంతో డిమ్సాలు, నృత్యాలు, పాటలు పోరాట స్ఫూర్తితో అంతర్జాతీయ మహిళా దినం సభ ముగిసింది.

విశాఖ జిల్లా కోరుకొండ ఎల్.జి.యస్. ఏరియాలోని గూడెం మండలానికి చెందిన 6 గ్రామాల నుండి 20 మంది మహిళలకు అంతర్జాతీయ మహిళా దినం సందర్భంగా సి.సి. రూపొందించిన మహిళా ఓరియంటేషన్ సర్క్యులర్‌ను అవగాహన కోసం ఒకరోజు క్లాసు రూపంలో నిర్వహించి , మహిళల సమస్యలను చర్చించారు. చివరకు బాల్య వివాహాలు, బలవంతపు పెళ్ళిళ్ళు, బహు భార్యాత్వంపై తీర్మానాలుగా నిర్ణయించినారు. అలాగే మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా దినాన్ని గొందిపల్లి గ్రామంలో జరుపుకునాన్ము. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఏ.వి.యం.యస్. సభ్యులు వక్తలుగా వున్నారు. అలాగే ఏ.ఆర్.సి.యస్. నుంచి కూడా ఒకరు మాట్లాడినారు. సమావేశంలో సమాజంలో స్త్రీలపై జరుగుతున్న అన్ని రకాల అణచివేతను, అలాగే ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న కుల కట్టుబాట్లు, కులపెద్దల పెత్తనం, ఆదివాసేతరుల అణచివేతను ఎదుర్కోవడానికి ఆదివాసీ మహిళలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సభ మహిళా ఓరియంటేషన్ క్లాసు సందర్భంగా నిర్ణయించిన బాల్య వివాహాలు, బలవంతపు పెళ్ళిళ్ళు, బహు భార్యాత్వం అను మూడు తీర్మానాలుగా ఆమోదించింది. సమావేశానికి 6 గ్రామాల నుండి 100 మంది మహిళలు పాల్గొన్నారు. 10 మంది పురుషులు కూడా ఇందులో వున్నారు.

## తూర్పు కనుమలలో అమరుల సంస్మరణ

తూర్పు కనుమలలో అనేక చోట్ల జరిగిన అమరుల సంస్మరణ సభలు అమరుల స్ఫూర్తినీ, వారి ఆశయాన్ని కొనసాగించాలనే పట్టుదలనూ అందించాయి. జూలై 28 నుంచీ ఆగస్టు 3వ తేదీ వరకూ పాటించిన సంస్మరణ వారానికి ముందుగానే కామ్రేడ్స్ అనిత, బంగార్రాజు, సత్తిబాబుల సంస్మరణ సభలు జరిగాయి. ఆ తరువాత మోటు అమరుల సంస్మరణ సభలు జరిగాయి.

కర్నాటక రాష్ట్రం నుంచీ పార్టీ నిర్ణయం మేరకు తూర్పు కనుమలలో పి.జి.ఏ. గురించీ, ఆదివాసీల గురించీ అధ్యయనం చేయడానికి వచ్చిన కామ్రేడ్ రాజేశ్వరి అనిత పేరుతో పల్లెల్లో తిరిగింది. అనిత వున్న దళం గురించి సమాచారం తెలుసుకున్న పోలీసులు చుట్టుముట్టి చేసిన కాల్పుల్లో అమరురాలైంది అనిత. పలకజీడి, గాలికొండ దళాలతో వున్న కా॥ అనిత చూపిన చొరవ, ఆసక్తి, ఆప్యాయతలను కామ్రేడ్లంతా సభల సందర్భంగా తలచుకున్నారు. గాలికొండ ప్రాంతంలో యాక్షన్‌లో అమరులైన మిలీషియా కామ్రేడ్స్ బంగార్రాజు, సత్తిబాబులు చిన్ననాటి నుండి బాలల సంఘంలో పనిచేస్తూ పార్టీకి ఎంతగా సహకరించారో, ఎంతగా సాహసంతో పార్టీ పనులలో భాగమయ్యారో వారి సంస్మరణ సభలో వక్తలు వివరించారు.

పార్టీ అవసరాల కోసం కళాకారుడిగా బాధ్యతలు చేపట్టిన కా॥ దివాకర్ పార్టీ కార్యాచరణలో కళాకారుడిగా, కార్యకర్తగా, నాయకుడిగా ఎదిగిన క్రమం గురించి ఒక క్యాంపులో జరిగిన సభలో వివిధ దళాల సభ్యులు గుర్తు చేసుకున్నారు.

ఇక అమరుల సంస్మరణ వారం పలకజీడి దళ ప్రాంతంలో జూలై 24న ప్రారంభమయ్యింది. జననాట్యమండలి పాటలు, నృత్యం, నాటికలు ఈ సభలలో ప్రధానమైనవి. ఇక్కడి ఆదివాసీ కోంధు భాషలోకి తర్జుమా చేసిన పది పాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అలాగే ఆదివాసీ ప్రజలు వున్న ప్రాంతాలలో ఒడియా భాషలో మాట్లాడారు. పేదల రాజ్యాన్ని రాకుండా చెయ్యడానికి భారత ప్రభుత్వం నలభై లక్షల సైన్యాన్ని పోషిస్తున్నదనీ, దాన్ని ఎదిరించి, ప్రజా రాజ్యాధికారం ఏర్పరుచుకోవడానికి ప్రతి పల్లె, ప్రతి ఇల్లు, ప్రతి ఒక్కరూ తమ వంతు పని చెయ్యాలని ఈ సభలలో ప్రసంగించిన వారు పిలుపునిచ్చారు. అప్పుడే అమరుల ఆశయాన్ని కొనసాగించిన వారమవుతామన్నారు. కా ॥ బంగార్రాజు తల్లి, మరో అమరుడు కా॥ టుంబ్రి చెల్లి ఈ సభలకు వచ్చి స్థూపావిష్కరణ, జెండా ఆవిష్కరణ చేసారు. 60 గ్రామాల పరిధిలో జరిగిన ఆరు సభలలోనూ సంఘ సభ్యులూ, మిలీషియా సభ్యులూ చురుకుగా పాల్గొన్నారు. పోలీసులు వదిలి వెళ్ళిన ఒక హాండ్ గ్రైనేడ్‌ను స్థానిక ప్రజలు ఒక సభకు భద్రంగా తీసుకు వచ్చి ఇచ్చారు. వందల్లో హాజరయిన ప్రజలు అమరత్వాన్నే కాక, ప్రతిఘటనను కూడా ఎంత గాఢంగా గుర్తించారో ఈ సంఘటన రుజువు చేస్తోంది. గాలికొండ ప్రాంత ప్రజలు ఇలా వుంటే, కోరుకొండ ప్రాంతంలో మిలీషియా సభ్యులు 40 మంది పోలీసు బృందం మీద సోపు బాంబులు వేసి తరిమేసారు. ఆ తరువాత పోలీసులు మాటుగాసిన ప్రాంతంలోని 160 మందితో అమరుల సంస్మరణ సభ విజయవంతంగా జరిగింది. సంస్మరణ సభల వారంలో భాగంగా ఈస్ట్ డివిజన్ కమిటీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ జె.యన్.యం. బాధ్యుడు కా॥ కిరణ్ పత్రికా విలేకరుల సమావేశం జరిపారు. టేకుగూడ ప్రాంతంలో 300 మందితో ఒక సభ జరిగింది. దళ సభ్యులే కాకుండా, మిలీషియా, సంఘ సభ్యులు అమరత్వం గురించీ, పోరాట ఆవశ్యకతను గురించీ ఈ సభలలో మాట్లాడిన వైనం ఎంతో స్ఫూర్తివంతంగా వుంది.

అమరుల సంస్మరణ వారం ముగిసిన ఆరు రోజులకే ఆగస్టు 9వ తేదీన ఒరిస్సా రాష్ట్రం మోటు పోలీసు స్టేషను మీద దాడిలో కామ్రేడ్స్ క్రాంతి రణదేవ్, విజయ్, మల్లేష్‌లు అమరులయ్యారు. కా॥ విజయ్ కోరుకొండ దళ కమాండర్. మిగతా ఇద్దరిలో కా॥ రణదేవ్ దక్షిణ బస్తర్ డి.సి.యం., మల్లేష్ ప్లటూన్ సభ్యుడు. మోటు అమరుల సంస్మరణ సభ మొదటగా రెయిడ్ క్యాంపులో జరిగింది. ఆ తరువాత సమాచారం తెలిసి, మరో క్యాంపులోనూ, గాలికొండ, కోరుకొండ ప్రాంతాలలోనూ జరిగింది. గాలికొండలో 19వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ ఏడు గ్రామాలలో సభలు జరిగాయి. రెండుచోట్ల బాలల సంఘాలతో ఊరేగింపు జరిగింది. విజయాలనూ, అమరత్వాన్ని సమానంగా చూడగలగాలని అంటూ, అమరుల జీవిత, కార్యాచరణ విశేషాలను వక్తలు వివరించారు. తూర్పు కనుమల ప్రజానీకం జీవితాలలో మమేకమైన కా॥ రణదేవ్ ఉద్యమావసరాల రీత్యా తమ నుండీ ఏళ్ళ క్రితమే దూరమైనప్పటికీ, డివిజన్ క్యాడర్, ప్రజానీకం తాము గుండెల్లో దాచుకున్న స్మృతులను పరుచుకున్నారు. పంచుకున్నారు. ఉద్యమాభివృద్ధిలో కా॥ రణదేవ్ పాత్రను డివిజన్ ఉద్యమానికి తన పాత్రను మరోసారి గుర్తు చేసుకున్నారు. 1985లో శత్రువు మీద మొదటి దాడిలో మొదటి దెబ్బ తీయడంలో ముందున్న కా॥ రణదేవ్ ప్రతిఘటన క్యాంపెయిన్‌లో అమరుడయ్యాడు.

కోరుకొండ దళ ప్రాంతంలో జరిగిన మూడు సభలలో మిలీషియా సభ్యుల చురుకుదనం, ఉత్సాహాలతో కా॥ విజయ్ సజీవుడై కనిపించాడు.

గూడెం కొత్తవీధి ప్రాంతం చామగెడ్డలో స్థూపం నిర్మించారు. ఇదే చామగెడ్డలో అమరత్వానికి కొద్దినెలల క్రితం కా॥ విజయ్ మొక్కవోని ధైర్యంతో పోలీసులను ఎదిరించి దళాన్ని రక్షించాడు. ఈ మూడు సభలలోనూ కా॥ విజయ్ సహచరి పాల్గోవడం, మాట్లాడటం ప్రజలకు ఎంతో స్ఫూర్తినిచ్చింది.

అమరుల సంస్మరణ వారం సందర్భంగా రావలసిన కరపత్రాలు, పాటల క్యాసెట్లు నిర్బంధం కారణంగా రాలేదు. ఆలస్యంగా వచ్చిన కరపత్రాలు ఆ తరువాత గ్రామాలలో పంచిపెట్టారు. ఈస్ట్ డివిజన్ కరపత్రం కాక, జననాట్యమండలి అమరుల గురించి మరో కరపత్రం కూడా వేసారు. సభలు పెట్టిన ప్రాంతాలలో వంద గ్రామాల వరకూ ఈ సందర్భంగా పార్టీ రాజకీయాలను తీసుకు వెళ్ళగలిగాం. ప్రజలలో స్ఫూర్తిని కలిగించ గలిగాం.

# ప్రతిఘటనా క్యాంపెయిన్‌లో అసువులు బాసిన అమరులకు విప్లవ జోహార్లు!

2001 మార్చి నుండి నవంబర్ వరకు గడిచిన ఏడు నెలల కాలంలో ఈస్ట్ డివిజన్‌లో ఉధృతమైన శత్రుదాడి, దాన్ని త్రిప్పి కొట్టే క్రమంలో ప్రజా గెరిల్లా సైన్యపు విభాగాల ఎదురుదాడుల్లో 8 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. విశాఖ జిల్లా గూడెం మండలం పెద్ద వలస గ్రామంలో 17వ తేదీన పాటూరు అరెస్టులకు నిరసన చర్యల్లో భాగంగా బిల్డింగ్ పేల్చివేతకై వెళ్ళి ప్రజా మిలీషియా కామ్రేడ్స్ బంగార్రాజు (బి.యం. సభ్యుడు), సత్తిబాబు (ఏ.యం. సభ్యుడు) శత్రువు ఆంబుష్‌లో ఇరుక్కుని నేలకొరిగారు. నిరాయుధులైన ఈ కామ్రేడ్స్‌ను శత్రు బలగాలు చిత్రహింసలు పెట్టి కాల్చిచంపారు.

మార్చి 19వ తేదీన తూర్పు గోదావరి జిల్లా అడ్డతీగల మండలం కొత్తపల్లి గ్రామం వద్ద పలకజీడి ఎల్.జి.యస్.పై శత్రువు ‘‘ఏకపక్ష కాల్పుల ఎన్‌కౌంటర్’’ జరిగింది. ఈ కాల్పుల్లో నిరాయుధంగా వున్న కా॥ రాజేశ్వరి (అనిత) (కర్నాటక రాష్ట్ర విభాగానికి చెందిన పి.ఆర్.ను) పట్టుకుని బూటకపు ఎన్‌కౌంటర్ చేశారు.

ఆగస్టు 8వ తేదీ రాత్రి ఒరిస్సా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా కలిమెల, మోటు పి.యస్.లపై గెరిల్లా బలగాలు జరిపిన దాడిలో మోటు దాడి విఫలం కాగా ఆ దాడిలో క్రాంతి రణదేవ్ (డి.సి.యం. ద. బస్తర్) కా॥ గెమ్మెల బాలన్న (విజయ్) (యల్.జి.యస్. కమాండర్) ప్రమాదవశాత్తు అమరులు కాగా కా॥ సున్నం రామల్ (మల్లేష్–4 పి.యల్. సభ్యుడు డి.కె.) శత్రు తూటా తగిలి నేలకొరిగాడు.

అక్టోబర్ 11వ తేదీన విశాఖ జిల్లా గూడెం కొత్తవీధి మండలం పాతూరు గుంట గ్రామంలో పలకజీడి దళంపై శత్రువు జరిపిన విచక్షణా రహిత కాల్పుల్లో దళం ప్రతిఘటిస్తూనే తప్పుకుంది. ఈ కాల్పులను ప్రతిఘటిస్తూ వీరోచితంగా పోరాడుతూ కా॥ సీత (వనజ) నేలకొరిగింది.

2001 జూలైలో కొయ్యూరు మండలం రేవులకోట గ్రామంలో పార్ట్ టైం పార్టీ సభ్యుడు ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న నాయకుడు కా॥ మల్లేష్ (పి.యం.) పాముకాటుకు గురై సకాలంలో వైద్య సహాయం అందక అమరుడయ్యాడు.

వేర్వేరు సంఘటనల్లో అమరులైన ఈ కామ్రేడ్స్ డివిజన్ ఉద్యమాభివృద్ధిలో తరతమ స్థాయిల్లో తమవంతు పాత్రను పోషించారు. ఈ కామ్రేడ్స్ విప్లవ జీవితాలను మననం చేసుకుందాం.

### కా॥ బంగార్రాజు

విశాఖ జిల్లా గూడెం కొత్తవీధి మండలం నేరెల్ల బంద గ్రామ వాస్తవ్యుడు. బంగార్రాజుకు భార్య వున్నది. గ్రామ ప్రజా సంఘంలో గత మూడు సంవత్సరాలుగా చురుకైన కార్యకర్త. పార్టీ ఇచ్చిన క్యాంపెయిన్స్‌లో సంఘం నిర్వహించిన అనేక పోరాటాల్లో ముందున్నాడు. పార్టీ ఇచ్చిన పి.జి.ఏ. క్యాంపెయిన్ పిలుపునందుకుని గ్రామ బేసిక్ మిలీషియా యూనిట్‌లో చేరాడు. ప్రతిఘటనా చర్యల్లో గతం నుండి కొంత అనుభవమున్న కామ్రేడ్ అయిన కా॥ బంగార్రాజు మిలీషియా యూనిట్‌లో అత్యంత విశ్వాసంగా వుండేవాడు. వర్గ కసి, శత్రువు పట్ల ద్వేషం, పీడిత ప్రజల పట్ల ప్రేమ కల్గిన కా॥ బంగార్రాజు యువకులకు ఒక మంచి మిత్రుడు. పెదవలస బిల్డింగ్ పేల్చివేతకై వెళ్ళిన టీంకు ఫ్రంట్‌గార్డుగా వుండి శత్రువు కాల్పుల్లో అమరుడయ్యాడు.

### కా॥ సత్తిబాబు

విశాఖ జిల్లా గూడెం కొత్తవీధి మండలం సంపంగిగొంది గ్రామానికి చెందిన కా॥ సత్తిబాబు ఆర్మ్‌డ్ మిలీషియా సభ్యుడు. ఒక సంవత్సర కాలంగా సంఘ కార్యక్రమాల్లో పాల్గొంటూ సంఘం నిర్వహించిన పోరాటాల్లో ఒకడుగా నిలిచాడు. ఆర్మ్‌డ్ మిలీషియాలో చేరాలనే దళం పిలుపుకు సానుకూలంగా స్పందించి ఆ మిలీషియాలో చేరాడు. టార్గెట్స్ హతం గావించడానికి రెక్కీలు నిర్వహించాడు. పోలీసు బలగాల బలహీనతలు తెలుసుకుని దాడికి దళాన్ని సిద్ధం చేసే పనిలో నిమగ్నమయిన కా॥ సత్తిబాబు పెద్ద వలసలో నిరసన చర్యకై వెళ్ళి శత్రు ఆంబుష్‌లో చిక్కుకుని అమరుడయ్యాడు.

### కా॥ క్రాంతి రణదేవ్

పోరాటాల ఖిల్ల వరంగల్ పోరుబిడ్డ కా॥ రణదేవ్ స్వగ్రామం ఖాజీపేట. విద్యార్థి ఉద్యమాల ప్రయోగశాలగా పేరుకెక్కిన వరంగల్ పట్టణంలో సి.కె.యం. కళాశాలలో చదువుతూ 1980లో రాడికల్ కార్యకర్త అయ్యాడు. ఆర్.యస్.యు. కార్యకలాపాలను విస్తరింప జేయడంలో గణనీయమైన పాత్ర పోషించి కా॥ క్రాంతి రణదేవ్ ‘82లో పూర్తి కాలం కార్యకర్త అయ్యాడు. 83లో వరంగల్ టౌన్ కమిటీ బాధ్యతలు చేపట్టాడు. పట్టణోద్యమ అభివృద్ధిలో కాంగ్రెస్, ఆర్.యస్.యస్. గూండాల దాడులనెదుర్కొంటూ ఉద్యమాభివృద్ధికి అనేకమంది విద్యార్థుల్ని, యువతీ యువకులను ఆకర్షించి రాజకీయ విద్య గరిపాడు. అంచెలంచెలుగా

ఎదుగుతూ '86లో జిల్లాకమిటీలోకి వచ్చి 89లో రీజినల్ కమిటీలోకి వచ్చాడు.

85 నాటికి తెలంగాణా మండుతున్న కాలం. నిప్పులు చెరిగే నిర్బంధం బూటకపు ఎన్‌కౌంటర్స్‌లలో సహచర కామ్రేడ్స్ అమరత్వం మరికొందరు నాయకత్వ కామ్రేడ్స్‌ను ప్రభుత్వం మాయం చేయటం, మరోవైపు సత్యమూర్తి అవకాశవాద ముఠా పార్టీలు సృష్టించిన రాజకీయ సంక్షోభం ఉద్యమం ఇన్ని రకాలుగా బహుముఖ సవాళ్ళను ఎదుర్కొంటున్న తరుణంలో కా॥ బక్కన్న వరంగల్ ఉద్యమానికి మేరుపర్వతంలా వలె అండగా నిలిచాడు. అననుకూల పరిస్థితుల్లో ప్రజల్ని, క్యాడర్‌ను తనదైన శైలిలో అత్యంత ఓపికగా కన్విన్స్ చేసి దృఢంగా నిలపడానికి ఎనలేని కృషి చేశాడు.

యం.సి.పి.ఐ. గూండాలను దెబ్బ తీయడంలోనూ పరమ క్రూరుడైన సత్య నారాయణ రెడ్డిని మట్టి కరిపించిన సంఘటనలోనూ, వాజేడు పోలీసు స్టేషన్‌పై దాడిలోను, కా॥ హరిభూషణ్‌ను హత్య గావించిన సంతోష్‌రెడ్డి యస్.ఆర్.ని మందుపాతరలో నేలమట్టం చేయడంలోనూ మరెన్నో యాక్షన్స్‌ను విజయవంతం చేసి మన మిలటరీ పంథాను ఎత్తిపట్టిన ఉన్నత శ్రేణి మిలటరీ కమాండులో కా॥ రణదేవ్ ఒకడు.

1990 మే 5, 6 తేదీలలో జరిగిన రాష్ట్ర రైతుకూలీ సంఘం సభలు విజయవంతంగా అండర్‌గ్రౌండులో వుంటూ నడిపించిన మహాశక్తి క్రాంతి రణదేవ్. బహిరంగ సభలో పాల్గొన్న పదిలక్షల మంది ప్రజలకు అన్ని సౌకర్యాలు అందింపజేసిన మాస్ లీడర్ రణదేవ్.

'91లో కొండపల్లి ముఠా సృష్టించిన సంక్షోభంలో అవకాశవాదుల రాజకీయాలు ఎండగట్టి విప్లవ పంథాపై దృఢంగా నిలపడానికి కా॥ రణదేవ్ రాజకీయ కృషి చేశాడు. నిత్య నిర్బంధంలో శత్రువును ఎదుర్కొంటూనే పార్టీని, గెరిల్లా దళాలను రాజకీయంగా చైతన్యవంతం చేసుకుంటూ సమయస్ఫూర్తితో ఉద్యమాన్ని కాపాడాడు. రాజకీయ నిర్మాణం మిలటరీ విషయంలో అంతస్సారాన్ని పట్టుకుని తోటి కామ్రేడ్స్‌కు అర్థం చేయించడంలో మంచి నైపుణ్యం కల్గిన, దిట్ట కల్గిన వాడు రణదేవ్. కా॥ ప్రకాశ్ సి.ఓ.సి. నిర్ణయంతో '92లో ఈస్ట్ డివిజన్‌కు వచ్చిన అనతి కాలంలోనే నాగపూర్‌లో అరెస్టు అయ్యాడు. '93లో కిడ్నాప్ ద్వారా విడుదలై '95 వరకు ఈస్ట్ డివిజన్ కమిటీలో వుంటూ దండకారణ్యం వెళ్ళాడు నాటి నుండి డి.కె. ఉద్యమంలో వివిధ స్థాయిల్లో పనిచేస్తూ అమరుడయ్యే నాటికి దక్షిణ బస్తర్ డి.వి.సి.యం.గా వున్నాడు.

ఈస్ట్ డివిజన్‌లో దండకారణ్యంలో పనిచేసే క్రమంలో తన వ్యక్తిగత బలహీనతల నుండి జరిగిన తప్పొప్పులను తోటి కామ్రేడ్స్ సహకారంతో విసర్జించి వాటిని అధిగమించడానికి కిందకువెళ్ళి పనిచేయడానికి సిద్ధపడ్డ కమ్యూనిస్టు కా॥ రణదేవ్.

తన 40 ఏళ్ళ జీవితంలో సగానికి పైగా గడిపిన విప్లవ జీవితంలో కాకలుతీరిన యోధుడుగా అయ్యాడు కా॥ రణదేవ్. ఒకటి రెండు నల్లమచ్చలున్న తన జీవితమంతా ఎరుపుమయం. పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు. క్యాడర్ ప్రేమాభిమానాలు చూరగొన్న కార్యకర్త. వేలాదిమందికి రాజకీయాలు బోధించిన రాజకీయ గురువు. సాహసవ,తమైన సేనాని కేంద్రీకృత ప్రజాస్వామ్యానికి, ఉక్కు క్రమశిక్షణకు కట్టుబడి వున్న బోల్షివిక్. ప్రజాయుద్ధంలో కా॥ రణదేవ్ సాహసిక చరిత్ర ఉద్యమ నిర్మాణంలో తన రాజకీయ చాతుర్యం సదా నిలిచే వుంటుంది.

## గెమ్మెల బాలన్న (విజయ్)

కా॥ విజయ్ విశాఖపట్నం జిల్లా హుకుంపేట మండలం అండిబ గ్రామానికి ఆదివాసీ పేదరైతు బిడ్డ ఏ.పి.ఆర్. స్కూల్ కొయ్యూరులో 7వ తరగతి చదువుతూ రాడికల్ కార్యకర్తగా విప్లవ జీవితం ఆరంభించి '97లో పూర్తికాలం కార్యకర్తగా దళంకు వచ్చాడు. నాగుల కొండ, ఎల్లవరం, అరకు దళాలలో సభ్యుడిగా పనిచేసి 99 నవంబర్‌లో చింతపల్లి ఏరియా కమిటీ సభ్యుడై 2000 నవంబర్‌లో కోరుకొండ ఎల్.జి.యస్. కమాండర్‌గా ఎదిగి అమరుడయ్యే నాటికి కోరుకొండ ఎల్.జి.ఎస్. కమాండర్‌గా వున్నాడు.

అల్లూరి పోరు నడిపిన గడ్డపై జన్మించిన బాలన్న స్వగ్రామం అండబా నుండే తిరగబడే మనస్థత్వం కల్గిన వ్యక్తి. వ్యవస్థలోని లొసుగులను విమర్శనాత్మకంగా పరిశీలించి తమ పేదరికానికి ఆదివాసుల వెనకబాటుతనానికి గల అసలు కారణం కోసం నిరంతరం శోధించిన వ్యక్తి ఈ ప్రశ్నలకు సమాధానాలు విప్లవోద్యమం ద్వారా తెలుసుకున్న విజయ్ ఇంకెంత మాత్రం ఆలస్యం చేయక క్రియాశీల రాడికల్ కార్యకర్త అయ్యాడు. అరెస్టయి చిత్రహింసలు అనుభవించి కూడా శత్రువు బెదిరింపులకు హాస్టల్ యాజమాన్యం బెదిరింపులకు రాజీ పడలేదు సరికదా మరో అడుగు ముందుకేసి పూర్తికాలం సభ్యుడై దళానికి వచ్చాడు.

కా॥ విజయ్ రాజకీయపరంగా, నిర్మాణపరంగా, మిలటరీ పరంగా ఎదుగుతూ క్రమంగా కోరుకొండ ఏరియా ఉద్యమంలో నిర్ణయాత్మక పాత్ర పోషించే స్థితికి వచ్చాడు. బాక్సైట్ గనుల తవ్వకం, రైతాంగ పంటల గిట్టుబాటు ధరల పోరాటంలో సామ్రాజ్యవాదాన్ని చీల్చి చెండాడి దాని అసలు రంగను ప్రజల ముందుంచేవాడు. నిర్బంధ వ్యతిరేక పోరాటంలో స్థానిక ప్రజల సమస్యల పరిష్కారంలో వర్గ కసిని మాటల్లో, చేతల్లో ప్రదర్శించి కా॥ విజయ్ ప్రజల జీవితంలో పెనవేసుకు పోయాడు. ప్రీడిపాత్రుడైన ప్రజా నాయకుడయ్యాడు. ఇటీవలి పి.జి.ఏ. నిర్మాణ క్యాంపెయిన్‌ను కోరుకొండ ఏరియాలో విజయవంతంగా నిర్వహించాడు. శత్రువును మట్టి కరిపించడానికి మిలీషయాను రాజకీయ, మిలటరీ తర్ఫీదునిచ్చి మనోస్థైర్యాన్ని కల్పించి యుద్ధరంగానికి సంసిద్ధం చేశాడు. కోరుకొండ ఉద్యమంపై తీవ్రతరమౌతున్న నిర్బంధానికి అడ్డుకట్ట వేయడంలో తాను ధైర్యంగా వుంటూ తన దళాన్ని మిలీషియాను చొరవగా నిలబెట్టిన ఆదర్శ గెరిల్లా కమాండర్. ఇన్‌ఫార్మర్‌ను, ఏ.యన్. పోలీసులను మట్టికరిపించే కార్యక్రమంను మిలీషయాకు తగిన నమ్మకంతో సంసిద్ధం చేసి యాక్షన్‌ను విజయవంతం చేయించాడు. తాను స్వయంగా దారకొండ రెయిడ్‌లో అత్యంత చొరవను కనపర్చాడు.

పీడిత వర్గ పక్షపాతిగా ప్రజాద్రోహులకు వ్యతిరేకంగా నిర్విరామంగా పోరాడుతూ వర్గ కసి కల్గిన విజయ్ వర్గ రాజకీయాల అధ్యయనానికి ప్రాముఖ్యతనిచ్చాడు. పార్టీ పిలుపులు, సర్క్యులర్స్ కమిటీ తీర్మానాలను సరిగ్గా అర్థం చేసుకొని ఏరియాలో ఉద్యమాన్ని సృజనాత్మకంగా ఆ వెలుగులో తీర్చి దిద్దిన నిర్మాణ దక్షత విజయ్ పనిశైలిలో ప్రత్యేకాంశం. ఉప్పెనలా దూసుకుపోయి శత్రు గుండెల్లో తుఫానులు రేపగల సాహస పోరాట వీరుడు. మోటు పోలీసు స్టేషన్ దాడిలో ప్రమాదవశాత్తు మైన్ పేలి తీవ్ర గాయాలయ్యి కూడా తన టీంకు అడ్వాన్స్ కాషన్స్ ఇస్తూ శత్రువు గుండెల్లో భూకంపం సృష్టించిన సాహసికుడతను. ప్రజానీకం యావత్తు యుద్ధానికి సంసిద్ధం చేయడంలో తగిన చొరవ కల్గిన మిలటరీ కమాండర్

విజయ్ చరిత్ర చిరస్మరణీయమైనది.

## కా॥ సున్నం రామాల్ (మల్లేష్)

కా॥ మల్లేష్ దండకారణ్యంలో ఏర్పడిన పి.జి.ఎ. బలగాల్లోని 4వ ప్లాటూన్‌కు చెందిన సభ్యుడు. దక్షిణ బస్తర్ డివిజన్ బాసగూడ ఏరియా జెగురుగొండ రేంజి పెంట గ్రామవాసి.

కా॥ మల్లేష్ విప్లవ జీవితం ఆదివాసీ బాలల సంఘం నుండి మొదలయ్యింది. క్రమ క్రమంగా డి.ఎ.కె.యం.యస్. కార్యవర్గంలో సభ్యుడయ్యాడు. గ్రామంలో ప్రజా శత్రువులకు, పెత్తందార్లకు వ్యతిరేకంగా సంఘాన్ని నిలబెట్టి పోరాడటంలో ముందున్నాడు. 1998లో దళంలో రిక్రూట్ అయిన వెంటనే దండకారణ్య ఉద్యమ అవసరాల రీత్యా దక్షిణ బస్తర్ నుండి గడ్‌చిరోలికి బదిలీ కావాలనుకున్నప్పుడు ఎలాంటి శషబిషలు లేకుండా వెళ్ళాడు.

1998 నుండి 2001 జనవరి వరకు గడ్‌చిరోలి డివిజన్ ఉద్యమంలో భాగమయినాడు. పెరిమిలి, బ్రామగడ్ దళాల ఏరియాలలో పనిచేస్తూ అక్కడ మాడియా ప్రజల్ని ఏకంచేస్తూ పోరాటాలు నడిపించటంలో క్రియాశీల పాత్ర పోషించాడు. స్థానిక ప్రజల దళాల అభిమానాన్ని చూరగొన్నాడు. మహారాష్ట్ర కమాండో బలగాల దాడులను ఎదుర్కొంటూ తిప్పికొట్టడంలో తన కర్తవ్యాన్ని సాహసవంతంగా నిర్వహించాడు. ఆంబుష్, ఎన్‌కౌంటర్ల సందర్భంగా శత్రువుకు వెరవకుండా కమాండర్ ఆజ్ఞలను తూ.చ. తప్పకుండా పాటించడం తనవద్ద వున్న ఆయుధంతో శత్రవును మట్టి గరిపించడంలో ధైర్యంగా నిలబడ్డ ఆదర్శ గెరిల్లా.

దండకారణ్య ప్రాంతాన్ని విముక్తి చేయాలనే లక్ష్యంకు అనుగుణంగా డి.కె.లో ప్లాటూన్స్ నిర్మాణం విస్తరించడంలో భాగంగా కా॥ మల్లేష్ ప్లాటూన్ 4 కు బదిలీ అయ్యాడు. మోటులో జరిగిన దాడి సర్‌ప్రైజ్ సాధించడంలో విఫలమయ్యి శత్రు తూటాల మధ్యనే కవర్ ఫైరింగ్‌లో సాహసోపేతంగా మైన్స్ తీసుకొని అడ్వాన్స్ అవుతున్న క్రమంలో శత్రువు యల్.యం.జి. తూటా తగిలింది. అయినా గందరగోళ పడకుండా అధైర్యం చెందక తనకు తూటాలు తగిలాయని శత్రువుకు అర్థం కాకుండా తనతోటి సభ్యుడికి మాత్రమే గాయపడ్డాను అని చెప్పాడే తప్పా శత్రువు మోరల్ పెంచేలా చెయ్యలేదు. అనుకున్న పద్ధతిలో మన దాడి మొదలు కాలేదని తెల్సినా శత్రువును వీరోచితంగా ఎదుర్కొంటూనే క్యాంపును స్వాధీనంలో తెచ్చుకోవాలనే పట్టుదలతో అంకురిత దీక్షతో కామ్రేడ్ మల్లేష్ తన కర్తవ్య నిర్వహణలో హోరాహోరీగా పోరాడుతూనే అమరత్వం పొందాడు. ఆ కామ్రేడ్ క్రమశిక్షణ, పట్టుదల, ధైర్య సాహసాలు నేటి ప్రజా గెరిల్లా సైన్యానికి ఆదర్శం.

## కా॥ విజయ భాస్కర్ (రమణ)

సామాజిక బాధ్యత నెరిగిన ఒక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తన కొడుకు విప్లవోద్యమంలో నేలకొరిగినపుడు గర్వపడుతున్నానని ప్రకటించాడు. ఏలూరులో ఈ మాటలన్నది మన కామ్రేడ్ విజయ భాస్కర్ తండ్రి. కా॥ విజయ భాస్కర్ పుట్టింది మహబూబ్‌నగర్ జిల్లా, ఎదిగింది కర్నూలు జిల్లాలో. కర్నూలు పట్టణ విద్యార్థి ఆర్గనైజర్‌గా 1997 నుండి 2000 వరకు 4 సం॥ల పాటు పనిచేసిన కా॥ రమణ రాయలసీమ విద్యార్థి ఉద్యమానికి నాయకుడు. కర్నూలుకు రాకముందు నల్లమల ఫారెస్టు దళాల్లో ఎదిగి మహానంది శాక్ మెంబరుగా గ్రామీణ ఉద్యమానికి నాయకత్వం అందించాడు. ఒక దశాబ్ద కాలంగా వృత్తి విప్లవ కారుడుగా పనిచేసిన కా॥ భాస్కర్ మంచి మిలిటెంట్. పి.జి.ఎ. ప్రధాన బలగాల్లో యాక్షన్ టీం సభ్యుడుగా కీలకమైన బాధ్యత నిర్వహిస్తున్న సందర్భంలో అనుకోని దుర్ఘటనలో అమరుడయ్యాడు కా॥ విజయ భాస్కర్.

విద్యార్థి ఉద్యమాలను, రైతాంగ పోరాటాలను నడిపిన కా॥ రమణ చురుకైన, చొరవగల మంచి ఆర్గనైజర్. లోతైన రాజకీయ అవగాహనతో, ఆత్మవిశ్వాసంతో, నిర్ణయాత్మకంగా వుంటూ బాధ్యత నెరిగిన మంచి నాయకడు. స్నేహశీలత, క్రమశిక్షణలతో ఆచరణ ద్వారా మనకు ఆదర్శమయ్యాడు.

నిర్దిష్ట పరిశీలన, పథక రచన, మెలకువతో పోలీసు వేషాల్లో వెళ్ళి 2 నిముషాల్లో బుడ్డా వెంగళరెడ్డిని ఖతం చేయడంలో కీలక పాత్ర కా॥ రమణదే. పార్టీ ఇచ్చిన బాధ్యతలెన్నింటినో చాకచక్యంగా నిర్వహించాడు.

కా॥ విజయ భాస్కర్ మంచి మెకానిక్. ఆయుధాలను రిపేర్ చేయడంలోనూ, కొత్తవాటిని రూపొందించడంలోనూ ఎంతో నైపుణ్యం కనపర్చేవాడు. నల్లమల నుండి తూర్పు కనుమలకు వచ్చి 1 సం॥ కాలంగా ఇక్కడ కామ్రేడ్స్‌తో తన విప్లవ జీవితాన్ని పెనవేసుకున్నాడు. తాను చేస్తున్న పనులకున్న ప్రాధాన్యత రీత్యా, అవగాహనకి వచ్చి కూడా 2 సం॥ల వరకు పెళ్ళిని ఆపుకున్నాడు. కర్తవ్యం ఎడల కఠినమైన దీక్షను, క్రమశిక్షణను ప్రదర్శించిన కా॥ విజయ భాస్కర్ మనకు మార్గదర్శి.

## కా॥ సైదులు నాయక్ (సాగర్)

గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం శ్రీనగర్‌కు చెందిన కా॥ సైదులు నాయక్ పేద రైతు బిడ్డ. డిగ్రీ చదువును, వాలంటరీ సంస్థలో వుద్యోగాన్ని వదులుకుని 1996 చివర నుండి విప్లవోద్యమంలో పూర్తిగా మమేకతతో పనిచేశాడు. దళాల్లో పనిచేస్తూ రైతాంగ ఉద్యమంలో భాగమయ్యాడు. ఆ ప్రాంత ప్రజలందరికీ బాగా తెలిసిన కామ్రేడ్ సాగర్ చురుకైన వాడు, మేధావి కావడంతో నరసరావు పేటలో విద్యార్థి ఆర్గనైజర్‌గా వెళ్ళాడు. 2 సం॥ల పాటు విద్యార్థి నాయకుడిగా కృషి చేసి దక్షిణ కోస్తా విద్యార్థి ఉద్యమానికి నాయకుడుగా ఎదిగాడు.

విద్యార్థి ఉద్యమాలను నడపటంలోనూ, విద్యార్థులకు రాజకీయాలు చెప్పి నిరంతరం ఉత్సాహపరిచి విప్లవోద్యమంలో భాగస్వాములుగా తీర్చిదిద్దటంలో చురుకైన పాత్రను నిర్వహించాడు. తెలియని విషయాలను తెలుసుకోవటంలోనూ, సాధించటంలోనూ తపనపడే వాడు. ఆచరణ సాధ్యం చేసి తీరేవాడు. నిత్యం సంతోషంగా వుంటూ తన చుట్టూ మంచి వాతావరణాన్ని సృష్టించుకుంటూ అందరికీ ఎంతో సన్నిహితంగా వుండేవాడు.

మిలిటెన్సీ కలిగిన కా॥ సాగర్ గుంటూరు జిల్లాలో చంద్రవంక ఎన్‌కౌంటర్‌కు కారకుడు ఎస్.ఐ.బి. కానిస్టేబుల్ వలీని గ్రీన్‌టైగర్స్‌కు చెందిన శ్రీనివాసాచారిని, ఎస్.ఐ. నిమ్మకాయల కోటేశ్వరరావును ఖతం చేయడంలో ఎంతో ధైర్య సాహసాలను ప్రదర్శించాడు. చురుకుదనం, మిలిటెన్సీ, నైపుణ్యం, క్రమశిక్షణ, కా॥ సాగర్‌ను పి.జి.ఎ. ప్రధాన బలగాల్లోకి వచ్చేలా చేశాయి. యాక్షన్ టీం సభ్యుడుగా కీలకమైన బాధ్యతను

నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు అమరుడయ్యాడు. చిన్న వయస్సులో ఎంతో ఎదిగిన మన ప్రియమైన కామ్రేడ్స్ సాగర్, విజయభాస్కర్‌ల జ్ఞాపకాలను భవిష్యత్తరాలకు అందిద్దాం.

### కా॥ వనజ

విశాఖ జిల్లా కొయ్యూరు మండలం బలభద్రం ఒక చిన్న గ్రామం. పట్టుమని పది ఇండ్లు కూడా లేని ఆ గ్రామం గత 20 సం॥లుగా విప్లవకారులకు ఆశ్రయమిస్తుంది. పోలీసు బలగాలు అనేక సార్లు గ్రామంపై దాడి జరిపి అరెస్టులు, చిత్రహింసలకు గురిచేస్తూ జైలుపాలు చేసినా ఆ గ్రామస్తులు విప్లవకారులను కంటికి రెప్పలా కాపాడుకుంటూనే వున్నారు. ఆ గ్రామంలోని ఒక నిరుపేద రైతు కుటుంబంలో 20 సం॥ల క్రితం కా॥ సీత (వనజ) జన్మించింది. చిన్ననాటి నుండి విప్లవ రాజకీయాలతో ప్రభావితమైన కా॥ వనజ తనకు బుద్ధి తెలిసిన నాటినుండే దళానికి నీళ్ళు తేవడం, ఆహారం సమకూర్చడం నుండి మొదలుకుని దళానికి రక్షణగా సెంట్రీలు చేయడం, దళం వేసుకునే చిన్న చిన్న క్యాంపులకు రక్షణ భద్రతలు చూడటం వరకు అనేక కార్యక్రమాల్లో చురుగ్గా వుండేది. ఒక మాటలో చెప్పాలంటే ఆ గ్రామ పరిసరాల్లోకి వెళ్ళినప్పుడల్లా కా॥ వనజ దళంలో తాత్కాలిక సభ్యురాలుగా పరిగణించబడేది.

ప్రజాయుద్ధ అవసరాలు గుర్తెరిగి పోరాడకుండా ప్రజల బ్రతుకులు మారవని వాస్తవాన్ని గ్రహించి కా॥ వనజ 1999 మార్చిలో దళంలోకి పూర్తికాలం వచ్చింది. నాగుల కొండ దళ సభ్యురాలిగా 2000 మే వరకు తిరిగింది. మైదాన ప్రాంతమైన నాగుల కొండలో శత్రు నిర్బంధం అధికంగా వున్నప్పటికీ వెరవక దళంలో సభ్యులకు మిలటరీ విషయాల్లో సహకారంగా వుండేది. ప్రజలలో కలగలిసి పోవడం, రాజకీయ అధ్యయనం, చదువు నేర్చుకోవడం పట్ల ఆసక్తిని కనబర్చి త్వరలోనే పార్టీ సభ్యత్వం పొందింది. ప్రతిదీ తెల్సుకోవాలనే తపన, తెలియని విషయాలను పరిశోధించే ఆమె పట్టుదలా తన ఎదుగుదలలో ముఖ్యమైన అంశాలు.

2000 మే నెలలో స్పెషల్ దళంలోకి మారిన కా॥ వనజ 2001 ఫిబ్రవరిలో ప్లాటూన్ సభ్యురాలిగా పనిచేసింది. తాను అమరత్వం పొందే నాటికి ప్లాటూన్‌లో సెక్షన్ డిప్యూటీ కమాండర్ స్థాయికి ఎదిగింది. దళంలో మిలటరీపరంగా శ్రద్ధ కనబర్చి అందరికన్నా ముందుండే కా॥ వనజ ప్లాటూన్‌లో తన వంతు బాధ్యతను సక్రమంగా నిర్వహించింది. 2000 ఫిభ్రవరిలో దారకొండ రెయిడ్ సందర్భంగా స్టాఫ్ పార్టీలో మెంబర్‌గా వున్న కా॥ వనజ చెక్కు చెదరకుండా ధైర్యంగా నిలబడింది.

2001 ఆగస్టులో కలిమెల పోలీసు స్టేషన్‌పై దాడిలో అస్సాల్ట్ టీంలో చురుగ్గా పాల్గొంది. రెయిడ్‌ను విజయవంతం చేయడంలో క్రియాశీల పాత్ర పోషించింది. డివిజన్‌లో శత్రు కదలిక సమాచారం తెల్సినప్పుడల్లా దాడికి ప్లాన్ చేసుకోవాలనే పట్టుదల ఏమాత్రం అవకాశం దొరికినా దాన్ని వినియోగించుకోవాలనే మిలటరీ సెన్స్ పెరుగుతున్న కా॥ వనజ అతి త్వరలోనే ఒక మహిళా మిలటరీ కమాండర్‌గా ఎదిగే అవకాశాలున్న కామ్రేడ్.

చివరిగా జరిగిన ఎదురుకాల్పుల్లో సైతం కా॥ వనజ అత్యంత సాహసోపేతంగా పోరాడుతూ తన తోటి కామ్రేడ్‌కు కవర్ ఫైరింగ్ ఇస్తూ తప్పుకోవడానికి అవకాశం కల్పించింది. రిట్రీటులో తనకు తూటా తగిలిన తోటి కామ్రేడ్‌కు ఆయుధాన్నిచ్చి వెళ్ళిపొమ్మని తన కోసం చూడకండని చెప్పి, ఆయుధాన్ని శత్రువుకు దొరకనియ్యకుండా చేసింది. తన శవాన్ని కూడా శత్రువు కనుక్కోలేకుండా తూటా తగిలిన ప్రాంతం నుండి దూరంగా వెళ్లి తుదిశ్వాస విడిచింది. నిరంతరం నేర్చుకోవాలనే తపన ప్రజాయుద్ధాన్ని పెంపొందించాలని పట్టుదల కలిగిన కార్యకర్త కా॥ వనజ అమరత్వం మనకు తీరని లోటు అయినా విప్లవోద్యమం ఆ లోటును పూడ్చుకుంటూ మరింత కసిగా ముందడుగు వేస్తుంది.

### కా॥ మల్లేశ్వర రావు

విశాఖ జిల్లా కొయ్యూరు మండలం దబ్బలంక గ్రామానికి చెందిన కా॥ మల్లేష్ చిన్ననాటి నుండి విప్లవోద్యమానికి పరిచయం. తన గ్రామానికి అన్నలు వచ్చిన తరువాత జన్మించిన కా॥ మల్లేష్ చిన్నప్పటి నుండి దళంతో పాటు పెరిగాడు. దళంతోపాటు తిరిగాడు. బాలల సంఘం అధ్యక్షుడుగా వుండి దళానికి తిండి, నీరు సరఫరా చేయడం, శత్రు సమాచారం చెప్పి మల్లేష్ పెద్దయిన తరువాత ఏ.ఆర్.సి.యస్.లో పనిచేసాడు. షావుకార్లకు వ్యతిరేకంగా పోరాటంలో, విప్లవకర భూ సంస్కరణల్లో, అమరవీరుల సంస్మరణ సభల్లో స్థూపావిష్కరణలో క్రియాశీలక పాత్ర పోషించి 2000 సం॥లో పార్టీ సభ్యత్వం పొందాడు. 2001 సంవత్సరంలో శత్రువు పలకజీడి ఏరియాలో అమలు చేసిన నిర్బంధాన్ని తిప్పికొట్టడంలో క్రియాశీలకంగా పాల్గొన్నాడు. తన ఏరియాలో పెత్తందార్ల ఆగడాలను ఎండగట్టడంలో ముందున్నాడు. 2001 జూలైలో పాముకాటుకు గురయి కా॥ మల్లేష్ సకాలంలో వైద్య సహాయం అందక అమరుడయ్యాడు. విముక్తి ప్రాంతాన్ని నిర్మించే లక్ష్యంతో ముందుకు సాగుతున్న యుద్ధంలో ఎంతో భవిష్యత్ వున్న కా॥ మల్లేష్ 20 సం॥రాల చిన్న వయస్సులోనే అమరుడయ్యాడు. ఆ కామ్రేడ్ ఆశయాలను పరిపూర్తి చేద్దాం.

తూర్పు డివిజన్‌లో శత్రు నిర్బంధం తీవ్రతరమైంది. ప్రతిఘటనా ఎదురు దాడులు కూడా తీవ్రమయ్యాయి. యుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంటున్న తరుణంలో త్యాగాలు అనివార్యం. ఈ త్యాగాల బాటల్లో పయనిస్తూ ప్రజాయుద్ధాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్తూ అమరుల ఆశయాలను నిజం చేస్తూ విముక్తి ప్రాంతాలను నిర్మిద్దాం.

# సామ్రాజ్యవాద గుత్త సంస్థలకు పరిశ్రమలను, వనరులను టోకున అమ్మివేసిన కేంద్ర బడ్జెట్!

ఎప్పటిలాగే కేంద్ర బడ్జెట్ షరా మామూలే. గడచిన సంవత్సరాలలో మాదిరే ఈ సంవత్సరం బడ్జెట్ సైతం పేద, మధ్యతరగతి ప్రజలను నిలువునా కొల్లగొట్టి సంపన్నులను మరింతగా బలిపిస్తూ దేశాన్ని మరింతగా బహుళజాతి గుత్త సంస్థల లూటీకిగాను అప్పనంగా అందించేసింది. గత దశాబ్ద కాలం 'ఆర్థిక సంస్కరణల' పొడవునా కాంగ్రెస్, వామపక్షంతో సహా యునైటెడ్ ఫ్రంట్, బి.జె.పి. ఆధ్వర్యంలోని ఎన్డీఎ – ఇలా ప్రభుత్వం ఎవరిదైనా బడ్జెట్‌ల సారాంశం మాత్రం ఒక్కటే. ప్రస్తుత బడ్జెట్‌తో సహా బి.జె.పి. ప్రభుత్వ బడ్జెట్లలో అదనంగా కన్పించే అంశమేదంటే పైన చెప్పిన అంశాలన్నింటినీ తారాస్థాయికి తీసుకుపోవడమే. తమ విస్తరణవాద, సైనిక విధానాల అమలు కోసం వీళ్ళు రక్షణ వ్యయాన్ని అమాంతంగా పెంచేశారు. అట్లే 'హిందూత్వ' ఎజెండా కోసం నిధులను మళ్ళించేశారు కూడా.

గత దశాబ్ద కాలంగా ప్రతి బడ్జెట్ కూడా ఇప్పటికే దారిద్ర్య పీడితులైన ప్రజారాసుల మనుగడను అమానుష స్థాయికి తీసుకుపోతూ, పేదలను మరింతగా నిలువు దోపిడీ చేసేలా రూపొందుతూ వచ్చింది. పేద వర్గాల నుండి ఇక గుంజుకోవడానికి ఏమీ మిగలని స్థితిలో ఇప్పుడీ బడ్జెట్ ద్వారా మధ్యతరగతిపై భారీస్థాయి దాడికి దిగి, వారి నుండి 15,000 కోట్ల రూ॥లను కొల్లగొట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే కిరోసిన్ ధరను లీటర్‌కి రూపాయి 40 పైసలు పెంచటం వంటి చర్యలకు దిగటం ద్వారా ఈ బడ్జెట్ పేదలను సైతం వదిలి పెట్టలేదు. ప్రజారాసుల నుండి ఈసారి గుంజుకున్న మొత్తం గత దశాబ్ది కాలపు బడ్జెట్‌లలో కెల్లా అధికంగా వుంది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన కొన్ని అంశాలను వెనక్కి తీసుకోవాలంటూ గోవాలో జరిపిన జాతీయ కార్యవర్గ సమావేశంలో బి.జె.పి. చేసిన ప్రతిపాదన ప్రచార జిమ్మిక్కు తప్ప మరేం కాదు. ఎందుకంటే బి.జె.పి. ప్రతిపాదన బడ్జెట్‌లోని ముఖ్యమైన పన్నులను గురించి కనీసంగానైనా తడమలేదు.

ప్రజల జీవితాలపై ఈ నూతన పన్నులు వినాశకర ప్రభావం వేస్తున్నప్పటికీ, పత్రికా సాధనాలు, పార్లమెంటరీ పార్టీలలో చాలా వరకు మౌనం వహించాయి. పైగా ఈ సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనలు హిందూత్వ హంగామాలో కొట్టుకుపోయాయి. ఫిబ్రవరి 28న బడ్జెట్‌ని సమర్పించగా ఆ నెల మొత్తం అయోధ్య గొడవలతోనే సరిపోవడంతో పత్రికలు బడ్జెట్ గురించి పెద్దగా వ్రాసెత్తలేదు. బడ్జెట్‌కి ముందురోజే గోద్రా సంఘటన జరగ్గా తరువాత మత కల్లోలం నుండి రాజకీయ పెట్టుబడిని సాధించుకోవడానికి అన్ని పార్టీలూ ప్రయత్నించినందువల్ల బడ్జెట్ మరుగున పడిపోయింది. బడ్జెట్‌ని ఇంకా ఆమోదించని పరిస్థితుల్లో గౌహతిలో సోనియాగాంధీ జరిపిన కాంగ్రెస్ ముఖ్యమంత్రుల సమావేశంలో బడ్జెట్ గురించి ఒక్క ముక్కయినా ప్రస్తావించలేదు. రాజకీయ పార్టీలన్నీ కూడా టి.ఎన్.సి.లకు, సామ్రాజ్యవాదులకు వూడిగం చేయటంలో తమ సామర్థ్యాన్ని నిరూపించుకోడానికి ప్రయత్నిస్తున్నందువల్ల ఇదొక మౌన నిశ్శబ్ద కుట్రే. ఏ పార్టీ అధికారంలో వుందన్నది పక్కనబెట్టి అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల విధానాలకేసి అలా పైపైన చూస్తే చాలు, ఈ బానిసత్వం ఏ స్థాయిలో వుందో అర్థమవుతుంది.

ఈసారి బడ్జెట్‌లోని ప్రధానాంశాలేమిటి? పన్నులు భారీ విధింపు, రక్షణ రంగానికి భారీ కేటాయింపులనలా వుంచితే, కీలకాంశమేందంటే సామ్రాజ్యవాద రాబందు కోరలలోకి మరింతగా ఆర్థిక వ్యవస్థను నెట్టేసే పలు రకాల విధానాలను ప్రవేశపెట్టారు. దేశ సార్వభౌమత్వాన్నే ఫణంగా పెట్టగల విధానాలను లెక్కా జమా లేకుండా ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ముందుగా వీటిని పరిశీలిద్దాం.

## దేశాన్ని అమ్మకానికి పెట్టడం

పరిశ్రవను, ఆర్థిక వ్యవస్థను, వ్యాపారాన్నే కాక మన ద్రవ్య వ్యవస్థనే సామ్రాజ్యవాదుల, టి.ఎన్.సి.ల హస్తగతం చేసేందుకు శరవేగంగా ఈ బడ్జెట్ క్రమంలో చర్యలు తీసుకొనగా రాజకీయ పార్టీలు, మీడియా ఎందుకు మౌనం వహిస్తున్నాయి?

పలు దేశాల ద్రవ్య వ్యవస్థలను సంస్కరణల్లో భాగంగా బార్లా తెరిచేసినప్పటికీ అవి వినాశకరంగానే నిరూపించబడ్డాయి. 1997లో ఆగ్నేయాసియా దేశాల సంక్షోభం, ఇటీవల టర్కీ, అర్జెంటైనా దేశాల ద్రవ్య సంక్షోభం ఇందుకు నిదర్శనం. పెట్టుబడి ఖాతాపై రూపాయి మార్పిడీకి (అంటే ఏ బ్యాంకు కౌంటర్లో అయినా మనం డాలర్లకు రూపాయిలను మార్చుకోవచ్చు) వీలు కల్పించడంలో ఈ బడ్జెట్ ఏ స్థాయికి పోయిందంటే మన రూపాయిని అంతర్జాతీయ మార్కెట్ల చిత్త చాంచల్యానికి వదిలేశారు. ఈ దిశలో ప్రస్తుత బడ్జెట్ రెండు ప్రధాన చర్యలు చేపట్టింది.

మొదటగా అది దేశంలోని ప్రవాస భారతీయుల డిపాజిట్ పథకాలకు పూర్తి మార్పిడిని ప్రకటించింది. మరో మాటలో చెప్పాలంటే 40,000 కోట్ల రూ॥ల భారీ మొత్తంలో వుండే ప్రవాస భారతీయుల డిపాజిట్లను భారతదేశ విదేశీ రుణంలో భాగంగా చేసేశారు. వీటికి వడ్డీ, చెల్లింపు చార్జీలను ఇకనుండి డాలర్ల రూపంలో చెల్లిస్తారు. ఇంతేకాదు, భారతదేశంలో తాము సంపాదించిన ఆదాయాలను (రెంట్, షేర్లపై లాభం, వడ్డీ తదితరాలు) ప్రవాస భారతీయులు స్వేచ్ఛగా విదేశీ ద్రవ్యంలోకి మార్చుకోవచ్చు.

రెండు. విదేశీ సంస్థాగత మదుపుదార్లకు భారతీయ ప్రైవేట్ బ్యాంకులను సులభంగా స్వాధీన పర్చుకునేలా పూర్తి స్వేచ్ఛ కల్పించారు. ప్రైవేట్ బ్యాంకింగ్‌లో విదేశీ సంస్థాగత మదుపుదార్ల పోర్ట్‌పోలియో పెట్టుబడులపై వుండే 24 శాతం పరిమితిని తొలగించి భారతీయ ప్రైవేట్ బ్యాంకులలో 100 శాతం విదేశీ వాటాకి వీలు కల్పించారు. పైగా భారతీయ కంపెనీలలోకి విదేశీ సంస్థాగత మదుపుదార్లు సులభంగా ప్రవేశించేలా, భారతీయ స్టాక్ మార్కెట్‌లో అనుబంధ వాణిజ్యంలో పాల్గొనేలా అనుమతించేశారు.

ఇవి పెట్టుబడి ఖాతాపై రూపాయి మార్పిడీకి వీలు కల్పించే వైపుగా తీసుకున్న రెండు ప్రధాన చర్యలే తప్ప మరొకటి కావు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులు మన రూపాయిపై దాడికి దిగాలని, లేక దేశంలోకి తెచ్చిన అధిక మొత్తం నిధులను ఉపసంహరించాలని నిశ్చయించుకున్నపుడు ఇవి భారత కరెన్సీ భద్రతపై తీవ్రమైన పరిణామాల్ని కల్గించగలవు.

సామ్రాజ్యవాదులకు తలుపులు బార్లా తెరిచేసే ఈ రెండు ప్రధాన చర్యలతో పాటుగా, ఈ బడ్జెట్ దేశంలోని టి.యన్.సి. కార్యకలాపాలకు మరింతగా వీలు కల్పిస్తూ, వాటి ఉత్పత్తులకు మార్కెట్లను విస్తృత

పర్చడంలో సహకరిస్తూ పలు నూతన చర్యలను కూడా ప్రతిపాదించింది.

ఇక వ్యాపార రంగంలో ఎగుమతి దిగుమతులు రెండింటికీ భారీ రాయితీలను అందించారు. దిగుమతులకు ఇచ్చిన రాయితీల వల్ల విదేశీ సరకులు వెల్లువెత్తి దేశీయ ఉత్పత్తిపై వినాశకర ప్రభావం కల్గిస్తాయి. వాణిజ్యంలో అననుకూల నిబంధనల కారణంగా, ఎగుమతులకు రాయితీలు కల్పించడమనేది సామ్రాజ్యవాదులు మన సరకులను కారుచౌకగా కొల్లగొట్టేందుకు వీలు కల్పిస్తుంది. రూపాయి పతనం కొనసాగుతున్నందువల్ల భారతీయ సరకులు డాలర్ నిబంధనల ప్రకారం కారుచౌకకు అమ్మివేయబడతాయి. ఈ కోణంలో బడ్జెట్‌లోనూ ఎగ్జిమ్ (ఎగుమతి, దిగుమతి) విధానంలో కింది చర్యలు చేపట్టారు.

* విదేశీ ఎగుమతిదార్లకు 2,200 కోట్ల రూ॥ల లాభాలను అందిస్తూ ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీని మరో 5 శాతం తగ్గించారు.

* విదేశీ మత్తు పానీయాలు, అలంకరణ సామగ్రి, హెలికాప్టర్లు, చిన్న చిన్న పడవలు, ఇతర విలాస వస్తువులపై ఎక్సైజ్ పన్నును తగ్గించారు. వీటిలో చాలా వరకు దిగుమతి చేసుకుంటున్నవే.

* నూతన ఎగుమతి, దిగుమతి విధానం కింది చర్యలు చేపట్టింది.

1. వ్యవసాయ సరకులతో సహా ఎగుమతులపై గుణాత్మక నిబంధనలను తొలగించేసింది.

2. వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించేందుకు 20 నూతన ఎగుమతి జోన్లను సృష్టించింది. ఫల ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు 15 రాష్ట్రాలలో 20 వ్యవసాయ ఎగుమతిజోన్లను గుర్తించారు. ప్రభుత్వ పెట్టుబడులతో, రుణ వసతులతో వీటిని ఏర్పరుస్తారు. రాష్ట్ర పభుత్వాల, కేంద్రం, పెట్టుబడిదారుల సహకారంతో ఇవి నడుస్తాయి.

3. పండ్లు, కూరగాయలు, పూలు, కోళ్ళు, పాల ఉత్పత్తులు, గోధుమ, వరి ఉత్పత్తుల ఎగుమతికి రవాణా సహకారమందిస్తారు.

ఇక టి.ఎన్.సి.లకు, వాటి దళారీ సంస్థలకు వచ్చే ప్రయోజనాలు ఏమంటే....

* భారతదేశంలో కార్యకలాపాలు సాగించే విదేశీ కంపెనీలపై కార్పొరేట్ పన్నును 8 శాతం దాకా (48 నుంచి 40 శాతంకి) తగ్గించారు.

* టెలికామ్ కంపెనీలకు పన్ను రాయితీలు.

* పెట్రోలియం ఉత్పత్తులపై నిర్వహణా పరమైన ధరల యంత్రాంగాన్ని రద్దు చేయటం ద్వారా ఈ బడ్జెట్ దేశంలోకి ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రవేశించిన షెల్, కాల్టెక్స్, ఎక్సాన్ వంటి భారీ బహుళజాతి ఆయిల్ కంపెనీలకు తలుపులు బార్లా తెరిచేసింది.

* చిన్న తరహా పరిశ్రమలకు కేటాయించిన జాబితా నుండి మరొక 50 వస్తువులను తొలగించటం ద్వారా ఆర్థిక వ్యవస్థలోని పెద్ద విభాగాన్ని టి.ఎన్.సి./దళారీల స్వాధీన పర్చుకోవటం మరింత సులువైపోయింది.

* విదేశీ సంచార్ నిగమ్ లిమిటెడ్, భారతీయ రేవులు వంటి లాభాలార్జించే ప్రభుత్వ రంగ యూనిట్లను భారీగా ప్రైవేటీకరించే పథకాలకు రంగం సిద్ధమవుతోంది. వీటిలో చాలా వాటిని విదేశీ భాగస్వాములకు వ్యూహాత్మక అమ్మకాలలో భాగంగా అమ్మివేస్తున్నారు.

*ప్రభుత్వ నియంత్రణలోని 74 మందుల జాబితా నుండి 34 ఔషధాలను తొలగించేశారు. తద్వారా మందుల కంపెనీలకు మరింతగా కళ్ళు చెదిరేలా లాభాలను అనుమతించేశారు.

* ఆటోమేటిక్‌గా ఆమోదించే మార్గంలో సినిమాలు, ప్రకటనల రంగంలోకి 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది.

* 180 బిలియన్ డాలర్ల విలువ కల్గిన భారతదేశపు అతి పెద్ద చిల్లర వర్తకంలో (ఇది అమెరికాకి చెందిన అతి పెద్ద చిల్లర వర్తకపు కంపెనీ వాల్‌మార్ట్ కంపెనీ ఆదాయంతో సమానం) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100 శాతం అనుమతించడానికి రంగం సిద్ధమవుతోంది.

* నూతన ఆటోమొబైల్ పాలసీ మోటారు వాహనాల రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు వీలు కల్పించింది. ఈ విధానం చిన్నకార్లకు, బహుళ ప్రయోజన వాహనాలకు ఎక్సైజ్ పన్నులో రాయితీలను కల్పించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒడంబడికలకు అనుగుణంగా ఇలా చేశారు.

* ప్రభుత్వ ధాన్య సేకరణకు దారి మూసివేయటంతో దేశంలో వ్యవసాయ వాణిజ్యానికి భారీగా వూతమిచ్చారు. వ్యవసాయ ఉత్పత్తి మార్కెటింగ్ చట్టంలో ప్రతిపాదించిన సవరణ ద్వారా వ్యవసాయదారులు తమ ఉత్పత్తులను నేరుగా ఆహార ఉత్పత్తిదారులకు అమ్ముకునేలా అనుమతించేశారు. ఈ రకంగా వ్యవసాయదారులను మరింతగా మార్కెట్ అనిశ్చితత్వం బారిన పడేశారు. పైగా భారత ఆహార సంస్థను బడా టి.యన్.సి. కూటమిలు (కంగ్లామరేట్స్) స్వాధీన పర్చుకోడానికి రంగం సిద్ధమైంది.

1992 పాలు, పాల ఉత్పత్తుల చట్టంని రద్దు చేయటం ద్వారా దేశీయ క్షీర పరిశ్రమను టి.ఎన్.సి.లకు బార్లా తెరచేశారు. ఈ చట్టం పాల ప్రాసెసింగ్‌లో వునికిలో వున్న విస్తృతమైన సహకార రంగంలోని మిల్క్ షెడ్స్‌ని ఇంతవరకూ కాపాడుతూ వచ్చింది. ఇప్పటికే పాల పరిశ్రమకు చెందిన నెస్లేల్, డైనమిక్స్ వంటి టి.యన్.సి.లు దేశంలోకి పెద్ద ఎత్తున ప్రవేశించాయి. ఇప్పుడు వునికిలో వున్న పాల సహకార సంస్థలను కబళించడానికి లేక వాటి నుండి మిల్క్ షెడ్లని స్వాధీనపర్చుకోడానికి వీటికి స్వేచ్ఛ కల్పించారు.

సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు దేశాన్ని భారీగా అమ్మేస్తున్న విధానం ఇదే మరి. అయినప్పటికీ 'జాతీయ ప్రయోజనాల' గురించి పాచి పాట పాడుతున్న పార్టీలన్నీ నోరు విప్పడం లేదు. చివరకు, ఆర్థిక సంస్కరణలపై పోరాడుతున్నట్లుగా పెద్దగా నటిస్తున్న పార్లమెంటరీ 'వామపక్షం' పార్లమెంట్ నుండి వాకౌట్ చేయడమనే సాంప్రదాయాన్ని ఆచరించటం తప్ప చేస్తున్నదేమీ లేదు. ఇతరులు ప్రతిపక్షం ముసుగులో కొద్దిగా గొణుగుతుండవచ్చంతే.

సామ్రాజ్యవాదులకు దేశాన్ని అమ్మేసే కీలకాంశంతో పాటు ఈ బడ్జెట్ మధ్యతరగతిపై తీవ్రమైన ప్రభావం కల్గిస్తోంది.

### మధ్యతరగతిపై దాడి

దేశ భద్రత పేరిట సగటు మధ్యతరగతి వ్యక్తి తన ఆదాయ పన్ను మీద అదనంగా 3 శాతాన్ని (ఇపుడు 5 శాతంగా వుంది) షేర్లపై వచ్చే

డివిడెంట్ ఆదాయంపై 10 శాతం అదనపు పన్నును కట్టాలి. జీవిత భీమాపై సర్వీస్ పన్నును కూడా పెంచేశారు.

వీటితోపాటుగా మధ్యతరగతి వ్యక్తికి ప్రావిడెంట్ ఫండ్, ఇతర చిన్న పొదుపులపై వచ్చే వడ్డీలో 0.5 శాతం తగ్గింది. (ఈ వడ్డీ రేటును ఈరోజు 7.24%గా వున్న ప్రభుత్వ సెక్యూరిటీలపై వడ్డీరేటుతో ముడిపెట్టాలని బడ్జెట్ నిర్ణయించినందువల్ల 9 శాతానికి తగ్గించిన పి.ఎఫ్., ఇతర చిన్న పొదుపులపై వడ్డీరేటు భవిష్యత్తులో మరింతగా తగ్గిపోతుంది). అతడి మదుపులపై పన్ను రిబేటు 10 శాతంకి తగ్గింది. వీటితోపాటు మధ్యతరగతి ప్రజలు అధిక తపాలా ఛార్జీలను, రైల్ ఛార్జీలను చెల్లించుకోవాల్సి వుంది. వంట గ్యాస్‌కి సిలిండర్‌కి 40 రూ॥లను లీటర్ కిరోసిన్‌పై రూపాయి నలభై పైసలను అదనంగా చెల్లించాల్సి వుంటుంది. వీటన్నింటితోబాటు ఎరువుల సబ్సిడీ రేటులో 5 శాతం తగ్గించినందువల్ల రైతు ఎరువుల కోసం అదనంగా చెల్లించాలి. మొత్తంగా చూస్తే ప్రభుత్వం ప్రజల నుండి 15,000 కోట్ల రూ॥ల భారీ మొత్తాన్ని గుంజుకోబోతోంది.

మరోవైపున గత బడ్జెట్‌లో బడా పెట్టుబడిదారులకు అప్పనంగా అందించిన 17,000 కోట్ల రూ॥ల మొత్తాన్ని ప్రభుత్వం ఈ సంవత్సరం కూడా కొనసాగించింది. పైగా కస్టమ్స్ పన్నులో కోత ద్వారా 2,200 కోట్ల రూ॥లను, పంపిణీ పన్నును రద్దు చేయటం ద్వారా 1,300 కోట్ల రూ॥లను ప్రభుత్వం నజరానాగా పై మొత్తానికి కలిపింది.

మరో విధంగా చెప్పాలంటే బడా పెట్టుబడిదారులకు 20,500 కోట్ల రూ॥లను ఇచ్చేందుకుగాను ప్రభుత్వం 15,000 కోట్ల రూ॥లను ప్రజల నుండి గుంజుకుంటోంది.

వీటితోపాటు రక్షణ రంగంపై పెంచిన వ్యయంలో అధిక భాగం దక్షిణాసియా ప్రాంతంలో భారత పాలకవర్గాల విస్తరణ లక్ష్యాలను మరింత ముందుకు తీసుకుపోయేందుకోసం, ప్రజల అసమ్మతిపైన, కొనసాగుతున్న జాతుల పోరాటాలపైన మందుగుండు దట్టించడానికి ఖర్చవబోతోంది.

ఈ బడ్జెట్ రక్షణ రంగ వ్యయాన్ని మరొక 14 శాతం అంటే 57,000 కోట్ల నుండి 65,000 కోట్ల భారీ మొత్తానికి పెంచేసింది. దీంతోపాటు పరిశోధనలపై 23 శాతం వాస్తవ పెరుగుదలతో ఈ బడ్జెట్ రక్షణ పరిశోధనలకు 9,813 కోట్ల రూ॥లను కేటాయించింది. కాబట్టి మాజీ సైనికులకు, మాజీ రక్షణశాఖ ఇంటెలిజెన్స్ ఉద్యోగులకు పింఛను వంటి రక్షణ రంగంలోని బయటకు కన్పించని వ్యయాన్ని లెక్కలోకి తీసుకుంటే మొత్తం రక్షణ బడ్జెట్ 80,000 కోట్ల రూపాయలవుతుంది. దేశ ప్రజలను, పొరుగు దేశాల ప్రజలను వూచకోత కోయడానికి తుపాకుల కోసం ప్రజల నుండి ఇంత డబ్బు గుంజుకుంటున్నారు.

## సామ్రాజ్యవాద, దళారీ కూటమిని నిర్మూలించండి

ఈ బడ్జెట్ సామ్రాజ్యవాదుల ఆదేశానుసారం అమలవుతున్న మలివిడత సంస్కరణల కొనసాగింపే తప్ప మరేం కాదు. తమ ప్రయోజనాలను సామ్రాజ్యవాదులతో విడదీయ రానంతగా ముడిపెట్టిన దళారీ బానిసలు వాళ్ళు పెట్టమన్న చోటల్లా గుడ్డిగా సంతకం పెడుతున్నారు. వీళ్ళు విదేశీ ప్రయోజనాల కోసం దేశ ప్రజలను నాశనం చేయడానికి కంకణం కట్టుకున్న అంతర్జాతీయ ద్రవ్యసంస్థల తొత్తులు తప్ప మరొకటి కారు. వీళ్ళంత ఘోరమైన విద్రోహులు, నేరస్థులు కుమ్మక్కుదార్లు అంటే వీరందరినీ ప్రజాకోర్టులో విచారించి శిక్షించాలి.

ఆర్థిక వ్యవస్థను సొంతకాళ్ళమీద నిర్మించి సామ్రాజ్యవాద శృంఖలాలను బద్దలు గొట్టడం ద్వారా ఈ ఆర్థిక దోపిడీ సంస్కరణల్ని తిప్పికొట్టాలి. పలువురు ఉదారవాదులు ప్రతిపాదిస్తున్నట్లుగా ప్రపంచీకరణకు మానవ ముఖం ఇవ్వడం ద్వారా భారతదేశంపై ప్రపంచీకరణ దుష్ప్రభావం సంస్కరింపబడదు. లేక, సి.పి.ఐ., సి.పి.యం. రివిజనిస్టులు ప్రతిపాదిస్తున్నట్లుగా గతంలోని పరాన్నభుక్కు ప్రభుత్వ రంగానికి ఆర్థిక వ్యవస్థ మళ్ళేదు కూడా. మానవత్వం లేని ద్రవ్య పెట్టుబడి పైశాచిక దాడే ప్రపంచీకరణ. సామ్రాజ్యవాదులను దేశం నుండి తన్ని తరిమి, వారి ఎంగిలి మెతుకులపై ఆధారపడి జీవిస్తున్న దేశీయ దళారీ ఏజెంట్లను నిర్మూలించగల మిలిటెంట్ సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమమే ఈ ఆర్థిక సంస్కరణలకు తిరుగులేని సమాధానమవుతుంది.

# ట్రేడ్ యూనియన్లు - ఆర్థికవాదం

సకల ప్రజా విభాగాలూ అందించిన అపూర్వ సంఘీభావంతో ప్రభుత్వం మెడలు వంచి ఆర్‌టిసి కార్మికులు తమ డిమాండ్లను ఓమేరకు సాధించుకున్నప్పటికీ ఈ సమ్మె ఆర్‌టిసికే కాక మొత్తం కార్మికవర్గానికే గుణపాఠాలు నేర్పుతుంది.సామ్రాజ్యవాద మార్కెట్లలో పెద్ద బిక్షగాళ్లైన దళారీ పాలకవర్గాలు అడుగడుగునా కార్మికవర్గపు అంతంతమాత్రం బతుకులపై క్రూరమైన దాడికి ఎప్పటినుంచో సిద్ధపడిపోయాయి. కాగా మరోవైపు గత 75 సం॥లపైగా ఆర్థికవాదపు ఊడల్ని బలంగా దింపుకుని వున్న దేశీయ ట్రేడ్ యూనియన్ నాయకత్వం కార్మికవర్గాన్ని నిర్వీర్యం చేస్తున్నది. ట్రేడ్ యూనియన్లలో అడుగడుగునా రాజ్యమేలుతున్న 'ఆర్థికవాదం' కార్మికోద్యమం నవనాడులు క్రుంగదీస్తోంది. ట్రేడ్ యూనియన్ నాయకత్వం కార్మిక వర్గానికి రాజకీయ చైతన్యం లేకుండా చేస్తున్నది. కార్మికవర్గాన్ని వేతన బానిసత్వం నుండి తప్పించే రాజకీయ పోరాటాలవైపుకు మళ్లించకుండా ట్రేడ్ యూనియన్ తత్వం కార్మికవర్గ పోరాటాలను వేతనాల డిమాండుకు, సొంత జీవితాలలో కాసింత మార్పుకు మాత్రమే పరిమితం చేస్తోంది. ఆరకంగా సాధించిన స్వల్పమాత్రం జీతం రాళ్లతో, రాజీ బేరాలతో, లొంగుబాటుతో ట్రేడ్ యూనియన్ నాయకత్వం తన పబ్బం గడుపుకుంటోంది.

కార్మికులకు ఎప్పుడూ సరైన పనికి సరైన వేతనం దొరక్కపోవడం పెట్టుబడిదారీ విధానపు మౌలిక నియమం. కార్మికుల శ్రమవల్ల జరిగిన సామాజిక వుత్పత్తి మొత్తం పెట్టుబడిదార్లకుపోతూ, దాన్నుండి కార్మికులు కేవలం తమ కనీస అవసరాలకు సరిపడినంత మొత్తాన్నే వేతనంగా ఈ వ్యవస్థలో పొందగలుగుతారు. ఈ పరిస్థితికి అత్యంత ప్రధాన కారణం ఉత్పత్తి సాధనాలపై, ఉత్పత్తి నిర్వహణపై యాజమాన్యం వాస్తంగా ఉత్పత్తిదారులైన శ్రామికుల చేతుల్లోకాక పెట్టుబడిదార్ల చేతిలో వుండటమే. కార్మికులు సృష్టించిన సంపదలో అత్యధిక భాగం పెట్టుబడిదారుడి జేబుల్లోకి పోయి, కార్మికులకి కేవలం పని చేసేందుకు, తమ సంతానాన్ని పెంచుకోవడానికి అవసరమైనంత తక్కువ మాత్రమే లభించే పరిస్థితులు పోనంతవరకు కార్మికుల వేతన బానిసత్వం పోదు. సంపద–ఉత్పత్తి–పై యాజమాన్యం ఆ సంపదను శ్రమశక్తితో సృష్టించిన శ్రామికుల హస్తగతం కాకుండా, పనికోసం, జీతంకోసం శ్రామికులు జీవితాంతం గింజుకుంటూ వుండాల్సిన స్థితి తొలగదు. అందుకే ఇంగ్లండులో 1830లలో చార్టిస్టుల ఉద్యమ కాలం నుండి దాదాపు 60 సం।లపాటు ట్రేడ్ యూనియన్‌లు వేతన నియమాలకు వ్యతిరేకంగా పోరాడుతూ వచ్చినా కార్మికులను వేతన బానిసత్వం నుండి బయటపడేయ లేకపోయాయని ఎంగెల్స్ విమర్శిస్తాడు.

తాము సృష్టించిన సంపదలకే తాము బానిసలుగా మారిపోకుండా కార్మికులను ఈ పోరాటాలు రక్షించలేక పోయాయని, తమ శ్రమ మీద, శ్రమ ఫలితమైన ఉత్పత్తి మీద కార్మికులనే యజమానులుగా ఏ ఒక్క ట్రేడ్ యూనియన్ పోరాటమూ మార్చలేక పోయిందని, ఏ ఒక్క సెక్షన్ కార్మికులు కూడా ఈ పోరాటాల వల్ల విముక్తి కాలేకపోయారని, పైగా అలాంటి విముక్తికి అవసరమైన ప్రయత్నాలను సైతం ఇంగ్లండులోని ట్రేడ్ యూనియన్‌లు చేపట్టలేక పోయాయని ఎంగెల్స్ 1881లో రాసిన 'కార్మికులు వేతన బానిసత్వం నుండి విముక్తి పొందాలి' అనే వ్యాసంలో విమర్శించాడు. ట్రేడ్ యూనియన్‌ల పోరాటాల వల్ల 'వేతన వ్యవస్థ తలకిందులై పోదని, పోరాటం చేస్తేతప్ప తమకు రావలసిన కనీస మొత్తాన్ని కార్మికులు పొందలేని ఈ వ్యవస్థలో ట్రేడ్ యూనియన్ పోరాటాల వల్ల 'వేతన వ్యస్థ' ఏదో ఒకమేరకు అమలు జరుగుతుందని, అంతేకానీ, కార్మిక సంఘాలు వేతన వ్యస్థకు వ్యతిరేకంగా పోరాడవని ఎంగెల్స్ పేర్కొంటాడు. కార్మికులను నిత్యం జీతం రాళ్ల పెంపుదల కోసం గింజుకునేలా చేస్తున్న ఈ ఆర్థిక దారిద్ర్యం, కార్మికులు తాము సృష్టించిన సంపదనంతటినీకాక అందులో కొంత భాగాన్ని పొందటం వల్లే వచ్చిందని, ఉత్పత్తి సాధనాల మీద తన యాజమాన్యం కారణంగానే పెట్టుబడిదారుడు కార్మికులు సృష్టించిన మొత్తం సంపదను తన జేబులో వేసుకుంటున్నాడని ఎంగెల్స్ పేర్కొంటూ, కార్మికవర్గం భూమి, ముడిసరుకులు, యంత్రాలు వంటి ఉత్పత్తి సాధనాలపై తానే యాజమాన్యం సంపాదించితే తప్ప విముక్తి పొందజాలదని అపుడు మాత్రమే కార్మికులు తాము సృష్టించిన మొత్తం సంపదకు తామే యజమాను లవుతారని సూత్రీకరించాడు.

ఎంగెల్స్ ఈ వ్యాఖ్యలు చేసి 120 ఏళ్లకు పైనే అవుతోంది. ఆ రోజుకి ఈరోజుకీ ప్రపంచ వ్యాప్తంగా ట్రేడ్ యూనియన్‌ల పోరాటాల స్వభావంలో మౌలికంగా మార్పేమైనా వచ్చిందా అంటే యిసుమంత మార్పూ రాలేదు. చరిత్రలో ట్రేడ్ యూనియన్‌లు ఏర్పడి 170 సం।లు కావస్తున్నా ఈనాటికీ వాటిలో ఆర్థికవాద ఛాయలు అంతరించటం లేదు. ఒక్క ఇంగ్లండ్ కార్మికవర్గమేకాక యూరప్, అమెరికన్ కార్మికవర్గం మొత్తంగా, ఆర్థికవాదం లోనూ, కేవల ఆర్థిక పోరాటాలలోనూ కూరుకుపోయింది. లేబర్ పార్టీలూ, సోషలిస్ట్ పార్టీలూ కార్మికవర్గ 'ప్రభువులు'గా మారి కార్మిక హక్కులను నేలరాలుస్తున్న, ప్రయివేటీకరణకు 'సోషలిస్ట్' భాష్యాలు చెబుతున్న చరిత్ర ఇప్పటికీ అక్కడ నడుస్తూనే వుంది.

ఈ దుస్థితి యూరప్‌లోని ట్రేడ్ యూనియన్‌లకు మాత్రమే పరిమితం కాదు. భారతదేశంలో 75 సం।లుగా వునికిలో వున్న ట్రేడ్ యూనియన్‌లు సైతం దీంట్లో కూరుకుపోయాయి. పాలకవర్గ ట్రేడ్ యూనియన్‌లు, 'వామపక్ష' ట్రేడ్ యూనియన్‌లు ఒకటేమిటి... ప్రతి ఒక్క యూనియన్ కూడా రాజకీయ పోరాటాలను విడనాడి ఆర్థిక పోరాటాలకే పరిమితమైనాయి. పార్లమెంటరీ రివిజనిస్టులు పథకం ప్రకారం ట్రేడ్ యూనియన్‌లను ఆర్థిక పోరాటాలకు పరిమితం చేసి రాజకీయ పోరాటాలను బూర్జువా వర్గానికే వదిలిపెట్టేసారు. రాజకీయాలు, రాజకీయ పోరాటాలు అనేవి ఎన్నికలకు, ఓట్లకూ, రిగ్గింగులకూ, పార్లమెంటు, అసెంబ్లీలకూ పరిమితమైపోయాయి. కార్మికులు రాజకీయాల జోలికి పోరాదన్న రూపంలో జారిస్టు రష్యాలో ఆర్థికవాదం ఒక బలమైన ధోరణిగా ఎలా తయారైందో అంతకంటే బలంగా మన దేశంలోనూ పాతుకుపోయింది. మన దేశ కార్మికవర్గ వుద్యమాలపై బూర్జువా వర్గ భావజాలం ఎలా నివురుకప్పుకు పోయిందంటే, సోషలిస్ట్ రాజకీయ చైతన్యం స్థానంలో, బూర్జువా చైతన్యపు విషం చొరబడి కార్మికవర్గాన్ని మొత్తంగా నీరసపరుస్తోంది. మన దేశంలో బూర్జువా వర్గమే ప్రత్యక్షంగా నడుపుతున్న ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, బిఎంఎస్ లాంటి పాలకవర్గ ట్రేడ్ యూనియన్‌లు, రివిజనిస్టు పార్టీల అనుబంధ ట్రేడ్ యూనియన్‌లైన ఎఐటియుసి, సిఐటియుసి లు కలిసికట్టుగా 'రాజకీయ చైతన్యం కంటే జీతంరాళ్లు మిన్న అంటూ ఎందుకూ కొరగాని ట్రేడ్ యూనియన్ చైతన్యాన్నే పెంచి పోషిస్తూ వచ్చారు. ఈ విధంగా 75 సం।ల చరిత్ర క్రమంలో రాజకీయ లక్ష్యాన్ని, దృక్పధాన్ని కోల్పోయి కేవలం ఆర్థిక పోరాటాలను నడిపే పైరవీకారి సంఘాలుగా భారతీయ ట్రేడ్ యూనియన్‌లు మారిపోయాయి. ఇక వాటి చోటా నాయకులు కార్మికులకు దరఖాస్తులు రాసిపెట్టే గుమస్తాలుగానూ, వాటి పెద్ద నాయకులు యజమానుల ఏజెంట్లుగాను తయారై కార్మికోద్యమాన్ని యజమానులకు తాకట్టు పెట్టి లంచగొండి 'ఆఫీసర్లు'గా తయారైనారు. చరిత్రలో ఈ రకం

ఆర్థికవాద ధోరణి, కార్మికవర్గంలో సోషలిస్టు చైతన్యం కల్గించడానికి కార్మికవర్గ పార్టీలు చేసే కృషిని అడ్డుకుని, విప్లవ శక్తులను నీరసపర్చడానికి ప్రయత్నించి విప్లవ ప్రతీఘాతుకంగా తయారైంది.

పాలకవర్గ ట్రేడ్ యూనియన్‌ల సంగతలావుంచితే, రివిజనిస్టు పార్టీల ట్రేడ్ యూనియన్‌లు మొదటినుండి ఆర్థిక పోరాటాలకే పరిమితం అయాయని అంటున్నామంటే దానర్థం ఆర్థిక పోరాటాలు చేయరాదనిగాని కార్మికవర్గానికి అవి నిషిద్ధమని గాని కాదు. ట్రేడ్ యూనియన్‌లు, ఆర్థిక పోరాటాలు ఒక చారిత్రక అవసరం లోంచి పుట్టుకొచ్చాయి. కార్మికుల కార్యకలాపాలు నిషేధానికి గురై కార్మిక సంఘాలు అనేవి ఏ మాత్రంలేని దశలో, పెట్టుబడిదారులు పనిగంటల్లో, స్థిరవేతనాలతో నిమిత్తం లేకుండా కార్మికులను దారుణంగా దోపిడీ చేస్తూ వచ్చిన స్వేచ్ఛా పెట్టుబడిదారీ విధానం మొదటి దశలో, పెట్టుబడిదారీ వర్గంతో కార్మికవర్గం పోరాడి తీరాల్సిన అవసరంలోంచి ఇంగ్లండ్‌లో మొట్టమొదటిసారిగా ట్రేడ్ యూనియన్‌లు పుట్టుకు వచ్చాయి. కార్మికుల కార్యకలాపాలను పూర్తిగా నిషేధించిన నిరంకుశ చట్టాలు–కాంబినేషన్ చట్టాలు–ఇంగ్లండులో 1824లో రద్దయిన తర్వాతే, 'న్యాయమైన రోజు పనికి న్యాయమైన వేతనం' లక్ష్యంగా కార్మిక సంఘాలు ఏర్పడుతూ వచ్చాయి. ఈ కోణంలో అన్ని దేశాలకు ట్రేడ్ యూనియన్‌లు అవసరమైనవే. ట్రేడ్ యూనియన్‌లు చేసే పోరాటాలకు వున్న ఒక గొప్ప లక్షణం ఏమంటే అవి పనిగంటల తగ్గింపు, లేదా వేతనాల పెంపుకోసం పోరాడుతూనే కార్మికుల కనీస అవసరాల మొత్తం విలువకు సంబంధించిన ప్రమాణం పడిపోకుండా వుండటానికి లేదా పెరగడానికి తోడ్పడుతాయి. పనిగంటల తగ్గింపు, వేతనాల పెంపు తదితర పోరాటాలను కార్మికులు విడివిడిగా చేపట్టలేరు. ట్రేడ్ యూనియన్‌లు లేకుండా అవి సాధ్యంకావు. అయితే వేతనాల పెంపుకోసం ట్రేడ్ యూనియన్‌లు చేసే పోరాటాల ద్వారా వేతన వ్యవస్థ తలకిందులు కాదన్నదే ఇక్కడ ప్రధానం. ట్రేడ్ యూనియన్‌ల సంఘటిత శక్తివల్ల, పోరాటాల వల్ల వేతన వ్యవస్థ అమలవుతుందంతే. ట్రేడ్ యూనియన్‌లంటే భయంవల్ల మాత్రమే పెట్టుబడిదారుడు శ్రమశక్తిని దాని మార్కెట్ ధరకు కొంటాడు. కార్మికసంఘాల్లో సభ్యులైన కార్మికుల జీతాలను, సంఘాలులేని, సంఘటితంకాని కార్మికుల జీతాలకు వుండే తేడాను గమనిస్తే ఈ విషయం బోధపడుతుంది. కీలకమైన విషయం ఏమంటే వేతన వ్యవస్థను (పనిగంటల తగ్గింపు, జీతాల పెంపు వంటివి) అమలు చేయడానికి చేసే పోరాటాలకే పరిమితమైన ట్రేడ్ యూనియన్‌లు మరోవైపు పెట్టుబడిదారులకు అనుకూలంగా వున్న వేతన వ్యవస్థకు వ్యతిరేకంగా, దాని రద్దుకోసం పోరాడకుంటే దోపిడీ స్వభావం గల బూర్జువా వేతన వ్యవస్థ మానవ సమాజంలో శాశ్వతంగా తిష్ట వేస్తుందన్నదే. ఈ అర్థంలోనే దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగాల్సిన రాజకీయ పోరాటాల నుండి కార్మికులను పక్కదారి పట్టించి వారిని కేవలం ఆర్థిక పోరాటాలకే పరిమితం చేయటమంటే వారిని శాశ్వతంగా బానిసత్వానికి గురిచేయటమే. ఆర్థిక పోరాటాలు కేవలం శ్రమశక్తిని అమ్ముకోవడంలో కార్మికులు కొంత రాయితీని సాధించుకోడానికి మాత్రమే తోడ్పడగలవు. వాటికున్న పరిమితే అంతమరి. ఆర్థిక పోరాటాలు ఎంత విస్తృత స్థాయిలో కొనసాగినా, తమ శ్రమశక్తిని అమ్ముకోవాల్సిన దుస్థితికి కార్మికులను దిగజార్చిన సామాజిక వ్యవస్థగాని, ప్రభుత్వాలుగాని సురక్షితంగానే వుండిపోతాయి. అందుకే ఆర్థిక పోరాటాల ద్వారా కార్మికవర్గంలో కేవల ట్రేడ్ యూనియన్ చైతన్యం మాత్రమే పెంపొందుతుంది. కేవల ట్రేడ్ యూనియన్ చైతన్యం వ్యవస్థను స్థిరపర్చి, కార్మికవర్గాన్ని శాశ్వతంగా బానిసత్వంలో వుంచేందుకు దారి సులభం చేస్తుంది.

కార్మికవర్గం ముందున్న ముఖ్యమైన సమస్య ఏమిటంటే ట్రేడ్ యూనియన్‌ని తమ విముక్తికి సోపానంగా ఎలా మార్చుకోవాలనేదే. రాజకీయ లక్ష్యం కొరవడిన ఆర్థిక పోరాటాలు వ్యర్థమూ, నిష్ఫలమేకాక కార్మికుల్లో బూర్జువా చైతన్నాన్ని కల్గించడానికే దోహదం చేస్తాయి. జీతాలను పెంచుకోవడం, జీవిత పరిస్థితులను మెరుగుపర్చుకోడానికి జీవితాంతమూ లేక రిటైరయ్యేంత వరకూ ప్రయత్నించేలా అవి కార్మికవర్గ చైతన్యాన్ని కుదిస్తాయి. ఈనాడు రివిజనిస్టు పార్టీల ట్రేడ్ యూనియన్‌లు చేస్తున్న పని సరిగ్గా యిదే. రష్యాలో లెనిన్ ఆర్థికవాదాన్ని ఈ ప్రాతిపదిక మీదే వ్యతిరేకిస్తూ కార్మికవర్గంలో సోషలిస్టు చైతన్యం కల్గించే కృషి చేయాలంటూ విప్లవ సిద్ధాంతం ప్రతిపాదించాడు. లెనిన్ రచించిన 'ఏంచేయాలి' పుస్తకం సారాంశం అంతా ఇదే. ఆర్థికవాదానికి వ్యతిరేకంగా లెనిన్ ప్రతిపాదించిన ఈ విప్లవ సిద్ధాంతమే రష్యాలో జార్ ప్రభుత్వాన్ని కూలదోసేలా కార్మికవర్గాన్ని ప్రేరేపించింది. మన దేశంలో ట్రేడ్ యూనియన్‌లు మార్క్స్–లెనిన్ ఉపదేశాలకు భిన్నంగా చాలాదూరమే ప్రయాణించాయి. కార్మికవర్గాన్ని కార్మికవర్గ సిద్ధాంతం నుండి దూరం చేయటంలో రివిజనిస్టులు పథకం మేరకు కృషి చేసారు. అందుకే మన దేశంలో ఏ కార్మిక పోరాటాన్ని చూసినా ఆర్థికవాదపు వాసనలే వీస్తుంటాయి. అందుకే భారత కార్మికవర్గం దోపిడీ వ్యవస్థకేకాక, ట్రేడ్ యూనియన్‌లు పెంచిపోషించిన ఆర్థికవాదానికి కూడా వ్యతిరేకంగా పోరాడాల్సి వుంది. ఈ రెండు కర్తవ్యాలూ ఒకే పోరాటంలోని రెండు విడదీయరాని భాగాలు. అసలు ట్రేడ్ యూనియన్ నాయకుల ఊగిసలాట, లొంగుబాటుతనాన్ని ఆసరాగా చేసుకునే ప్రభుత్వాలు ప్రతిసారీ కార్మికవర్గంపై అంత తేలిగ్గా సునాయాసంగా అణచివేత విధానాలను ఝుళిపించ గలుగుతున్నాయి.

అందుకే మన రాష్ట్రంలో ఆర్.టి.సి. సమ్మె సందర్భంగా కార్మికులు పదే పదే చేస్తూ వచ్చిన ఓ ప్రకటనకు ఎంతో ప్రాధాన్యత వుంది. వందలకోట్ల రూ॥ల నష్టాలలో సంస్థ కూరుకుపోయి వుంటుండగా జీతాలూ, బోనస్‌లూ పెంచాలంటూ విచక్షణారహితంగా సమ్మెకు దిగారని చంద్రబాబు మీడియా దన్నుతో విషం చిమ్మాలని చూసినప్పటికీ, ఆర్.టి.సి. కార్మికులు తమ పోరాటం జీతాల కోసం కాదంటూ విస్పష్టంగా ప్రకటించారు. కుక్కకు పిచ్చి పట్టిందని ప్రచారం చేసి ఆనక తేలిగ్గా దాన్ని చంపిన రీతిలో, ఆర్.టి.సి.ని ప్రైవేటీకరించే లక్ష్యంతో దాన్ని తీవ్రమైన నష్టాలకు గురయ్యేలా చేస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగానే తమ పోరాటం జరుగుతున్నదని కార్మికులు ప్రకటించారు.

ఆర్.టి.సి. కార్మికులు ప్రదర్శించిన ఈ చైతన్యమే నిజంగా విశిష్టమైంది. జీతం రాళ్ళకంటే మించి సంస్థ పునాదుల్నే కదల్చి వేస్తున్న ప్రమాద సూచికను గ్రహించటంలో ఆర్.టి.సి. కార్మికులు సకాంలో సరిగ్గానే స్పందించారు. ట్రేడ్ యూనియన్‌తత్వం పరిధులను అధిగమించిన ఈ చైతన్యం వేతన బానిసత్వానికి వ్యతిరేకంగా రాజకీయ చైతన్యంగా రూపొందాలి. ఆర్.టి.సి.ని విద్యుత్ సంస్థలా ప్రైవేటీకరించడానికి చంద్రబాబు ప్రభుత్వం కంకణం కట్టుకున్న నేపథ్యంలో ఈ చైతన్యంతోనే కార్మికులు తదుపరి పోరుకు సిద్ధం కావాలి.

# కార్పొరేటీకరింపబడుతున్న, అమ్మకపు సరుకవుతున్న ప్రపంచ మహిళల పట్ల వెక్కిరింపే మహిళా సాధికారత

ప్రపంచబ్యాంకు ప్రతిపాదిస్తున్న 'మహిళా సాధికారత' తళుకుబెళుకులను పక్కనబెట్టి, ఈ మార్చి 8 అంతర్జాతీయ మహిళా పోరాట దినం సందర్భంగా ప్రపంచ మహిళల స్థితి గతులను పరిశీలిస్తే పెట్టుబడిదారీ వ్యవస్థ చీకటి కోణాలు ఒక్కొక్కటిగా బయటపడతాయి. ఈ చీకటి కోణాల్లో అత్యంత ప్రధానమైంది పర్యాటక అభివృద్ధి పేరిట కొనసాగుతున్న సెక్స్ టూరిజమే.

### ప్రపంచ (సెక్సు) టూరిజం :

పెట్టుబడిదారీ వ్యవస్థ నేరాల 'పాపాల', పరాకాష్టే సెక్స్ టూరిజం. ప్రపంచ వ్యాప్తంగా మహిళలను నీచాతినీచమైన, నికృష్ట దోపిడీకి గురిచేస్తున్న అమానుష కాండతో ఈ సెక్స్ టూరిజం ముడిపడి వుంది. ఇదొక ప్రపంచ పరిశ్రమ రూపం దాల్చి స్త్రీల రక్తమాంసాల వ్యాపారం పెరుగుదలకి దారితీస్తోంది. పెట్టుబడిదారీ విధానం పెంచి పోషిస్తున్న వికృత లైంగిక కుతి కోసం మహిళలూ, పిల్లలు సైతం ఈ మాంస వ్యాపారం బారిన పడి తమ శరీరాలను అమ్ముకుంటున్నారు. సామాజిక ఆర్థిక సంక్షోభ పరిస్థితుల వత్తిడికి గురైన లక్షలాదిమంది ఆసియా దేశాల మహిళలు వేశ్యలుగా, క్యాబరే డ్యాన్సర్లుగా, నైట్‌క్లబ్‌లలో వెయిట్రెస్‌ల లాగా, మాదక ద్రవ్యాలను అందించే వారిగా పనిచేస్తూ లైంగిక దోపిడీకి గురవుతున్నారు.

మహిళలపట్ల అమానుషమైన లైంగిక, ఆర్థిక దోపిడీకి రూపమే సెక్స్ టూరిజం. క్షీణిస్తున్న పాశ్చాత్య నగర జీవితంలో దీని మూలాలు వుంటున్నాయి. పరాయీకరణకు, సంస్కృతీ రాహిత్యానికి గురైన పాశ్చాత్య సమాజంలో, జీవితానికి అర్థమే లేకుండా పోయి ఖర్చు పెట్టడం, కొనడం, అనుభవించడం మాత్రమే చలామణి అవుతున్న వికృత సమాజంలో, కుళ్ళిపోయిన నగర సంస్కృతిలో దీని బీజాలున్నాయి. ఈ రకమైన క్షుద్ర జీవనంలో కోరికలను నిరంతరం తీర్చుకోవాలంటే నూతన ఉత్తేజాలు, నూతన మార్గాలు, నూతన ఉద్రేకాలు (నూతన శరీరాలు కూడా) సమాజ అనుభవంలోకి పదే పదే వచ్చి పడుతుండాలి. లైంగిక కాల్పనికతలను, ప్రేరేపిత క్షుద్ర కాంక్షలను తీర్చుకోవాలంటే ఇంతకుమించి మార్గమేదైనా వుంటుందా మరి!

ప్రతి సం॥రం సెక్స్ టూర్‌లో భాగంగా ఆమ్‌స్టర్ డామ్ నుంచి బ్యాంకాక్ (థాయ్‌లాండ్ రాజధాని)కి వచ్చి పోతుండే ఒక మామూలు వడ్రంగి యువకుడి మాటలే సెక్స్ టూర్‌లో దాగిన నిజాల్ని చక్కగా ప్రదర్శిస్తాయి. ''ఈ అనుభవం నమ్మశక్యంగానిది. కళ్ళు చెదరగొట్టే సుందర యువతులు ఇక్కడ కారుచౌకగా దొరుకుతున్నారు. ఇప్పటికి ఇక్కడికి మూడుసార్లు వచ్చాను. మూడుసార్లు కూడా ఈ బార్‌ని తప్పితే మరేదీ నేను చూడలేదని ప్రమాణం చేస్తాను. ఇక్కడ అందగత్తెల్లోకెల్లా అందగత్తెలను నువ్వు కాసిన్ని డబ్బులు పోసి పొందవచ్చు. స్పెయిన్‌లో జీవితాంతం చర్మాలు వొలుస్తూ కూచోవటంతో పోలిస్తే ఇది ప్రత్యేకమైందే మరి. ఇక్కడ నువ్వే రాజువి. నువ్వు ఏది కోరుకుంటే అదల్లా దొరుకుతుంది మరి. అది కూడా కాసిన్ని పెన్నీల (రూపాయిలు)కే....''

ఇదీ ఆసియా మహిళలకు లభిస్తున్న విలువ. సెక్స్ టూరిజం ద్వారా పారిశ్రామిక దేశాలు తమ లైంగిక పరాయీకరణలను, వికృత చేష్టలను మూడో ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. నిజమే 'సోషలిజమూ లేదు, కేపిటలిజమూ లేదు టూరిజం తప్ప' అని చంద్రబాబు వూరికే అనలేదు మరి. ఇతగాడి రాజ్యం సైతం వీధి హోటళ్ళకు, అంగళ్ళకు రాత్రిపూట అనుమతి నిరాకరించి విదేశీయులకు, వారి దేశీయ మానస పుత్రులకు తప్ప తాగి గంతులేయటానికి పచ్చజెండా వూపింది.

### బానిసల వ్యాపారంతో పోటీపడుతున్న స్త్రీల, పిల్లల అక్రమ రవాణా

ప్రపంచ వ్యాప్తంగా సెక్స్ వ్యాపారం కోసం స్త్రీల, పిల్లల అక్రమ రవాణాని, తరలింపును ఆర్థిక, సామాజిక పతనం పతాక స్థాయికి తీసుకు పోతోంది. సెర్బియాపై నాటో బాంబు దాడి తర్వాత కొసావోలో సెక్స్‌పరమైన రవాణా పుట్టగొడుగుల్లా ప్రబలిపోయింది. సాక్షాత్తూ ఐక్యరాజ్యసమితి, ఇతర ఏజెన్సీలే నిర్బంధ వ్యభిచార వ్యాపారానికి ఆజ్యం పోస్తున్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. కొసావోలో బార్లు, నైట్‌క్లబ్‌ల మాటున సాగుతున్న వేశ్యా వ్యాపారంలో ఐక్యరాజ్య సమితి, ఇతర అంతర్జాతీయ సంస్థల ఉద్యోగులే ముఖ్య సందర్శకులని అంతర్జాతీయ వలస సంస్థ

(ఐ.ఓ.యం.) ఆరోపించింది. ఈ మహిళల్లో చాలామంది నిర్బంధంగా వ్యభిచార వృత్తిలోకి దింపబడ్డారు. కొసావోలో వేశ్యావృత్తిలోకి నెట్టబడిన మహిళల్లో 50 శాతం పైగా మునుపటి సోవియట్ రిపబ్లిక్ అయిన మోల్డోవా నుండే వచ్చారు. వీరిలో మూడింట రెండొంతుల మంది అంతకుముందెన్నడూ ఈ వృత్తిలో వుండటం జరగలేదు. పాశ్చాత్య దేశాలలో వుద్యోగాలిప్పిస్తామని వీరందరినీ నమ్మించి ఇండ్ల నుండి బయటకు లాగారు. ఇలా ఒకసారి గడపదాటాక వారి పాస్‌పోర్ట్‌లను లాక్కుని 500 నుంచి 1500 డాలర్లకు ఒక్కొక్కరిని వేశ్యలుగా అమ్మేశారు.

ఈ రకమైన స్త్రీల పిల్లల అక్రమ రవాణా అంతర్జాతీయంగా పెరుగుతోంది. ప్రతి సం॥రం ఐదు లక్షల మంది స్త్రీలు ఈ రకంగా పశ్చిమ యూరప్‌కి కొని తేబడుతూ సెక్స్ పరిశ్రమలోకి ఈడ్వబడుతున్నారని ఐ.ఒ.ఎం. అంచనా. మరొక అంచనా ప్రకారం ఇలాంటి వారి సంఖ్య పదిలక్షల దాకా వుంటోందట. పశ్చిమ దేశాల వలస చట్టాల ఆంక్షలు ఈ వ్యాపారానికి మరింతగా ఆజ్యం పోస్తున్నాయి. దారిద్ర్యాన్ని, లేమిని వదిలించుకోవాలని మూడో ప్రపంచ దేశాల ప్రజలు తెగించి చేస్తున్న చర్యల వల్ల చట్ట విరుద్ధ వలసలూ, వాటితో ముడిపడిన క్రిమినల్ గ్యాంగ్‌లూ పెరిగి పోతున్నారు. ప్రపంచంలో కెల్లా నిరుపేద ప్రాంతాల నుండి ఈ రకంగా వలస వ్యాపారంలోకి వస్తున్నారు. ఉక్రేనియా, ఆల్బేనియా, ఫిలిప్పైన్స్, థాయ్‌లాండ్, మెక్సికో, నైజీరియా వంటి బలహీన ప్రాంతాల నుండి ఒక అమెరికాలోకే ప్రతి సం॥రం 50,000 మంది మహిళలు ఇలా వలస వస్తున్నారని అంచనా. జీవన ప్రమాణాలు పడిపోతుండటంతో పలు ఇతర దేశాలలోనూ ఈ సమస్య పెరుగుతోంది.

సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాల పాలనా వ్యవస్థలు కుప్పగూలిన తర్వాత ఈ దేశాలు స్త్రీల, పిల్లల (సెక్స్) రవాణా కేంద్రాలుగా ముందుపీఠికొచ్చాయి. ఈ దేశాల్లో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగాక అసంఖ్యాక మహిళలు పశ్చిమ దేశాలకు తరలింపబడుతున్నారు. బ్రిటన్‌లో నిర్బంధ వ్యభిచారంపై జరిగిన సర్వే ప్రకారం బ్రిటన్‌లో వ్యభిచార వృత్తిలో వున్న మహిళల్లో అధిక భాగం ఉక్రెయిన్ నుండి వచ్చినవారే అని తేలింది. ఈ మాజీ సోవియట్ రిపబ్లిక్ నుంచి 5 లక్షల మంది స్త్రీలు ప్రాశ్చాత్య దేశాలకు తరలింపబడ్డారని ఒక అంచనా. 1991 నుండి ఈ దేశంలో నిరుద్యోగపు రేటు 70 శాతంగా వుంటోంది. బహుశా ఇదొక ప్రపంచ రికార్డు కూడా. ఇంగ్లండ్‌లో సెక్స్ వ్యాపారంలో మహిళల నిర్బంధ తరలింపు ఎంతగా ప్రబలి పోయిందంటే లండన్ నగరపు వ్యభిచార కూపాల్లో ప్రతి 10 మందికి 6 గురు మహిళలు ఇలా వలస వచ్చినవారే. వీరంతా తమ పాస్‌పోర్టులను సెక్స్ వ్యాపారుల పరం చేసి రోజుకు 17 గంటల పైగా వ్యభిచారంలో పాల్గొనాల్సి వస్తోంది. వీళ్ళ సంపాదన అంతా వ్యభిచార ముఠాల, నిర్వాహకులకు నివాసం, తిండి, ప్రయాణాల ఏర్పాటు పేరిట హరించబడుతుంటుంది. ఇదొక అధునాతన రుణ బంధనం. వలస మహిళలు తప్పించుకోకుండా హింసా దౌర్జన్యాలు నిరోధిస్తుంటాయి.

యూరప్ ప్రధాన భూభాగంలో ప్రత్యేకించి జర్మనీలోని ప్రధాన నగరాలలో మహిళల సెక్స్ రవాణా తీవ్ర స్థాయిలో జరుగుతోంది. యూరప్ ఖండంలోకెల్లా గరిష్ట లాభాలార్జించే సెక్సు పరిశ్రమకు జర్మనీయే కేంద్రం. ఇక్కడ ''శ్వేత బానిసత్వపు నూతన రూపం''లో రష్యన్ మహిళల వాటానే అధికంగా వుందని బి.బి.సి. రిపోర్టు. చట్ట విరుద్ధమైన, అత్యంత లాభదాయకమైన మానవ రవాణాకి, మహిళల పిల్లల అమ్మకాలకు బానిసత్వంతో సరిపోల్చ దగ్గ మహిళల సెక్స్ రవాణా కేంద్రమై పోయింది. బానిసత్వం బానిసల ఇచ్ఛకు వ్యతిరేకంగా బలవంతంగా రుద్దబడిన విధానం కాగా, ఈ రకం స్త్రీల అక్రమ రవాణా, స్త్రీలపై నిర్బంధ వ్యభిచారం కూడా స్త్రీల ఇచ్ఛకు వ్యతిరేకంగా సాగుతున్న పెట్టుబడిదారీ వికృత విధానమే.

### భారత దేశంలో స్త్రీల (వ్యభిచార) రవాణా:

భారతదేశంలోని 400 ప్రధాన రెడ్‌లైట్ (వ్యభిచార) ఏరియాల్లో 20 నుండి 30 లక్షల మంది మహిళలు వ్యభిచార వృత్తిలో దింపబడ్డారు. దేశంలోని వ్యభిచారిణులలో 30 శాతం మంది ఆడపిల్లలే. వీరి సంఖ్య సంవత్సరానికి 10 శాతం మేరకు పెరుగుతూ వస్తోంది. వ్యభిచారిణులలో దాదాపు 80 శాతం మంది దిగువ కులాలకు, ఆదివాసీలకు చెందినవారు. కేవలం పూట గడవటం కోసమే వీరంతా నిర్బంధంగా ఈ వృత్తిలోకి లాగబడ్డారు. తక్కిన 20 శాతం వ్యభిచారిణులలో చాలా వరకు కుటుంబంలో, సమాజంలో పితృస్వామిక దోపిడీ వల్ల, పురుషోన్మాదులు అత్యాచారం జరపటం వల్ల, ప్రియుళ్ళు మోసగించటం వల్ల, మతకల్లోలాల సమయంలో మతోన్మాదులు అత్యాచారాలు జరపటం వల్ల, పోలీసుల, ప్రభుత్వ సాయుధ బలగాల దౌర్జన్యాల వల్ల నిర్బంధ వ్యభిచారంలోకి లాగబడ్డారు. (వీళ్ళు కాక ప్రతి సంవత్సరం నేపాలీ గ్రామాల నుండి దారిద్ర్యంలో కూరుకుపోయిన 10,000 మంది నేపాలీ మహిళలను, ఆడపిల్లలను పోలీసుల మద్దతుతో భారతీయ వ్యభిచార కూపాలకు తరలించటం కూడా జరుగుతోంది.

కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖే స్వయంగా ప్రకటించినట్లుగా కర్నాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు వరుసగా దేశంలోకెల్లా మహిళలను అత్యధికంగా వ్యభిచారంలోకి దింపుతున్న సరఫరా కేంద్రాలుగా వుంటున్నాయి. (సెక్స్) టూరిజాన్ని మాత్రమే నమ్ముకున్న చంద్రబాబునాయుడి చలవవల్ల ఆంధ్రప్రదేశ్ త్వరలోనే ఈ జాబితాలో ప్రథమ స్థానానికి ఎగబాకే అవకాశముంది.

కటిక వాస్తవమేదంటే వ్యభిచార మహిళల్లో అత్యధికులు తమకుతాము ఇష్టపూర్వకంగా కాక దారిద్ర్యం, ఆర్థిక పతనం, లేమి, వంచన కారణంగా ఈ వృత్తిలోకి దిగుతుండటమే వీరిలో చాలావరకు ఇంట్లో, పని స్థలంలో, లేక వీధుల్లో లైంగిక దాడికి గురైనవారే. పేదరికంలో కూరుకుపోయిన తల్లిదండ్రుల నుండి ఆడ సంతానాన్ని రజస్వల కాక ముందే కొనివేసి వ్యభిచార కూపాల్లోకి తెచ్చిపడేస్తున్నారు. మరింతగా మాంసం కూడేలా పశువులను, కోళ్ళను ఏపుగా పెంచి లాభాలకు అమ్ముకుంటున్నట్లుగా ఇలా కొనేసి తెచ్చిన బలహీనపు ఆడపిల్లలకు బెనెట్రాడిన్ వంటి స్టెరాయిడ్స్‌ని తినిపిస్తూ కృత్రిమంగా వారి ఒంటిమీద కండ సమకూడేలా పెంచుతూ మాంస వ్యాపారం చేస్తున్నారు. ఇంకొంత మందిని చట్ట వ్యతిరేకంగా, పిల్లల ఇచ్ఛకు వ్యతిరేకంగా దేవదాసీలుగా మారుస్తూ వారిని లైంగిక కుతితో వేగిపోతున్న పైశాచికానందపు పురుష కస్టమర్లకు బానిసలుగా వూడిగం చేసేలా మార్చివేస్తున్నారు. ప్రశాంతంగా జీవితం గడిపేందుకు ఏ విధమైన అవకాశమైనా వుంటే, ఈ వృత్తిలోకి ఏ మహిళా రాదు. భద్ర జీవితానికి సంబంధించిన ప్రత్యామ్నాయ, స్వేచ్ఛా ఎంపిక అన్నదే ఈ దేశంలో స్త్రీలకు అందని మానిపండులా వుంటోంది. మహిళల సాధికారతపై ప్రపంచబ్యాంకు ఎజెండా వ్యభిచార స్త్రీల సాధికారతకుగాను చట్టబద్ధ వ్యభిచార భావనను ప్రవేశపెట్టింది. వర్గ సమాజ చరిత్ర పొడవునా

# చట్టబద్ధ వ్యభిచారం చట్టబద్ధ హింసకు ప్రతిరూపం

వ్యభిచారాన్ని సెక్స్‌వర్క్ (లైంగిక శ్రమ)గా, వ్యభిచార మహిళను సెక్స్ వర్కర్‌గా పిలవటం అంటే మహిళల, ఆడపిల్లలపై లైంగిక దోపిడీకి చట్టబద్ధత కల్పించటమే. మహిళలనూ, ఆడపిల్లలనూ వ్యభిచారంలోకి దింపుతున్న దారిద్ర్యం, హింస, అసమానత్వం వంటి ప్రాథమిక అంశాలను నిర్లక్ష్యం చేయటమే దీని సారాంశం. ఏ ఇతర శ్రమ లాగే వ్యభిచారం కూడా ఒక విధమైన పని, శ్రమ అంటూ వ్యభిచార వృత్తికి లేని విలువను, ప్రతిష్టనూ కూర్చడానికే ఇది ప్రయత్నిస్తుంది.

లైంగిక శ్రమ అనేది ఒక వాస్తవ శ్రమ అనీ, అన్ని పనుల్లాగే ఇదీ ఒక పని అనీ సమర్థిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా సంఘటితమైన వాణిజ్య సెక్స్ పరిశ్రమే చట్టబద్ధ వ్యభిచారం గురించి బలంగా ప్రచారం చేస్తున్నది. లైంగిక దోపిడి, లైంగిక హేళనలను 'పని', 'శ్రమ' అంటూ వర్ణించటం అంటే వ్యభిచార వ్యతిరేకుల నుండి సెక్స్ పరిశ్రమకు రక్షణ కవచం నిర్మించటమే కాదు, చట్టబద్ధత ద్వారా సెక్స్ వాణిజ్యాన్ని పెంచి పోషించి సెక్స్ వ్యాపారుల లాభాలను రెట్టింపు చేయడం కూడా అవుతుంది.

వ్యభిచార వృత్తిలోని మహిళలను కార్మికులుగా, వ్యభిచార గృహాల నిర్వాహకులను వ్యాపారులుగా, వేశ్యలను కొనుక్కునే వారిని కస్టమర్లుగా గుర్తిస్తూ, ఆ విధంగా సెక్స్ పరిశ్రమ మొత్తాన్ని ఆర్థిక రంగంగా గుర్తింపునివ్వడం ద్వారా ప్రభుత్వాలు మహిళలకు గౌరవనీయమైన, భద్రమైన ఉపాధిని కల్పించాల్సిన బాధ్యతల నుండి పక్కకు పోవడానికి పథకమేస్తున్నాయి. అందువలన సెక్స్ పని కూడా ఇతర పనులలో భాగం అనే అభిప్రాయాన్ని సృష్టించటం ద్వారా ప్రభుత్వాలు మరింతగా మహిళలను సెక్స్ వ్యాపారంలోకి నెడుతున్నారు.

వ్యభిచారాన్ని చట్టబద్ధం చేయటం అనేది పరిష్కారం కానే కాదు. ఎందుకంటే అది కస్టమర్లుగా పురుషులకు స్వయం హక్కును కల్పిస్తుంది. ఏదైనా సాధారణ పని ద్వారా అందించేసేవారి సేవలు హింసతోనూ, అవమానంతోనూ కూడి వుండవు. వ్యభిచారాన్ని మామూలు వృత్తిగా చట్టబద్ధం చేయటం అంటే పురుషులు సృష్టించిన శ్రమవిభజనను ఆమోదింపజేయటమే అవుతుంది. ఈ శ్రమ విభజనలో పురుషులతో పోలిస్తే స్త్రీలకు వాస్తవంగా లభ్యమయ్యే వృత్తిపర అవకాశాలు చాలా తక్కువగా వుంటాయి. చట్టబద్ధత కల్పించటం వల్ల వ్యభిచారంతో స్త్రీలు ఎదుర్కొంటున్న హానికర ప్రభావాలు తొలగింపబడవు. ఈ వ్యభిచార చట్టబద్ధత వల్ల భౌతిక హింసతో పాటుగా, చట్టం కల్పించే నూతన అవకాశాలతో వెల్లువలాగా దూసుకొచ్చే సరికొత్త పురుషుల భారీ దాడి నుండి తమను తాము రక్షించుకోవడం స్త్రీల పైనే పడుతుంది. చట్టబద్ధత అంటే వ్యభిచారాన్ని కొనసాగించడానికి, అమలు చేయడానికి రాజ్యం గావించే క్రమబద్ధీకరణ స్థితే. వ్యభిచారం చట్టబద్ధమయినాక స్త్రీలు తాము చేసే వ్యభిచార వృత్తికి గాను పన్నులు కట్టాల్సి వుంటుంది కాబట్టి అందుకవసరమైన డబ్బును సంపాదించాలంటే వేశ్యలు మరింత ఎక్కువ మంది కస్టమర్లకు ఊడిగం చేయాల్సి వుంటుంది. వ్యభిచార చట్టబద్ధత అంటే మరింతమంది పురుషులు కస్టమర్లవటం, మరింతగా మహిళలు వేశ్యలుగా మారాల్సి వుండటం, మరింతమంది మహిళలు ప్రత్యేకించి దారిద్ర్య స్థితిలో వున్న మహిళలు వ్యభిచారంలోకి బలవంతంగా నెట్టబడటమే తప్ప మరొక అర్థం దానికి లేదు.

చట్టబద్ధ వ్యభిచారం దోపిడీకి అవకాశాలను మరింతగా పెంచుతుందంతే. వ్యభిచారాన్ని చట్టబద్ధం గావించిన దేశాలలో వ్యభిచార వ్యాపారం మరింతగా జోరందుకుందని, లైంగిక పీడన కూడా పెరిగిందని ఆయా దేశాల అనుభవాలు సూచిస్తున్నాయి. ఉదా॥కు వ్యభిచారాన్ని చట్టబద్ధం చేసిన ఆస్ట్రేలియాలో, అమెరికాలో కొన్ని రాష్ట్రాలలో చట్టబద్ధ వ్యాపారంతో పాటు చట్ట విరుద్ధ వ్యభిచార గృహాలు కూడా ప్రమాదకర స్థాయిలో పెరిగి పోయాయని కనుగొన్నారు.

పురుషులలో స్త్రీ విద్వేష, స్త్రీ వ్యతిరేకమైన విశ్వాసాలను, వైఖరులను పెంచి పోషించటం ద్వారా వాణిజ్య పరమైన లైంగిక దోపిడి మహిళల, ఆడపిల్లల జీవితాలను హీనపరుస్తుంది. మహిళల శరీరాలు కొనుక్కుని, ఉపయోగించుకుని, అవతల పడేసే లైంగిక వ్యాపార వస్తువులుగా అది పురుషులకు బోధిస్తుంది. దీని ఫలితంగా లైంగిక దోపిడీ సమాజంలోని అన్ని రంగాలలోనూ లింగ అసమానత్వాన్ని తీవ్ర స్థాయికి తీసుకుపోతుంది. గృహ జీవితంలోనూ, పనిస్థలంలోనూ స్త్రీలకు వ్యతిరేకంగా లైంగిక హింసా చర్యలకు, వేధింపుకు ఇది దారితీస్తుంది. మార్కెట్లో కొనబడే అమ్మబడే లైంగిక సరకులుగా మానవ శరీరాల విలువను హీనపర్చి ప్రపంచమంతటా మహిళల, బాలికల మానవ హక్కులను అది త్రోసి పుచ్చుతుంది. చట్టబద్ధత అనేది వేశ్యల హక్కులకు హామీ పడుతుందని, సంరక్షణాయుతమైన సెక్స్ కార్యకలాపాలకు వీలు కల్పిస్తుందని జరుగుతున్న ప్రచారమంతా ఊకదంపుడు భ్రమే తప్ప మరేమీ కాదు. ఈ రకమైన ప్రచారం లైంగిక దోపిడీలోని పరంపరాయుతమైన అధికార, దాష్టిక కోణాలను విస్మరిస్తోంది. ఎందుకంటే ఒకసారి వ్యభిచారం చట్టబద్ధమై పోయాక ఈ రంగంలోని మహిళలకు గాని, బాలికలకు గాని కస్టమర్ల డిమాండ్‌ని తీర్చవలసి రావటమే తప్ప కనీసం భద్రతాపరంగా అయినా కండోమ్‌ని వాడాల్సిందిగా కస్టమర్లను డిమాండు చేసే స్థితి వుండదు. కండోమ్ వాడాల్సిందే అని స్త్రీలు రెట్టించినా అది మరింత హింసకే దారితీస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా వేశ్యా హక్కుల రక్షకులుగా చలామణీ అవుతూ ముందుకొస్తున్నవారు వాదిస్తున్నట్లుగా వ్యభిచారంలోకి 'ఇష్టపూర్వకంగా' దిగిన మహిళలకు, నిర్బంధంగా వ్యభిచారంలోకి దింపబడిన మహిళలకు మధ్య వ్యత్యాసాన్ని చూడటం అనే విషయంలోకి వస్తే ఇది ఆచరణలో నిష్ఫలమే అవుతుంది. ఎందుకంటే బలవంతంగా వ్యభిచారంలోకి దింపబడిన మహిళల కేసుల గురించి రుజువు చేయటం చాలా కష్టం. మహిళల అక్రమ రవాణాకి పాల్పడుతున్నవారు సెక్స్ (ట్రాఫికర్స్), వ్యభిచార గృహాల నిర్వాహకులు నిర్బంధ సెక్స్‌కి సంబంధించిన సాక్ష్యాలను సులువుగా మరుగున పెట్టగలగడమే కాదు, తాము ఇష్టపూర్వకంగానే వేశ్యావృత్తిలో వుంటున్నట్లుగా వేశ్యల నుండి సాక్ష్యం కూడా సృష్టించగలరు.

వేశ్యలకు, మహిళల అక్రమ రవాణాకి సంబంధించిన సమస్యను ఎదుర్కొనడానికి 1949లోనే రెండు ముఖ్యమైన అంతర్జాతీయ మానవ హక్కుల ఒప్పందాలు కూడా జరిగాయి. అవి వ్యక్తుల అక్రమ రవాణా,

మరియు వేశ్యల, ఇతరుల దోపిడీపై ఒడంబడిక; స్త్రీలకు వ్యతిరేకమైన సకల వివక్షతా రూపాల నిర్మూలనా ఒడంబడిక. అయితే మహిళల తార్పుడుగాళ్ళు, సమకూర్చేవాళ్ళు, అక్రమ రవాణాదార్లకు వ్యతిరేకంగా ఈ రెండు అంతర్జాతీయ ఒడంబడికలలో కొండవీటి చాంతాడంత పొడవు నిబంధనలు పొందుపర్చినా వీటిని అమలు చేసే యంత్రాంగాలే లేకపోగా ఇప్పటికీ పలు దేశాలు ఈ ఒడంబడికలను ఆమోదించటం లేదు. ఇంతకుముందే చెప్పినట్లుగా లైంగి పరిశ్రమ మేనేజర్ల అధికార బలం ముందు, లైంగిక వేధింపులకు గురైన మహిళల, బాలికల సాక్ష్యాలు నిలవవు. సాక్ష్యాలు సేకరించటమూ అసాధ్యమే.

పైగా ఇప్పుడీ రెండు అంతర్జాతీయ ఒడంబడికలను పొయ్యిలో పారేస్తూ అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.యల్.ఒ) వివాదాస్పదమయిన తన 1998 నాటి రిపోర్టులో వేశ్యా వృత్తిని చట్టబద్ధమైన పనిగా నిర్వచిస్తూ దానికి ఆర్థికపరమైన గుర్తింపు నివ్వాలని ప్రపంచానికి పిలుపిచ్చింది.

చట్టబద్ధ వ్యభిచారం గురించిన సకల వాదనలను మనం తోసి పుచ్చాలి. డబ్బు తీసుకుని పురుషుల లైంగిక తృప్తిని తీర్చడానికి లైంగిక వ్యాపారంలోకి దిగటాన్ని, స్త్రీలు తమ శరీరాలను అమ్ముకోడాన్ని ఆర్థిక పరిభాషలో పనిగా 'శ్రమ'గా నిర్వచిస్తున్న సకల నిర్ధారణలను మనం నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. తెలుగులో కూడా ఇటీవల కాలంలో కొందరు ఫెమినిస్టులు, వేశ్యల బాధలకు కరిగిపోయే 'దయామయులు వేశ్యల బాధలను తమవిగా చేసుకుని వారిపై రాజ్య వ్యవస్థ దాడులను, హింసలను తమకు తాముగా ఫీలవుతూ, కనీసం పోలీసుల హింసా, దోపిడీల బారి నుండి వేశ్యలను బయటపడేయటానికైనా తక్షణం వేశ్యావృత్తిని చట్టబద్ధం చేయాల్సి వుందంటూ శోక రచనలు చేశారు. దోపిడీ రాజ్య యంత్రాంగంలో భాగంగా పోలీస్ వ్యవస్థను చూసే వారికెవరికైనా ఈ వాదనలు పరమ హాస్యాస్పదంగానే కనబడతాయి. కుటుంబంలోని స్త్రీలను, కుటుంబం బయటి స్త్రీలను (ప్రత్యేకించి వేశ్యలను) దోపిడీ చేయటం వర్గ సమాజపు పితృస్వామిక నీతిగా గుర్తించని వాదనలే ఇవి. చట్టబద్ధ కార్యకలాపాలకు రాజ్య వ్యవస్థ ఇచ్చే విలువ మీద అపరిమిత విశ్వాసముంటే తప్ప ఇలాంటి వాదనలు బయలుదేరవు. వర్గ దోపిడీకి, వ్యభిచారానికి మధ్య అవినాభావ సంబంధం వర్గ దోపిడీ అంతంతో గానీ తెగిపోదు అనే వాస్తవాన్ని గ్రహించకుండా ఈ రకమైన 'కరుణామయుల' విలాపాలు వేశ్యావృత్తి దోపిడీని పరిష్కరించలేవు.

సామ్రాజ్యవాదులూ, వాళ్ళు బరిలో దింపుతున్న ప్రభుత్వేతర సంస్థలు, వ్యక్తులు, మూడో ప్రపంచ దేశాల ప్రభుత్వాలు కలసి కట్టుగా లైంగిక వ్యాపారాన్ని చట్టబద్ధం చేయటంపై విస్తృత ప్రచారానికి లంకించుకున్నాయి. వ్యభిచార వ్యవస్థలను, కేంద్రాలను నిలిపి వుంచి తద్వారా మహిళలను సరకులుగా చేయటంలో సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు ఊడిగం చేయడానికే ఇలా జరుగుతోంది.

మహిళలపై సాగుతున్న హింసే వ్యభిచారం. మహిళల ఆత్మగౌరవానికి అదొక అవమానం. అది మహిళల ప్రాథమిక మానవ హక్కుల ఉల్లంఘన. మహిళలపై హింసను, లైంగిక పీడనను 'శ్రమ'గా పిలవడం అంటే నేరమే తప్ప మరేమీ కాదు. ఇతరుల లైంగిక కాంక్షలను తీర్చేందుకు స్త్రీలు తమ శరీరాలను అమ్ముకోవటాన్ని పనిగా పిలవటం నేరమే.

మహిళలకు, బాలికలకు గౌరవప్రదమైన, భద్రమైన ఉపాధిని కల్పించే బాధ్యత నుండి తప్పుకుంటూ చట్టబద్ధ వ్యభిచారం పేరిట వారిని లైంగిక వ్యాపారంలోకి నెడుతున్న ప్రభుత్వాలకూ ఈ నేరంలో భాగముంది.

వ్యభిచారాన్ని, మహిళల, బాలికల అక్రమ రవాణాని రద్దు చేయాల్సిందిగా కోరటం, సెక్స్ వ్యాపారంలో మునిగి వున్న మహిళలకు లాభదాయకమైన ఉపాధిని కల్పించమని కోరటం ఈ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తునన్న వారిని మహిళలపై ఎలాంటి వివక్షతమైనా పాటించే వారిని శిక్షించమని కోరటం – ఇవీ మన డిమాండ్లు.

కొనసాగుతూ వస్తూన్న ఒకానొక అమానుష కాండకు చట్టబద్ధత కల్పించటం ద్వారా ప్రపంచబ్యాంకు, ప్రభుత్వాలూ, స్వచ్ఛంద సంస్థలూ, వ్యభిచారానికి ఆధునిక రూపం ఇచ్చి కొనసాగింప జూస్తున్నాయి. వ్యభిచార మహిళల హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్పే ఈ 'నానా జాతి' ఛాంపియన్లు ప్రపంచీకరణ అమలు చేస్తున్న మహిళల అంతర్జాతీయ సెక్స్ రవాణాను అరికట్టకుండా 'చట్టబద్ధ వ్యభిచారం' మహిళలనెలా విముక్తి చేస్తుందో చెప్పడానికి ముఖం చాటేస్తున్నారు. లేదా సమయానుకూలంగా దాటేస్తున్నారు. 'చట్టబద్ధ వ్యభిచారపు' లక్ష్యం వ్యభిచారాన్ని ప్రపంచం (లేక పెట్టుబడిదారీ ప్రపంచం) అంతమయ్యే దాకా కొనసాగించటమే. అంతకుమించిన ఔన్నత్యాన్ని ప్రపంచబ్యాంకూ, ప్రపంచీకరణా ప్రదర్శించ లేవు కూడా.

## వస్తు వ్యామోహ సంస్కృతిలో మహిళల ఉనికి, గుర్తింపు

సంస్కృతి పరంగా జరుగుతున్న ప్రపంచీకరణ అనేది పాశ్చాత్య తరహా వినిమయాన్ని, జీవన విధానాన్ని ప్రోత్సహించటమే కాదు, వివక్షా పూరితమైన, పీడనతో కూడిన, పురుష స్వభావంతో కూడిన మహిళా ప్రతిరూపాన్ని ముందుకు తీసుకు వస్తోంది. ఈ తరహా వినిమయ సంస్కృతిలో ప్రజా బాహుళ్యా వినియోగానికి ఉపయోగపడే కేవల సరకుల స్థాయికి స్త్రీలు కుదింపబడ్డారు.

అనేక మూడో ప్రపంచ దేశాల సమాజాలలోని స్త్రీలు రెండు ప్రపంచాలకు చెందిన హేయమైన సంస్కృతిని వారసత్వంగా పొందుతున్నారు. కుటుంబంలోని పురుషాధిపత్యానికి లోబడే వస్తువుగా, భర్త ఆస్థిగా వుండే సాంప్రదాయక భూస్వామ్య సమాజ భావనలో వుంటూ వస్తున్న మహిళ స్థితి ఈరోజు వినియోగదారీ సమాజంలో వ్యాపార దోపిడీకి గురవుతూ మరింతగా దిగజారి పోయింది.

ఆధునిక మహిళను సెక్స్ బొమ్మగా చూసే ఈ దృక్పథం మానవ చరిత్రలో మునుపెన్నడూ లేదు. ఎందుకంటే మన యుగంలో, మన కాలంలో మాత్రమే మాస్ మీడియా, టెక్నాలజీలను అమ్ముల పొదిగా చేసుకుని మహిళను సరుకుగా తీర్చి దిద్దటం పరాకాష్టకు చేరుకుంటోంది. ఈ విధానం మొత్తం మార్కెట్ ఆర్థిక వ్యవస్థతో అనుసంధింపబడింది. ఇక్కడ స్త్రీలు వుత్పత్తులను అమ్మే సెక్స్ వస్తువులుగా మాత్రమే ఉపయోగింప బడుతున్నారు. బోలు తప్ప ఆత్మ లేని ఆకర్షణీయపు బొమ్మలుగా, సెక్స్

వస్తువులుగా, చురుకుదనం లేని మందమతులుగా, దాదాపుగా అన్నివేళలా పురుషుల ఆమోదానికి పరితపించే వారిలాగా, అంతిమంగా ఇంట్లోనూ వంటగదిలోనే వుండటంతోనే తృప్తిపడిపోయే వారిలాగా ఆధునిక మహిళలు వ్యాపార ప్రకటనలలో పదే పదే చూపించబడుతుంటారు. 70 సం॥ల క్రితం 'ఆత్మలేని' ఆధునిక స్త్రీల గురించి చలం వర్ణించిన తీరుకు వీళ్ళు నేటి ప్రతిరూపాలు.

లైంగికత్వానికి, బాహ్య సౌందర్యానికి సంబంధించి స్త్రీలు ఇక్కడే అత్యంత దోపిడీకి గురవుతున్నారు. సినిమా తెరలపై, బిల్‌బోర్డులపై, బస్టాపులపై, పత్రికలలో, కేలండర్లలో తళుక్కుమని మెరిసే ప్రకటనలు, స్త్రీల ముఖచిత్రాలు ఈ బాహ్య సౌందర్య దోపిడీని గొప్పగా నిరూపిస్తుంటాయి. మగవారి కాంక్షాపూరిత నేత్రాలకు కనువిందు కల్గించేలా క్యాలండర్లపైనా, సిగరెట్లపైనా, మద్యంపైనా, పెయింట్ల మీద, చివరకు ట్రాక్టర్లు, మిషనరీ మీద సైతం అర్ధనగ్న చిత్రాలతో ఒక వస్తువుగా స్త్రీల శరీరాన్ని వ్యాపారీకరించారు. వినియోగదారీ సమాజంలో స్త్రీలు ఎలా సృష్టింపబడుతున్నారో, దిగజార్చబడుతున్నారో చాటిచెప్పే వికృతమైన ప్రతిరూపాలలో మాస్ మీడియా మహిళలను చిత్రిస్తూంది.

అన్నింటికంటే మించి వస్తు వ్యామోహ సంస్కృతి మహిళల వునికిని, గుర్తింపును వారి శరీరాల, ముఖ సౌందర్యాల పరిమితులకు కుదించి సృష్టించింది. ఇది మరో వైపున మహిళలను తమ గురించి తాము అంచనా వేసుకోవడంలోనూ, ఇతరులు తమ గురించి ఏమనుకుంటున్నారని అంచనా వేసుకోవటంలోనూ ప్రతికూల కోణంలో దోహదపడుతోంది. బ్యూటీ మేగజైన్లలోనూ, లేక అందమైన యాడ్స్‌లలోనూ, మహిళా ఉత్పత్తుల్లోనూ ప్రదర్శించే 'నిసర్గ సుందర మహిళల'నే ఈరోజు 'నిజమైన మహిళలు'గా, 'స్త్రీత్వా'నికి ప్రతీకలుగా మానవ సమాజం తన హృదయంలోనూ, మనస్సులోనూ నమ్మడం, మొదలైంది. మునుపెన్నడూ లేని ఈ ప్రమాణం నిజమైన మహిళ (రియల్ విమెన్) అంటే జగదేక సుందరిగా, పరమ ఆకర్షణీయ మూర్తిగా నిర్వచిస్తోంది. ముఖం మీది మొటిమలను పోగొట్టుకునేందుకు తపన పడుతున్న ఆధునిక యువతుల కాస్మోటిక్ సంస్కృతి నేడు ఎల్లెడలా పేరుకుపోయింది. ముఖ సౌందర్య రక్షణే మహిళల జీవితాలకు సంబంధించి పరమ వాస్తవాంశంగా ఈరోజు ప్రసార, ప్రచార సాధనాల్లో ప్రదర్శిస్తున్నారు.

విషాదకరమైనది ఏమంటే ఈ 'పరమ వాస్తవాంశాన్ని' సాధించే క్రమంలో పురుషులను తమవైపుకు ఆకర్షితులను చేసుకోవడానికి, ఈ రకం జీవిత లక్ష్యసాధనతో సంతృప్తి చెందడానికి నేటి యువతులు పరస్పరం పోటీ పడుతున్నారు. పురుషులను తమ వైపుకు తిప్పుకోవడానికి లేక తామే పురుషుల చుట్టూ గిర్రున తిరగడానికి (వర్ల్‌పూల్ ఫ్రిజ్‌పై టీ.వీ. యాడ్‌లో మాదిరి) సంబంధించిన ఈ నూతన విష వలయంలో చిక్కుకున్న క్రమంలో మహిళలు తమ ఆత్మ విశ్వాసాన్ని తమ నిజమైన విలువను కోల్పోతున్నారు. ఈ రకంగా వినియోగదారీ సంస్కృతి స్త్రీల వ్యక్తిత్వాన్ని, మూర్తిమత్వాన్ని ఏమార్చి, తిమ్మిని బొమ్మిని చేసి వక్రీకరిస్తోంది. వారి ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీసి మహిళలను సామూహికంగానే బాధితులుగా తయారు చేస్తోంది. ఇలా సామ్రాజ్యవాద సంస్కృతి సాధికారత మాటేమోగాని మహిళల ఉనికిని, విలువను సైతం వ్యాపారీకరిస్తూ హీనపరుస్తోంది.

### పనిస్థలంలో మహిళలపై దోపిడీ:

సెక్స్ టూరిజం వస్తు వ్యామోహ సంస్కృతి ఆధునిక సమాజంలో మహిళల నమూనాను, విలువను పల్చబారుస్తుండగా గుత్త సంస్థల ఉత్పత్తులు, పనిస్థలంలో స్థితిగతులు ప్రపంచవ్యాప్తంగా మహిళల జీవితాలలో పెనుమార్పులు తీసుకొస్తున్నాయి. లాభార్జన ధ్యేయంగా గుత్త సంస్థల ఉత్పత్తులు అవి జీవిత విధానంలో తెస్తున్న మార్పులు మొత్తం కుటుంబ జీవితంపైనే చెడు ప్రభావం చూపుతుండగా మహిళలపై మరింత భారం పడుతోంది. వీటికి పని స్థలంలో దోపిడీ తోడవుతోంది. పని స్థలంలోనూ, జీవిత స్థలంలోనూ (కుటుంబం) ఏర్పడుతున్న నూతన పరిస్థితులు అందరి కంటే మించి మహిళలపై పెనుభారం మోపుతున్నాయి.

ఇటీవలి సం॥లలో సామ్రాజ్యవాద గుత్త సంస్థలు తమ ఉత్పత్తి సంస్థలను, పరిశ్రమలను కొన్నింటిని మూడో ప్రపంచ దేశాల్లో నెలకొల్పాయి. శ్రమ, ప్రయాసకోర్చే శ్రమశక్తి ఇక్కడ సమృద్ధిగా, కారుచౌకగా లభించడం, విధేయులై అణిగిమణిగి వుండి పనిచేసే కార్మికులు లభించడమే ఇందుకు కారణం. మహిళా కార్మికులను దృష్టిలో పెట్టుకునే పాశ్చాత్య సంస్థలు ఈ మార్పుకు సిద్ధమై పోయాయి. ఈ రకంగా తరలి వచ్చిన విదేశీ పరిశ్రమల్లో, ఎగుమతి జోన్లలో మహిళా కార్మికులే ఎక్కువగా నియమింపబడుతున్నారు. ఈ పరిశ్రమల్లో స్వల్ప వేతనాలు, హీనమైన పని పరిస్థితులు, అస్థిర వుపాధి, ఉపాధి సౌకర్యాల లేమి, మహిళా కార్మికులు యూనియన్లు పెట్టుకోకుండా, నష్టపరిహారం పొందకుండా చేస్తున్న అణచివేత చట్టాలు మహిళలకు మూకుమ్మడిగా వ్యతిరేక పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ప్రత్యేకించి వాణిజ్య తోటల పరిశ్రమల్లో మహిళలు ద్వంద్వ అణచివేత, దోపిడీల బారిన పడుతున్నారు. తేయాకు, రబ్బరు, ఆయిల్‌పామ్ తోటల్లో కూలీలుగా, కార్మికులుగా పనిచేస్తున్న మహిళలు ఇంట్లో తమ భర్తల భారాన్ని పశువుల్లా భరిస్తున్నారు. వ్యాపార తోటల (ప్లాంటేషన్) సమాజం క్షయ రోగంతో బక్కచిక్కిపోయిన సమాజానికి ప్రతీక. ఇక్కడి కార్మికులకు తమ జీవితాలను ప్రభావితం చేస్తున్న నిర్ణయాలపై ఎలాంటి అదుపు, ఆజమాయిషీ లేకుండా పోయాయి. బహుశా ఇది నూతన పెట్టుబడిదారీ ప్రపంచంలో వలస విస్తరణ కాలపు తొలిదశలోని బానిసల శ్రమతో సాగిన తోటల పరిశ్రమ కంటే కాస్త మెరుగ్గా వుండొచ్చంతే.

మహిళా కార్మికులపై సాగుతున్న దోపిడీ రూపాల్లోకెల్లా అత్యంత తీవ్రమైనది పనిస్థలంలో వారు ఎదుర్కొంటున్న ఆపదలు, ప్రమాదాలే. ఈ ప్రమాదాలు వారి ఆరోగ్యాన్నే కాదు, ఒక వేళ వారు గర్భవతులై వుంటే వారికి పుట్టబోయే పిల్లల ఆరోగ్యాలను కూడా దెబ్బతీస్తున్నాయి. స్త్రీ పురుషులిరువురూ పనిస్థలంలో ప్రమాదాల బారిన పడుతున్నప్పటికీ, ఫ్యాక్టరీల్లో, ఇంట్లో ద్వంద్వ పనిభారం వల్ల మహిళలు మరింతగా దెబ్బతింటున్నారు. సహజంగా చాలామంది మహిళా కార్మికుల బడలికకు, శారీరక ఒత్తిడికి వారానికి 8 గంటల పనే కారణం. అంటే వారానికి 40 గంటల పనికి, 40 గంటలు ఇంటి పనికి వెచ్చిస్తున్న మహిళా కార్మికులపై రోజులో 24 గంటలూ, తమ కుటుంబాలకు సేవ చేసే భారం కూడా పడుతోంది.

ప్రపంచ వ్యాప్తంగా మహిళా కార్మికులు మానసికంగా, శారీరకంగా, జీవపరంగా, రసాయనికపరంగా 4 రకాల పని బడలికకు, అలసటకు గురవుతున్నారు. వీటిలో అత్యంత ప్రధానమైన పని బడలిక ఏదంటే పనిలో

సంతృప్తి లేకపోవటం వల్ల వస్తున్న వృత్తిపరమైన బడలికే. వివిధ వృత్తుల్లోని మెజారిటీ మహిళలు స్వల్ప వేతనాలు పొందటమే గాక తమపై ప్రభావితం చేస్తున్న నిర్ణయాలపై ఎలాంటి ఆజమాయిషీని కల్గి లేరు. షిఫ్ట్ పద్ధతి పని, హీనమైన పని పరిస్థితులు వీటికి తోడై స్త్రీలను మానసికంగా దుర్బలులను చేస్తున్నాయి. ఉదా॥ మలేషియాలో ఫ్యాక్టరీలలో పనిచేసే మహిలలు సామూహికంగా హిస్టీరియా బారిన పడుతున్నారని ఆ దేశంలో మహిళా కార్మికులపై సాగిన అధ్యయనాలు తెల్పుతున్నాయి. ఇక శబ్ద కాలుష్యం, అధిక ఉష్ణోగ్రత, వెలుతురు, గాలి లేమి, మానసిక అఘాతాలు వంటివి మహిళా కార్మికులను శారీరక బడలికకు, నిస్త్రాణకు గురి చేస్తుంటే పరిశ్రమలలో బ్యాక్టీరియాలు, వైరస్‌లు, ఫంగస్‌లు, అంటురోగాలు సోకుతుండటమనేది జీవపరంగా బడలికకు గురిచేస్తున్నాయి. ఇకపోతే రసాయనికపరమైన బడలికలు స్త్రీలకు సర్వ సాధారణమై పోయాయి. విస్తృత స్థాయిలో పారిశ్రామిక ద్రావకాలు, మత్తుమందు వాయువులు, భారీ లోహాలు, రంగులు (డైలు) సిరాలు, పాంపులు, డిటర్జెంటులు, క్రిమి సంహారక మందులు, రేడియో ధార్మిక పదార్థాలు వంటివి రసాయనిక బడలికలకు గురి చేస్తున్నాయి. ఇంట్లో, ఫ్యాక్టరీలలో, పొలాల్లో, ఆస్పత్రులలో, షాపుల్లో మహిళా కార్మికులుగా, టైపిస్టులుగా, వ్యవసాయ కార్మికులుగా, నర్సులుగా, టీచర్లుగా, శిరోజాలంకరణ నిపుణులుగా ఇలా రకరకాల వృత్తుల్లో పనిచేస్తున్న వారందరికీ ఈ రకం రసాయన బడలికలు సహజమై పోయాయి. పెట్టుబడిదారీ పారిశ్రామిక సంస్కృతిలో భాగంగా వస్తున్న ఈ పరిణామాల పట్ల స్త్రీలకు ఎలాంటి నిర్ణయాధికారం లేకపోవటం అనేది మహిళా సాధికారత బూటకత్వానికి అద్దం పడుతున్నది.

### టి.యన్.సి. ఉత్పత్తులు - స్త్రీల ఆరోగ్యం, ఆహారం, అభిరుచులలో పెనుమార్పులు

మానవజాతికి అత్యంత ప్రాథమికమైన వినియోగ అవసరాల్లో అతి ముఖ్యమైంది ఆరోగ్యం. బహుశా ప్రాణం తర్వాత మానవ జాతికి అత్యంత విలువైన సంపద ఆరోగ్యమే అనడంలో అతిశయోక్తి లేదు.మంచి ఆరోగ్యం ప్రత్యేకించి స్త్రీలకు ఇంకా ముఖ్యమైనట్టిది ఎందుకంటే ఆరోగ్య లేమి పరి పరి విధాలుగా స్త్రీలను దెబ్బతీస్తుంది. తల్లులుగా తమ పిల్లల, కుటుంబాల ఆరోగ్యం పట్ల బాధ్యత వహిస్తూ, ఇంట్లో, బయటా కార్మికులుగా వుంటూ, మహిళలు జంట భారాన్ని మోస్తున్నారు. ఫలితంగా వారు అధిక పని భారంతో, హీనమైన పని పరిస్థితుల బారిన పడుతూ అధిక పని ఒత్తిడి, మానసిక వత్తిళ్ళకు గురవుతున్నారు కాబట్టి మహిళలు పురుషులకంటే మిన్నగా ఆరోగ్య వ్యవస్థపై ఆధారపడుతున్నారు. తమ బహుముఖ పాత్రల కారణంగా మహిళలే ఆరోగ్య రంగంలో ప్రధాన వినియోగదారులుగా వుంటున్నారు.

కాని టి.ఎన్.టి.సి.ల లాభం పునాదిగా కల్గిన పలు ఆరోగ్య వుత్పత్తులు మహిళలకు ప్రమాదకారులుగా తయారై వ్యాధులపాలు చేస్తూ కొన్ని సందర్భాలలో చావులను సైతం కొనితెస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలలో నిషేధింపబడిన మందులను సైతం మూడో ప్రపంచ దేశాలలోని మార్కెట్లలో నిరాఘాటంగా వదులుతున్నారు. గుత్త సంస్థల ఉత్పత్తులకు, మందులకు మూడో ప్రపంచ దేశాలు సులువైన డంపింగ్ కేంద్రాలుగా మారిపోతున్నాయి. ఈ ఉత్పత్తులలో చాలా భాగం పాశ్చాత్య దేశాల్లోని భద్రతా ప్రమాణాల స్థాయినందుకోలేక నిషేధాలకు గురవుతుండగా మూడో ప్రపంచ దేశాల మహిళలు ఈ నాసిరకం ఔషద ఉత్పత్తుల ప్రయోగాల బారిన పడి గినియాపందుల్లాగా బలైపోతున్నారు. డెపో ప్రొవెరా, డాల్కన్ షీల్డ్, నార్ ప్లాంట్ వంటి ప్రమాదకరమైన నిషిద్ధ గర్భ నిరోధ వుత్పత్తులు సైతం ఇక్కడి మహిళలపై ప్రయోగింపబడుతున్నాయి.

ప్రమాదకరమైన గర్భ నిరోధక వుత్పత్తుల మార్కెటింగ్‌తో టి.ఎన్.సి.లు మూడో ప్రపంచ దేశాల ఆరోగ్యాన్ని దెబ్బతీయటమేగాక, ఈ సమాజాలు సాంప్రదాయిక ఆహార సంస్కృతిపైన కూడా దాడిచేస్తూ నూతన ఆహారాన్ని, నూతన అభిరుచులను ప్రవేశపెడుతున్నాయి. ఈ ఆహార పదార్థాలలో చాలా భాగం సొగసైన వినియోగ సరకులుగా టి.ఎన్.సి.ల ముద్రతో వచ్చిపడుతున్నాయి. దీని ఫలితంగా మూడో ప్రపంచ దేశాలన్నింటిలోనూ ఈరోజు ఆకర్షణీయమైన క్యాన్లు, బాటిల్స్‌లో ప్యాక్ చేసిన అతి ఖరీదైన బెవరేజిలు, డబ్బాలలో నింపబడ్డ ఆహార పదార్థాలు, ప్రాసెస్‌కి గురైన ఆహార పదార్థాలు, ఫాస్ట్‌ఫుడ్స్ వంటివి నగరాలలోని సూపర్ మార్కెట్లలోనే కాదు మారుమూల గ్రామాలలోని షాపులలో సైతం ప్రదర్శింపబడుతున్నాయి. నిజంగా విషాదకరమైనదేమంటే ఈ దేశాల్లోని మూడింట రెండొంతుల జనాభాకు ఇప్పటికే ప్రాథమిక జీవితావసరాలు సైతం నెరవేరడం లేదు. అయినప్పటికీ దారిద్ర్యం బారిన పడిన కుటుంబాలు సైతం టి.ఎన్.సి.ల అమ్మకాల ఎత్తుగడల మత్తులో పడి తమ కష్టార్జితాన్ని నిస్సారపు (జంక్) ఆహారం మీద, ఆహారోత్పత్తుల మీద ఖర్చు పెట్టేస్తున్నారు.

ఈ నూతన ఆహార వినియోగ సంస్కృతి ఎంతగా వెర్రి తలలు వేస్తున్నదంటే మంచినీళ్ళు కరవైన గ్రామాలలోని అంగళ్ళలో కోకాకోలాలు, పెప్సీలు అమ్మకానికి సిద్ధంగా వుంచబడుతున్నాయి. ఈ దేశాల్లో కొన్నిచోట్ల జాలర్లు సైతం డబ్బాలలో నిల్వ చేయబడిన చేపలను కొంటున్నట్లుగా రేడియో, టెలివిజన్లలో ఖరీదైన మేగజైన్లలో ప్రదర్శిస్తున్నారు. పూట గడవటానికి నానా యాతన పడే రైతాంగం తమ కుటుంబాదాయంలో మూడో వంతును సిగరెట్లమీద మత్తుపానీయాల మీదా తగలేస్తున్నది. కుటుంబానికి సరైన ఆహారాన్ని అందివ్వగల రైతాంగం కష్టార్జితంలోని ఈ ముఖ్యభాగం ఇలా పనికిరాని అలవాట్ల ద్వారా గుత్త సంస్థల పరమై దేశం నుండి తరలిపోతోంది. ఇక శీతల పానీయాలు, నిస్సారపు తిండ్లు (జంక్ ఫుడ్) పట్టణాలు గ్రామాలలో పండుగలు పబ్బాలప్పుడేకాక రోజువారీ జీవితంలో కూడా తప్పనిసరి అవసర వస్తువులై పోయాయి. పిజ్జాలు, ఆస్ట్రేలియన్ కుకీలు, మెక్‌డొనాల్డ్ ఎద్దుమాంసపు బర్గర్లు, కెంటకీ ఫ్రైడ్ చికెన్లు, ఎ అండ్ డబ్ల్యు రూట్ బీర్లు వంటి వాటితో తరలి వస్తున్న అమెరికన్ ఫాస్ట్‌ఫుడ్ సంస్కృతి మూడో ప్రపంచ దేశాలలో ఏరులై పారుతోంది. ఈ రకంగా విదేశీ నిస్సారపు ఆహార దాడి ప్రజల కనీస ఆదాయాలను కూడా కొల్లగొడుతూ అంతిమంగా మహిళల ఆహారాన్ని, ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తోంది.

గుత్త సంస్థల ఆహార సంస్కృతి ఏ స్థాయికి పోయిందంటే తల్లి పాలు నాగరికం, ఆధునికం కావనే ముద్ర వేస్తూ, బిడ్డకు తన పాలకంటే సీసా పాలే ముఖ్యంగా భావించేలా తల్లులను లోబర్చుకుంటూ వేల కోట్లు గడిస్తున్నాయి. విదేశీ పాల కంపెనీల దూకుడు అమ్మకాల ప్రచారం మారిన పడి మూడో ప్రపంచ దేశాల్లోని పలువురు పేద తల్లులు సైతం బిడ్డలకు సీసా పాలే పడుతున్నారు. పాల కంపెనీల వత్తిడివల్ల, వునికిలోని వినియోగ సంస్కృతి వల్ల మహిళలు తల్లిపాలపై విశ్వాసం కోల్పోతున్నారు. సీసా పాలు పట్టకపోతే తమ బిడ్డలకు ఉత్తమమైన దాన్ని తోసిపుచ్చుతున్నట్లుగా మహిళలే భావించే స్థితి ఈ దేశాల్లో వ్యాపిస్తూ తల్లి పాల సంస్కృతి క్షీణించి పోతోంది.

ఇకపోతే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పొగ తాగడం రానానూ తగ్గిపోతుండగా పాశ్చాత్య పొగాకు పరిశ్రమ తన కార్యకలాపాలను మూడో ప్రపంచ దేశాలకేసి మళ్ళించింది. పాశ్చాత్య ప్రభుత్వాల, పొగాకు కంపెనీల వత్తిడితో స్వేచ్ఛా వ్యాపారం పేరిట విదేశీ సరకుల దిగుమతులు వెనుకబడిన దేశాలలో వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా ఈ దేశాలన్నింటిలో స్త్రీలతో సహా పొగరాయుళ్ళ సంఖ్య పెరిగిపోతోంది. ఇది ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపడమే కాదు, సామాజికంగా దుష్పరిణామాలకు కూడా దారితీస్తోంది. ఒక రోజుకు ఒక సాధారణ కార్మికుడు లేక రైతు ఒక పాకెట్ చౌక రకం సిగరెట్లు కొనడం అంటే తమ ఆదాయాల్లో పావు భాగాన్ని తగలేస్తున్నట్లే లెక్క . కుటుంబానికి తగినంత తిండిలేకుంటే మహిళల వాటాలో తరుగుదల తప్పని మూడో ప్రపంచ దేశాల్లో గుత్త సంస్థలు పెంచి పోషిస్తున్న ఈ నూతన, నిస్సారపు, క్షీణ అలవాట్లు స్త్రీలను మరింత బలహీనులుగా, శారీరక దుర్బలులుగా మార్చేస్తున్నాయి. గుత్తసంస్థల దోపిడీ పోకుండా, ముంచుకొస్తున్న నూతన ఆహార అలవాట్లు అంతరించకుండా మహిళలు తమ జీవితాలపై సాధికారతను పొందడం అసాధ్యం

**స్త్రీలను పక్కన నెట్టేసిన 'అభివృద్ధి':**

వలస జోక్యంతో మొదలైన పాశ్చాత్య ప్రభావం, తదుపరి దశాబ్దాలుగా సాగిన పెట్టుబడిదారీ అభివృద్ధి అనేవి సాంప్రదాయిక స్వయంపోషక సమాజాలలో మహిళల ప్రతిపత్తి, పాత్రలపై తీవ్రమైన దుష్ప్రభావాలకు దారితీశాయి. ప్రధానంగా భూమిపై యాజమాన్యానికి సంబంధించి రంగంలోకి తేబడిన పాశ్చాత్య భావనలు మహిళలకు వ్యవసాయ హక్కులను, భూమిపై ఆజమాయిషీని వహించే హక్కుని లేకుండా హరించి వేశాయి. హరిత విప్లవంలో భాగంగా ప్రవేశపెట్టిన వ్యాపార పంటలు వ్యవసాయంలో మహిళల సాంప్రదాయిక పాత్రను హీనపర్చాయి. వ్యవసాయంలో ఎగుమతి పంటలు, నూతన టెక్నాలజీలు ప్రవేశపెట్టడం వల్ల స్త్రీల వునికి ఎక్కువగా వుండే ఆహార పంటల రంగం నిర్లక్ష్యానికి గురై మహిళల కష్టాలు పలు రకాలుగా పెరగటమే కాదు, సాంప్రదాయిక వ్యవసాయ కార్యకలాపాలలో మహిళల అవసరాన్ని తగ్గించేస్తున్నాయి. ఇది సాంప్రదాయిక గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోంచి మహిళలను పక్కకు నెట్టేయడమే కాక, మహిళలు సొంతకాళ్ళపై ఆధారపడి వుండటాన్ని క్షీణింపజేస్తోంది. గ్రామీణ మహిళలపై పెట్టుబడిదారీ వ్యవసాయ సంస్కృతి చూపుతూ వచ్చిన ఈ వివక్షత వల్ల సాంప్రదాయిక వ్యవసాయ రంగంలోంచి మహిళలు పెద్ద ఎత్తున తొలగించబడుతున్నారు. ఇంకా ఆనకట్టల నిర్మాణం, మైనింగ్ పనులు, రొయ్యల ప్రాజెక్టులు, పర్యాటక అభివృద్ధి వంటి అభివృద్ధి పథకాల కారణంగా మహిళలు కూలి పనుల కోసం పట్టణాలకు, నగరాలకు వలస వెళ్ళిపోతున్నారు. మరోవైపున వీరు పరిశ్రమలలో నిస్త్రాణ కల్గించే వత్తిడితో కూడిన పని పరిస్థితులకు గురవుతూ, లైంగిక వేధింపుకు, నగర సంస్కృతి దుష్ప్రభావాల బారిన పడుతున్నారు.

మహిళల సమస్య పరిష్కారం పేరిట ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ ఏజెన్సీలు గావించిన పలు ప్రయత్నాలు విఫలమైనాయని, గత మూడు దశాబ్దాలుగా వెనుకబడిన, వర్ధమానదేశాలలోని మహిళల స్థితిగతులు మరింతగా దిగజారి పోయాయని 1993లో యునెస్కో చేసిన ఓ అధ్యయనంలో బయటపడింది. ఈ నివేదికతో పెట్టుబడిదారీ వ్యవస్థ ముందుకు తెస్తున్న అభివృద్ధి ప్రక్రియ మొత్తంగా ప్రశ్నార్థకమై పోయింది; ఈ చేదు వాస్తవం కల్గించిన కనువిప్పు, చెలరేగిన విమర్శలే 1995 బీజింగ్ కాన్ఫరెన్సులో మరోసారి మహిళల సాధికారతను ఎజెండాలోకి తెచ్చేలా చేశాయి. అయితే దోపిడీ వ్యవస్థ మూలాన్ని మార్చకుండా ధ్వంసం చేయకుండా సాధికారత పేరిట ఎన్నికల ప్రక్రియలో స్త్రీలను భాగం చేయటం, కొన్ని స్థానాలలో వారిని ఎన్నుకోవటం వల్ల ఏమీ జరగదు. చివరకు దీంట్లో సైతం పాలకవర్గాలకు చిత్తశుద్ధి ఎంతగా కొరవడిందంటే గత మూడేళ్ళుగా చట్టసభల్లో మహిళలకు ముప్పై మూడున్నర శాతం ప్రాతినిధ్యం గురించిన బిల్లు చెత్తబుట్టలోనే నిద్రపోతోంది. చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ వంటి జిమ్మిక్కులతో ముందుకొస్తున్న మహిళా సాధికారతా బూటకత్వాన్ని విప్లవ ప్రజానీకం ఎండగట్టాలి. అన్నింటికీ మించి ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం లేకుండా నిజమైన సాధికారత అసాధ్యం. మహిళా సాధికారతను సాధించాలంటే గ్రామస్థాయి నుండి విప్లవం అవసరం. గ్రామస్థాయి నుండి విప్లవ కమిటీలలో భాగమవటం ద్వారా నిజమైన అర్థంలో స్త్రీలు సాధికారత సాధిస్తారు. ఇది మహిళా విముక్తిలో మొదటి మెట్టుగా వుంటుంది. ❑

## సాధికారత వాస్తవ ఫలితాలు

'ఐక్యరాజ్యసమితి మహిళల అభివృద్ధి నిధి' సంస్థ 2000 సం॥రంలో ప్రపంచ మహిళల పురోగతి అనే నివేదికను ప్రచురించింది. 1985 నుండి 1999 వరకు ప్రపంచ మహిళల పురోగతిని ఈ నివేదిక పరిశీలించింది. ప్రపంచీకరణ నేపథ్యంలో లింగ సమానత్వపు ఆర్థిక పరిణామాల మీద, మహిళల సాధికారత మీద ఇది దృష్టి సారించింది. పలు రకాల సూచికలను ఉపయోగిస్తూ, మహిళలు పురోగతిని అంచనా వేస్తూ జవాబుదారీతనం సమస్యను ఈ నివేదిక పరిశీలించింది. జాతీయ బడ్జెట్లతో సహా ప్రభుత్వ విధానాలూ, కార్యక్రమాలలో లింగ ప్రభావానికి సంబంధించి ప్రభుత్వాల జవాబుదారీతనం పైనా ఈ నివేదిక ప్రత్యేకంగా దృష్టి సారించింది. చివరగా పేద మహిళల పురోగతిని ప్రోత్సహించడానికి ప్రపంచీకరణ నూతన రూపం ధరించడానికి మార్గాల గురించి ఈ నివేదిక అన్వేషించింది.

స్థూలంగా ఈనివేదిక సాధికారత, ఆర్థిక వ్యవస్థ అనేవి మహిళల పురోగతిలో అంతర్భాగాలుగా నిర్ధారించింది. ప్రపంచమంతటా ఆర్థిక విధానాలకు సంబంధించి కొనసాగుతూ వస్తున్న సాంప్రదాయక వైఖరులు మహిళలు చేస్తున్న పనిని పట్టించుకోవటం మానేశాయని, ప్రత్యేకించి తమ కుటుంబాలకు, కమ్యూనిటీలకు మహిళలు చేసుకుంటున్న వేతనం చెల్లింపబడని సంరక్షణ పనులను ఈ సాంప్రదాయిక వైఖరి వదిలిపెట్టేసిందని ఈ నివేదిక భావించింది. కుటుంబంలోని వేతన చెల్లింపబడని మహిళల సంరక్షణ పని, స్వచ్ఛంద పని, తరుచుగా చిన్న చిన్న వర్క్‌షాప్‌లలో, వీధుల్లో పెద్దగా దృష్టికి రాని 'జీతం చెల్లించబడే పని', సబ్ కాంట్రాక్టు ప్రాతిపదికన జరిగే గృహాధారిత పని... ఇలా వీటన్నింటినీ కలుపుకుని ఆర్థిక వ్యవస్థలు ఎలా పని చేస్తాయనే అంశానికి సంబంధించి మరింత సమగ్ర దృక్పథం అవసరమని భావించింది. ఈ నివేదిక స్త్రీల అనుభవాల నుంచి ఆర్థిక వ్యవస్థలను పరిశీలించటం వల్ల ఆర్థిక

సంస్కరణల విశ్లేషణను నూతన రీతుల్లో సాగించవచ్చని ఈ నివేదిక పేర్కొంది. ఈ నివేదికలోని ముఖ్య అంశాలను ప్రాధాన్యత పరంగా చూస్తూ విశ్లేషిద్దాం.

* ప్రపంచీకరణ పరిపరి విధాలుగా స్త్రీల అనుభవాల్లోకి వచ్చింది. నిరుపేద, మహిళలకు సంబంధించి వునికిలో వుంటున్న కొన్ని అసమానతలను, అభద్రతలను ప్రపంచీకరణ ఇంకా విస్తృత పర్చింది. అయితే విద్యావంత, వృత్తిపర మహిళలకు సంబంధించి ఇది మరిన్ని నూతన అవకాశాలను కల్పించింది. 1990లలో ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో చెలరేగిన ఆర్థిక సంక్షోభాలు ప్రపంచీకరణ దుష్ఫలితాలే. ఈ సంక్షోభాల్లో ఇతర సామాజిక భద్రతా చట్రాలన్నీ విఫలమైన సందర్భాలలో తమ కుటుంబాలకు అంతిమంగా సామాజిక భద్రతా చట్రాన్ని మహిళలే అందించగలిగారు.

* 1990ల పొడవునా ఐక్యరాజ్యసమితి మానవహక్కుల అంశాలు, అంతర్జాతీయ కార్మిక సంస్థ వేదికలు, పలు ఐక్యరాజ్యసమితి కాన్ఫరెన్సుల ద్వారా వివిధ దేశాల ప్రభుత్వాలు మహిళల పురోగతికి సంబంధించి పలు లక్ష్యాలను నిర్దేశించుకున్నాయి. ఈ లక్ష్యాలలో అతి ముఖ్యమైనవి మూడు. 1. ప్రాథమిక, సెకండరీ విద్యలో బాల బాలికల మధ్య అంతరాన్ని 2005 సం॥ని కల్లా తొలగించటం, 2. దారిద్ర్యాన్ని స్త్రీలపైనే మోపడాన్ని (ఫెమినైజేషన్ ఆఫ్ పావర్టీ) తగ్గిస్తూ స్త్రీల ఆర్థిక స్థితిని మెరుగుపర్చటం, 3. విధానాల రూపకల్పనకు సంబంధించిన విభాగాల్లో కనీసం 30 శాతం వాటాను మహిళలకు కల్పించటం (భారతదేశంలో బాలికల విద్యకు, చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌కూ పాలకవర్గాలు ఇచ్చిన ప్రాధాన్యతను ఈ నేపథ్యంలోనే చూడాలి. దోపిడీ వ్యవస్థ చట్రంలో ఈ రెండింటికీ ఏ గతి పట్టిందో, పడుతూందో గత రెండేళ్ళుగా చూస్తూనే వున్నాం. వ్యవస్థల మూలాలను విస్మరిస్తూ ఐక్యరాజ్యసమితి ప్రకటించే లక్ష్యాలకూ దేశీయ పాలకవర్గాల కుహనా ఆచరణకు మధ్య అభాస ఇలాగే వుంటుంది మరి).

* మహిళల అసమానత్వాన్ని, దారిద్ర్యాన్ని తొలగించాలని, భద్రమైన, నిలకడైన జీవితాలను మహిళలు అనుభవించకుండా చేస్తున్న స్థూల ఆర్థిక విధానాలను మార్చాలని ప్రపంచవ్యాప్తంగా మహిళా సంస్థలు బీజింగ్ కాన్ఫరెన్స్ నుండి ప్రభుత్వాలపై వత్తిడి తీసుకొస్తున్నాయి. అయితే మహిళల పేద మహిళల సంక్షేమాన్ని మెరుగుపర్చే బాధ్యత ప్రభుత్వాలదే అని పై కాన్ఫరెన్సులూ, సంస్థలూ భావిస్తుండగా, మార్కెట్ సరళీకరణ, ప్రైవేటీకరణలనేవి సామాజిక బాధ్యతలను నెరవేర్చే పభుత్వాలు సామర్థ్యాన్నే తోసిపారేస్తున్నాయి. (ఈ రకంగా సామాజిక నిచ్చెన మెట్ల పై భాగంలో వున్న కొద్దిమంది మహిళలను మినహాయిస్తే అసంఖ్యాక పేద మహిళల స్థితిగతులను ప్రపంచీకరణ మరింతగా దెబ్బ తీస్తోంది).

* సాధికారత ప్రధాన లక్ష్యం లింగ సమానత్వమే కాబట్టి, లింగ సమానత్వం వైపుగా సాధించిన అభివృద్ధిని చూడాలంటే లింగ విచక్షణా – జెండర్ సెన్సిటివ్ – సూచికలు అవసరం అంటూ ఐక్యరాజ్య సమితి మూడు ప్రధాన సూచికలను ఆమోదించింది. అవి:

1. సెకెండరీ పాఠశాలల్లో బాలుర శాతంతో సమాన స్థాయికి బాలికల శాతం చేరుకోవటం.
2. వ్యవసాయేతర (అంటే పరిశ్రమలు–సర్వీసు రంగాలు) కార్యకలాపాల్లో ఉపాధి రంగంలో స్త్రీల వాటా.
3. జాతీయ పార్లమెంట్ సీట్లలో మహిళల వాటా కనీసం 30 శాతంకి చేరుకోవటం.

ఒక రకంగా చూస్తే ఈ మూడు సూచికలూ గత 200 సం॥ల పెట్టుబడిదారీ విధానంలో మహిళల స్థితిగతులకు చెందిన నమూనాలుగా వుంటాయి. అయితే పై నివేదిక కనుగొన్న వాస్తవాలు పరమ విభ్రాంతికరంగా పెట్టుబడిదారీ విధానం వైఫల్యాల్ని తిరుగులేని విధంగా నిరూపిస్తున్నాయి. ఈ నివేదిక ప్రకారం.

ఈ అత్యాధునిక యుగంలోనూ ప్రపంచం మొత్తం మీద కేవలం 11 శాతం దేశాలు మాత్రమే సెకండరీ విద్యలో లింగ సమానత్వాన్ని సాధించాయి. ఇక పరిశ్రమల్లో, సేవా రంగాల్లో వాసిలో వేతనం చెల్లింపబడే ఉద్యోగాలలో స్త్రీల వాటా 1985 నుండి పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నప్పటికి వాసిలో మహిళల ఉపాధి అవకాశాలు దిగజారి పోయాయి. స్త్రీల ఉద్యోగాలకు సామాజిక భద్రత లేదు. మహిళల ఉపాధి హక్కులు గురించి చెప్పాల్సిన పనే లేదు. ఇక వ్యవసాయ రంగంలో మహిళలకు అప్పుడూ ఇప్పుడూ నిలువు దోపిడీయే మిగులుతోంది. పార్లమెంట్ సీట్లలో మహిళల వాటా చూస్తే మరీ ఘోరంగా వుంది. గత రెండు శతాబ్దాల పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రస్థానంలో ఇంతవరకు ప్రపంచంలో కేవలం ఎనిమిది దేశాలు మాత్రమే మహిళలకు పార్లమెంటులో 30 శాతం సీట్లను కల్పించగలిగాయి. ప్రపంచంలో కెల్లా అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన ఇండియా, అతిగొప్ప ప్రజాస్వామిక దేశమైన అమెరికాలు ఈ జాబితా దరిదాపుల్లోకి రాకపోగా స్వీడన్, జర్మనీ మినహా గ్రూప్–8 దేశాల్లోని ఆరు దేశాలు ఈ జాబితాకి సంబంధించి సోదిలోకి లేకుండా పోయాయి. ఇంకా దారుణమేమంటే సెకండరీ విద్యలో లింగ సమానత్వాన్ని, ఉపాధి రంగంలో స్త్రీల సమాన వాటాని, పార్లమెంట్ సీట్లలో మహిళలకు కనీసం 30 శాతం వాటాని ప్రపంచంలో కేవలం నాలుగే నాలుగు దేశాలు సాధించాయి. అవి స్వీడన్, డెన్మార్క్, ఫిన్లాండ్, నార్వే కాగా ఐస్‌లాండ్, నెదర్లాండ్స్, జర్మనీ, దక్షిణాఫ్రికాలు ఈ లక్ష్యాల చేరువలోకి వచ్చాయని పై నివేదిక తెలుపుతోంది. ఈ సందర్భంగా మన ముందున్న ప్రశ్న ఒక్కటే. మహిళల సాధికారత, లింగ సమానత్వం గురించి ఉచ్చరించే అర్హత పెట్టుబడిదారీ వ్యవస్థకు వుందా...? ❑

# మహిళా సమానత్వంకి సోషలిస్ట్ ఎజెండాయే మార్గం

అత్యంత అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో కానీ, దారిద్ర్యం రూపుదాల్చిన అత్యంత వెనుకబడిన దేశాల్లో కానీ ప్రపంచంలో ఎక్కడ చూసినా పురుషులతో సమానంగా మహిళలు జీవిస్తున్న పరిస్థితి కానరాదు. అన్ని దేశాల్లోనూ మహిళలు ఈ నాటికీ రెండో తరగతి పౌరులుగానే వుంటున్నారు. ప్రపంచ జనాభాలో అత్యధిక శాతాన్ని ఇముడ్చుకున్న ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండ దేశాలలో మహిళలే వంటచెరకు సేకరిస్తూ, సుదూర ప్రాంతాల నుండి మంచినీళ్ళను మోసుకువస్తూ, ఆహారోత్పత్తిలో అధిక వాటా శ్రమను ధారపోస్తూ పర్వత భారాన్ని మోస్తున్నారు. మొత్తంగా చూస్తే మూడో ప్రపంచ దేశాలన్నింటిలో 60 నుంచి 80 శాతం దాకా ఆహార పంటల్ని మహిళలే వుత్పత్తి చేస్తున్నారు. ఆసియాలోని కొన్ని ప్రాంతాలలో అయితే ఇంకా అధికంగా మహిళలు 90 శాతం దాకా వరిపొలాల్లో పనికి బాధ్యత పడుతున్నారు. వేతన పనికోసం వెతుక్కుంటూ తమ పురుషులు పట్టణాలకు వలసపోతుంటే ఈ దేశాల్లోని స్త్రీలు అనేకమంది ఒంటరిగా వుంటూ తమ పిల్లలను పోషించుకుంటున్నారు. అన్నిటికంటే ఆశ్చర్యమేమిటంటే ఆహారోత్పత్తిలో అత్యంత కీలకపాత్ర వహిస్తున్న మహిళలే ప్రపంచంలోని పేదల్లోకెల్లా నిరుపేదలుగా వుండటమే. ప్రపంచబ్యాంకు గణాంకాల ప్రకారమే ప్రపంచంలోని 120 కోట్ల మంది పేదలలో 60 శాతం మంది మహిళలే వున్నారు. స్త్రీలు మరింత పేదరికంలోకి జారిపోతున్నందువల్ల దారిద్ర్య రేఖకు దిగువన వున్న మహిళల శాతం 1970 నుండి 50 శాతంకి పెరిగిపోయింది. అదే పురుషుల వాటా 30 శాతంగా వుంది.

పాశ్చాత్య దేశాల్లో సైతం మహిళలు ఆర్థిక, సామాజిక జీవితంలోని పలు అంశాలలో పురుషులకంటే వెనకబడి వున్నారు. పెట్టుబడిదారీ విధానం నిర్ణాయక స్థానంలోకి వచ్చిన 200 సం॥ల తర్వాత సైతం ప్రపంచం మొత్తంలో ఏ ఒక్క దేశంలోనూ మహిళలకు సమాన వేతనం లభించలేదు. స్త్రీ పురుషులకు సమాన వేతనంకి సంబంధించి దరిదాపుల్లోకి చేరుకున్న దేశం ఏదైనా వుందంటే ఆ ఘనత ఒక్క స్వీడన్ దేశంకే దక్కుతుంది. ఈ దేశంలో సైతం పురుషులు ఆర్జించే ఆదాయ స్థాయిలో దాదాపు 85 శాతాన్ని స్త్రీలు సంపాదించగలుగుతున్నారు.

**మహిళల అభివృద్ధి – పెట్టుబడిదారీ విధానం పరిమితులు**

ఒక్కటంటే ఒక్క దేశంలో కూడా మహిళల సమానత్వం ఈనాటికీ ఎండమావిగా వుంటున్నట్లుగా మహిళల అభివృద్ధి మందకొడితనంతో సాగుతున్నప్పటికీ మునుపటి వర్గ సమాజాలతో పోలిస్తే పెట్టుబడిదారీ విధానం చరిత్ర క్రమంలో పురోగామి దశకు సంకేతంగా నిలుస్తుంది. చారిత్రకంగా పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి, భారీ పరిశ్రమల స్థాపన అనేవి పాత, భూస్వామ్య పితృస్వామిక సమాజం నుండి ముందంజ వేశాయి. తొలి పెట్టుబడిదారీ దశలో (ఈనాటికీ మూడో ప్రపంచ దేశాల్లో) ఫ్యాక్టరీలలో పని పరిస్థితులు దుర్భరంగా వుంటూ వచ్చాయనడంలో, పనిదినం తగ్గింపు, కార్మికులకు మంచి పరిస్థితుల కోసం పోరాడటం ఇప్పటికీ అవసరమే అనడంలో ప్రతివాదన లేదు కానీ ఈ దుర్భల పరిస్థితులలో సైతం, మహిళలను ఇంటికే పరిమితం చేసిన పాత భూస్వామ్య బంధనాలతో పోలిస్తే పెట్టుబడిదారీ విధానం చారిత్రకంగా మూల మలుపే అని చెప్పాలి.

## ఇంటిపనికి జీతం పరిష్కారం కాదు

మహిళల విముక్తిని ముందుకు తీసుకుపోవాలంటే ఇంటిపనికి జీతం చెల్లించడమే మార్గం అంటూ ప్రపంచవ్యాప్తంగా ఫెమినిస్టులు సూత్రీకరిస్తున్నారు. ఇది పైపైన చూస్తే వినసొంపుగానే వుది కానీ మహిళల అసమానత్వానికి మూల కారణాన్ని ఇది ఛేదించటం లేదు. పైగా ఇది పరిష్కారమే కాదు.

వర్గ సమాజ చరిత్ర పొడవునా ఇంటిపనిని వ్యక్తులే చేస్తూ వస్తున్నారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే చాలావరకు మహిళలే ఇంటిపనిలో మునిగి తేలుతున్నారు. శతాబ్దాల తరబడి తిరిగినచోటే తిరుగుతూ వంటగది గోడల మధ్య లేస్తూ కూర్చుంటూ జీవితాలను పరంపరాయుతంగా ఇంటిపనికి వంటపనికి అర్పించిన కారణంగా, నాలుగ్గోడల మధ్య ఇరుక్కుపోయిన పని స్వభావం రీత్యా స్త్రీలకు విసుగుతెప్పిస్తూ నీరసం కల్గిస్తూ వచ్చింది. మనిషిని శారీరకంగా నీరసింపజేసే ఈ గొడ్డు చాకిరికిగాను స్త్రీలకు ప్రతిఫలంగా జీతం రూపంలో ఇవ్వటం అంటే అది స్త్రీలను ఈ వెట్టిచాకిరి నుంచి ఒంటరితనం నుంచి, గృహబంధనాల నుంచి బయటపడేయదు సరికదా, అది వారిని మరింతగా ఇంటికి కట్టిపడేస్తుంది. సామాజిక శ్రమలో పాలుపంచుకోకుండా స్త్రీలపై ఆంక్షలు విధించటమన్నదే స్త్రీలను రెండో తరగతి పౌరులుగా కుదించే కీలకాంశాల్లో ఒకటిగా వుంది. ఈ ఆంక్షలను తొలగించటమన్నదే మహిళా విముక్తి కోసం చేసే వాస్తవ పోరాటానికి ప్రధాన లక్ష్యంగా వుంటుంది.

గత 50, 60 సం॥లుగా మహిళలు సామాజిక రంగంలోకి ప్రవేశించినా, ఇంటిపని, పిల్లల పెంపకం ఇప్పటికీ వారి ప్రధాన బాధ్యతగానే ఎంచబడుతుండటం వల్ల గృహ బాధ్యతల భారంతో మహిళలు బయట పనికి పురుషులు ఇస్తున్నంత ప్రాధాన్యతను ఇవ్వలేక పోతున్నారు. ఈనాటికీ పశ్చిమదేశాల్లో పార్ట్‌టైమ్ కార్మికులలో ఎక్కువమంది మహిళలే వుంటున్న వాస్తవమే ఇందుకు నిదర్శనం.

ఇంటిపనిలో ముఖ్యభాగాన్ని ఇష్టం లేకున్నా నెత్తిన వేసుకున్న స్త్రీల సమస్యకు పరిష్కారం ఇంటిపనికి జీతం చెల్లించడం మాత్రం కాదు. నిజమైన పరిష్కారం ఇంటిపనిని సమాజపరం చేయటమే. అంటే వ్యక్తిగత పనిగా వుంటున్న ఇంటిపనిని సామాజిక సేవగా మార్చడం అని అర్థం. సమాజంలోని సభ్యులందరికీ ఈ సేవను ఉచితంగానూ, స్వల్పమాత్రపు ఖర్చుతోనూ అందించాలని దీనర్థం. శిశు సంరక్షణా సదుపాయాలు, మంచి ఆహారంతో కూడిన సామాజిక వంటశాలల్ని నెలకొల్పడం. లాండ్రీ సదుపాయాన్ని స్వల్పమాత్రపు ఖర్చుతో అందించటం వంటివి మహిళలను, వాస్తవార్థంలో విముక్తి చేసి సమాజ కార్యకలాపాలలో వారు సంపూర్ణ భాగస్వామ్యం చేపట్టేలా చేస్తాయి. పురుషులతో సమానంగా మహిళలు పనిచేయడానికి ఇవి ప్రాతిపదికను కల్గిస్తాయి.

ఇటువంటి సామాజిక సేవలు లాభదాయకం కావు కనుక పెట్టుబడిదారీ విధానం వీటిపై ఏ మాత్రం శ్రద్ధ పెట్టదు. అయితే పెట్టుబడిదారీ వర్గానికి అవసరమైన సమయాల్లో మాత్రం ఇలాంటి సేవలను అందించడానికి అది ముందుకొస్తుంది. చరిత్రలో ఇది రుజువైంది కూడా. బ్రిటన్‌లో రెండో ప్రపంచ యుద్ధ కాలంలో పురుషులు యుద్ధరంగానికి తరలి పోయినపుడు పరిశ్రమలు నడవాల్సిన అవసరం కొద్దీ పాలకవర్గం స్త్రీలను పరిశ్రమలకు తరలించడానికిగాను వారికి శిశు సంరక్షణా సౌకర్యాలను అడక్కుండానే కల్పించింది. మహిళలకు ఈ సందర్భంగా సామూహిక భోజనశాలలను కూడా ఏర్పర్చారు. అంతకుముందు మహిళలను మినహాయించిన ఉద్యోగాలన్నింట్లోకీ మహిళలను పిలిచి మరీ ఆహ్వానించారు. పెట్టుబడిదారీ వర్గం ఒక రకంగా అవసరార్థం 'సోషలిజాన్ని' అమలు చేసింది. తీరా యుద్ధం ముగిసే సమయం దగ్గర పడ్డాక, అవసరం తీరాక, స్త్రీలను తిరిగి ఇంటికి, వంటగదిలోకీ పంపించేశారు. పనిలో మహిళల అవసరం తీరిపోయింది కాబట్టి అప్పటినుండి రాత్రింబవళ్ళు తల్లులు తమ పిల్లలను చూసుకోవడం ఎంత అవసరమో చెబుతూ ప్రచారం మోత మొదలైంది. ఇలాంటి ప్రచారం ఇప్పటికీ ప్రామాణికంగా కొనసాగుతూనే వుంది.

చివరగా చెప్పాలంటే చట్టపరమైన హక్కుల లేమివల్ల స్త్రీ పురుషుల మధ్య అసమానతలు నెలకొన్నాయనటం వాస్తవ విరుద్ధం. కార్మిక వర్గాన్ని దోపిడీ చేసి లాభాన్ని గరిష్టంగా కొల్లగొట్టే పెట్టుబడి అవసరం పునాది మీద ఈ అసమానతలు నెలకొన్నాయి. అందుకనే పెట్టుబడిదారుల ప్రయోజనాల రీత్యానే ఇంట్లో మహిళల అణచివేతను కొనసాగించటం, సమాజంలో చౌకశ్రమ వనరుగా స్త్రీలను అట్టిపెట్టడం సాగుతోంది.

దీంతో పోలిస్తే, సోషలిస్ట్ సమాజం మానవుల అవసరం కోసం, జనాభా అవసరాలను తీర్చడం కోసం ఉత్పత్తి చేస్తుంది. కనుక సోషలిజంకి మహిళలను గృహబానిసత్వం నుండి విముక్తి చేయాల్సిన అవసరముంది. అందుచేత సోషలిస్ట్ విప్లవం లేకుండా మహిళలకు వాస్తవంగా సమానత్వం లేదు. అట్లే మహిళల పాత్ర లేకుండా సోషలిస్ట్ విప్లవమే లేదు.

అయితే పెట్టుబడిదారీ విధానంలో ఈనాటికీ భూస్వామ్య పితృస్వామిక అవశేషాలు కొనసాగుతూనే వున్నాయి. ఎందుకంటే ఈ అవశేషాలు కార్మికవర్గాన్ని ఇప్పటికీ విభజించటంలో ఉపకరిస్తున్నాయి. అవి స్త్రీలను కారుచౌకగా లభించే శ్రమ వనరుగా పెట్టుబడిదారులకు దఖలు పరుస్తూ సర్వసాధారణ వేతనాలను తగ్గించి వుంచుతున్నాయి. అందుకే స్త్రీ పురుషుల సమానత్వం కోసం పోరాటం స్త్రీలకెంత అవసరమో కార్మికవర్గ పురుషులకు కూడా అంతే అవసరం. లింగపరంగా, జాతిపరంగా (రేస్) కార్మికులు విభజింపబడి వున్నంతవరకు పెట్టుబడిదారీ వర్గం చేతిలో అదొక శక్తివంతమైన ఆయుధంగానే వుంటుంది.

### గృహ బంధనాలు

ఇంటిపనికి మహిళలు కట్టుబడి వున్నంతవరకు, బయట పని అయిపోయాక ఇంటిలో రెండో షిఫ్టు పనిని స్త్రీలు చేయక తప్పనంతవరకు మహిళల విముక్తి వాస్తవార్థంలో సాధ్యం కాదు. పాత్రలు తోమటం, బట్టలుతకటం, వంట వండటం, పిల్లల బాగోగులు చూడటం వంటి

వేతనం చెల్లింపబడని శ్రమలో స్త్రీలు అధిక వాటాని కల్గి వున్నంతవరకు సామాజిక జీవితంలో వారి సంపూర్ణ పాత్రను నిర్వహించటం అసాధ్యం. వేతనం లేని ఇంటిపని భారం నుండి స్త్రీలకు విముక్తి కల్గించాలంటే పెట్టుబడిదారులు ఇంటిపనికి కూడా జీతం చెల్లించడమో, లేక భర్త లేక కార్మికుడి ఆదాయం లోంచి కొంత భాగాన్ని ఇంటిపనికిగాను స్త్రీలకు చెల్లించడమో స్త్రీల విముక్తికి పరిష్కారం కానేకాదు. ఇంకా స్త్రీల ఇంటిపనిలో పురుషులు భాగం పంచుకోవడం అనేది ఒక ఆదర్శంగానూ, బాధ్యతగానూ చూసి అమలు చేయటం అనేది స్త్రీల విముక్తికి తద్వారా పురుషుల విముక్తికి మౌలిక పరిష్కారం కాదు.

మార్క్సిస్ట్ సిద్ధాంతం కాని, మార్క్సిస్టు ఆచరణ కాని ఈ సమస్యకు సంబంధించి మొదటి నుండి స్పష్టమైన వైఖరిని కల్గి వుంది. కుటుంబం లోపల స్త్రీలకు సంబంధించిన వ్యక్తిగత అంశంగా వుంటూ వస్తున్న ఇంటిపనిని సామాజీకరించటమే సమస్యకు మౌలిక పరిష్కారంగా మార్క్సిజం చెబుతోంది. ఇంటిపనిని వ్యక్తిపరంగా వున్న స్థితి నుండి సమాజపరం చేయడమే దీనికి పరిష్కారం. ఇంటిపనిని కుటుంబం నుండి బయటకు లాగాలి. ఇది కమ్యూన్ జీవితంతో ముడిపడి వుంటుంది. సమిష్టి పని, సమిష్టి జీవితం అనే పునాది సమాజంలో ఏర్పడ్డాక, అంతవరకు స్త్రీలు కుటుంబంలో చేస్తున్న వ్యక్తిగత సేవల్ని (చాకిరి) సామాజిక సేవలుగా మార్చాలి. అంటే కనీస ఖర్చుతో లాండ్రీ సేవలు, ఉచితంగా పిల్లల సంరక్షణ, సరైన సామాజిక-పబ్లిక్-ఆహార శాలలు వంటివి ఉనికిలోకి వచ్చి కుటుంబాలు కనీస ధరలతో వీటిలో భుజించేలా, ఇతర సేవలు పొందేలా నూతన సమాజపు సమిష్టి ఏర్పాట్లు ఉనికిలోకి రావాలి.

ఈ భావనలూ, డిమాండ్లూ కొత్తవేం కావు. గత శతాబ్ది కాలంగా కమ్యూనిస్టులు నూతన జీవితానికి సంబంధించిన ఈ ప్రతిపాదనలను ముందుకు తీసుకువస్తున్నారు. సోవియట్ యూనియన్, చైనాలలో సోషలిజాన్ని నిర్మిస్తున్న కాలంలో నూతన జీవితానికి సంబంధించిన అనేక చర్యలను ముందుకు తీసుకువచ్చారు. ఈ దేశాలలో స్త్రీల సమానత్వం ఏ పెట్టుబడిదారీ దేశంతో పోల్చి చూసినా సరే ముందుపీఠినే వుంటూ వచ్చింది. అయితే 1950లలో సోవియట్ యూనియన్ సోషలిజం వెనుకడుగు వేయటం, చైనాలో 1976లో మితవాద సైనిక కుట్ర మావో పంథాను కూలదోయటం జరిగిపోయాక మహిళలు విప్లవానికి మునుపటి రోజుల అంధకారంలోకే తిరిగి వెళ్ళిపోవాల్సి వచ్చింది.

## సగర్వంగా తలెత్తిన ఆకాశంలో సగం

చైనాలో విప్లవ కాలంలో సంభవించిన మహా పురోగమనాలు అత్యంత వెనకబడిన సమాజంలో సైతం సోషలిజం మహిళలకు ఏం కల్పించిందో చాటే తార్కాణాలుగా నిలిచాయి. 1950లలో అంటే విప్లవం తదుపరి సం॥లలో చైనా మహిళలు పురుషుల ఆదాయంలో సగం సంపాదించేవారు. 1950ల నాటికి ఇది 60, 70 శాతంకి పెరిగింది. పట్టణాలల్లో ఈ అంతరం మరింతగా తగ్గింది. ప్రపంచంలోకెల్లా అత్యంత అభివృద్ధి గాంచిన పెట్టుబడిదారీ దేశంగా పేరొందిన అమెరికాలో సైతం మహిళల ఆదాయాలు పురుషుల ఆదాయాలతో పోలిస్తే ఈనాటికీ 57 శాతంగా మాత్రమే వుంటున్నాయంటే సోషలిజం ఆనాడు సాధించినది ఎంత విశిష్టమైనదో తెలుస్తుంది. ఇక సాంస్కృతిక విప్లవ కాలంలో చైనా 'ఆకాశంలో సగభాగం మహిళలే' అని ఎలుగెత్తారు. చైనా స్త్రీలు పాత పంథాను సవాలు చేశారు. అడ్డుగోడలను కూలదోశారు. పురుషాధిపత్యంతో పోరాడారు. మహిళా బృందాలు జల విద్యుత్తు ప్రాజెక్టులను స్వయంగా నడిపారు. చదువులేని రైతాంగ మహిళలు పరిశ్రమలను స్థాపించారు. రైతాంగం మధ్య జీవిస్తూ విప్లవ భావాలు వ్యాప్తి చెందించటానికి అనేకమంది యువతులు నగరాల నుండి గ్రామాలకు తరలివెళ్ళారు. వ్యభిచారం, శిశుహత్యలు, ఆడపిల్లల వెట్టిచాకిరీ వంటివి వాస్తవార్థంలో తుడిచిపెట్టుకు పోయాయి. 1970ల చివర్లో డెంగ్‌జియావో పింగ్ ఆధ్వర్యంలో పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణ జరిగేంతవరకు చైనాలో ఈ రకంగా నూతన జీవిత బీజాంకురాలు ఎల్లెడలా మోసులెత్తాయి. విప్లవ పంథా ఓడింపబడ్డాక చైనాలో ఈ పాతికేళ్ళలో పాత సమాజానికి సంబంధించిన భయానక అవశేషాలన్నీ తిరిగి పునరుద్ధరింపబడ్డాయి.

నేటి ప్రపంచంలో కార్మిక ప్రజారాసుల ముందు భవిష్యత్తుకు సంబంధించి రెండు అంశాలు బరిలో నిలబడి వున్నాయి. వునికిలో వున్న వ్యవస్థను దాని సకల అసమానతలను యధాతథంగా అట్టిపెట్టుకోవడం లేక తిరిగి సోషలిజం కోసం పోరాడటం. పెట్టుబడిదారీ విధానపు సుదీర్ఘ అభివృద్ధినంతటినీ పరికించి చూసినా మహిళలు ఇప్పటికీ వెనుకబడే వుంటున్నారు. సోషలిజం పెట్టుబడిదారీ విధానం కంటే ఆధిక్యత కల్గిన వ్యవస్థ అని చరిత్ర ఇప్పటికే తేల్చి చెప్పింది. మానవ విముక్తిని తిరిగి ఎజెండాలోకి తీసుకు రావడం కోసం గాను కార్మికవర్గ స్త్రీ పురుషులు ఇపుడు చేయవలసిందల్లా యేమిటంటే పెట్టుబడిదారీ పునరుద్ధరణకు దారితీసిన పరిస్థితులేమిటో బోధపర్చుకోవటమే... ❑

## చర్చల గురించి ప్రకటిస్తూనే హత్యాకాండను యథాతథంగా సాగిస్తున్న ప్రభుత్వంఱ

ప్రపంచ బ్యాంకు ఆదేశిత విధానాలను అమలు చేస్తున్న ఆంధ్ర ఫ్యూజీమోరి, సామ్రాజ్యవాదుల బడితొత్తు, నరహంతకుడు నారా చంద్రబాబు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం హత్యాకాండను కొనసాగిస్తున్నది. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, పౌరస్పందన వేదిక వాళ్ళ నుండి వచ్చిన వత్తిడితో ఒకవైపు "నక్సలైట్లతో చర్చలకు సిద్ధం" అంటూనే ఇంకొకవైపు హంతక దాడులను తీవ్రతరం చేసింది. కాల్పుల విరమణ ఒప్పందానికి వెంటనే రాకుండా ప్రతిపక్షాలతో అఖిలపక్ష సమావేశాల తతంగాలతో కాలయాపన చేస్తూ చర్చల ప్రహసనాన్ని పొడిగిస్తూ, ఈ ఎండాకాలంలో విప్లవకారులకుండే వాతావరణ అననుకూల పరిస్థితిని ఆసరా చేసుకొని విప్లవోద్యమాన్ని అవకాశం వున్న మేరకు దెబ్బతీయ పూనుకున్నది. ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ సహాయంతో దళాలపై, ప్లాటూన్లపై దాడులు చేస్తూ ఎన్‌కౌంటర్ హత్యలు కొనసాగిస్తున్నది. ఎస్.ఎస్.ఎఫ్, గ్రేహౌండ్స్ బలగాలను గ్రామాలు, అడవులపై ఉసికొల్పి హత్యాకాండను తీవ్రపరిచింది. గ్రామాలు, పట్టణాలు అనకుండా నిరంతరం సోదాలు, పెట్రోలింగ్‌లు నిర్వహిస్తున్నది. ప్రజలను, విప్లవ సానుభూతిపరులను అనేక మందిని అరెస్టు చేసి "దళాల జాడ చెప్పమంటూ, ఆయుధాల జాడ చెప్పమంటూ" తీవ్రమైన చిత్రహింసల పాలుజేస్తున్నది. 2002 జనవరి నుండి ఈ విధంగా కొనసాగిస్తూ వస్తున్న ప్రభుత్వ విధానం 11-3-2002 నాటకి "తుపాకుల గూడెం మూకుమ్మడి హత్యాండ"గా పెచ్చరిల్లిపోయింది. జనవరి 2002 నుంచి ప్రపంచ బ్యాంకు ఏజెంట్ చంద్రబాబు ప్రభుత్వ హత్యాకాండ ఎలా రోజు రోజుకు బరితెగించిపోతున్నదో ఈ క్రింది సంఘటనలను చూసిన వారికెవ్వరికైనా అర్థం కాకమానదు. ఇంకొకవైపు ఈ హత్యాకాండ చర్చల పట్ల చంద్రబాబు ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధికి అద్ధం పడుతున్నది.

ఉత్తర తెలంగాణ అంతటా పదుల సంఖ్యలో ఎస్.ఎస్.ఎఫ్, గ్రేహౌండ్స్ బ్యాచ్‌లు ఏ.పి.ఎస్.పి, జిల్లా ప్రత్యేక పోలీసు బలగాలు కూంబింగ్‌లు జరపడం, అంబుష్‌లు పెట్టడం పెరిగిపోయింది. ముఖ్యంగా నిజామాబాద్ డివిజన్‌లో పక్కా ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొని దళాలపై హంతక దాడులు చేసి కాల్పులు జరపడం పెరిగిపోయింది. జనవరి 2002 మూడో వారంలో జగిత్యాల ఏరియాలోని హబ్సీపూర్ గ్రామ పరిసరాల్లో దళంపై ఎస్.ఎస్.ఎఫ్ బలగాలు దాడిచేసి కాల్పులు జరిపాయి. ఫిబ్రవరిలో కథలాపూర్ మండలం కలికోట గ్రామం దగ్గర దళం మకాంపై దాడి చేసి కాల్పులు జరిపాయి. ఈ రెండు సంఘటనల్లో పి.జి.ఏ. బలగాలు ఎలాంటి నష్టం లేకుండా సురక్షితంగా రిట్రీట్ అయినాయి. అయితే కొన్ని కిట్లు, ఇతర సామాగ్రిని పోలీసు బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. జనవరి చివరలో .........గ్రామం వద్ద దళం మకాంపై దాడిచేసిన పోలీసులు కాల్పులు జరిపి కామారెడ్డి- సిర్నాపల్లి ఎల్.జి.ఎస్. కమాండర్ కా. రమేష్‌ను కాల్చి చంపారు. ఒక ఎస్.ఎల్.ఆర్., కిట్లు, యితర సామానును పోలీసులు దొంగిలించారు. పార్టీ అవసరాల రీత్యా నిరాయుధంగా సివిల్‌లో ప్రయాణమై పోతున్న నిజామాబాద్ జిల్లా కమిటీ సభ్యుడు కా. అంజన్న (అయిలన్న)ను ఇన్‌ఫార్మర్ సహాయంతో అరెస్టు చేసిన పోలీసుల క్రూరమైన చిత్రహింసలు పెట్టి జనవరి 8, 2002న ఎన్‌కౌంటర్ పేరిట కాల్చిచంపారు. 3-3-2002న జగిత్యాల ఏరియాలోని మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామ శివారులో రాత్రి 9-45 నిమిషాల సమయంలో ఎస్.ఎస్.ఎఫ్ బలగాలు దాడిచేసి కాల్పులు జరిపాయి. పి.జి.ఏ. బలగాలు కూడా ఎస్.ఎస్.ఎఫ్ పోలీసులు చేసిన ఈ దాడిని త్రిప్పికొడుతూ సురక్షితంగా రిట్రీట్ అయినాయి.

ఆదిలాబాద్ జిల్లా మంగి ఏరియాలో 6-3-2002న ఎస్.ఎస్.ఎఫ్. బలగాలు పెద్ద ఎత్తున కూంబింగ్ జరిపి దళంపై దాడిచేసి కాల్పులు జరిపి ఒక మహిళా దళ సభ్యురాలిని హత్యచేసారు. పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని దెబ్బతీయడానికి కరీంనగ్, వరంగల్, ఖమ్మం జిల్లాల సరిహద్దుల్లో పోలీసుల కూంబింగ్‌లు, అంబుష్‌లు పెట్రేగిపోతున్నాయి. ఈస్ట్ సబ్ కమాండ్ పరిధిలోని 15th ప్లాటూన్ A సెక్షన్ కమాండర్ కామ్రేడ్ సారన్నతో ఒక టీమ్ పనిమీద పోయి వస్తుండగా సింగంపల్లి గ్రామం వద్ద వెనక నుండి వచ్చిన ఎస్.ఎస్.ఫ్ బలగాలు దాడి చేసి కాల్పులు జరిపి, గాయాలతో పడిపోయిన సెక్షన్ కమాండర్ కా. సారన్నను అరెస్టు చేసి క్రూరమైన చిత్రహింసలు పెట్టి అతి కిరాతకంగా హత్య చేసారు. ఇలా కొనసాగుతున్న పోలీసుల హత్యలు తుపాకుల గూడెంలో ముకుమ్మడి హత్యాకాండగా పెచ్చరిల్లిపోయింది.

11-3-2002న ఈస్ట్ సబ్ కమాండ్ బలగాలతో కూడిన క్యాంపులో ఖమ్మం జిల్లా కమిటీ మరియు ఆపరేషన్ కమాండ్ సమావేశం జరుగుతున్న డెన్‌పైన ఖచ్చితమైన ఇన్‌ఫర్మేషన్‌తో జె.ఒ.సి నాయకత్వంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రం, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల పోలీసు బలగాలు మరియు హైదరాబాద్ ఎస్.ఎస్.ఎఫ్, గ్రేహౌండ్స్ బలగాలు దాదాపు నాల్గు నుంచి ఐదు వందల మంది పోలీసులు పరాయి దేశంపై దండెత్తిన మాదిరిగా విప్లవ కార్యకర్తలపై, పి.జి.ఏ. బలగాలపై 2 ఇంచుల మోర్టార్లు, గ్రెనేడ్లను పేల్చారు. ఏ.కె., ఎస్.ఎల్.ఆర్., ఎల్.ఎం.జి.లాంటి తుపాకులతో కాల్పులు జరిపి ఎనిమిది మంది కామ్రేడ్స్‌ను పొట్టన పెట్టుకున్నారు. కాగా ఈ క్యాంపుపై పోలీసు బలగాలు దాడి జరపడానికి ముందే క్యాంపు చుట్టూ దాదాపు 2కి.మీ దూరం వరకు నాల్గు దిక్కుల అంబుష్‌లు పెట్టారు. క్యాంపు చుట్టూ అడవిని తగులబెట్టారు. ఒక్కో అంబుష్ పార్టీ పోలీసు బలగాలు ముప్పై మంది చొప్పున వున్నాయి. మొత్తం కామ్రేడ్స్‌ను సమూలంగా నిర్మూలించాలనే దుష్ట పథకంతో ఈ దాడికి పాల్పడ్డారు. అయితే దోపిడీ వర్గాల కాపలా కుక్కలు, ఆర్గనైజ్డ్ హంతకులు చేసిన దుర్మార్గమైన యీ దాడిని పి.జి.ఏ. బలగాలు అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించి వీరోచితంగా ప్రతిఘటిస్తూ, మిగిలిన విప్లవ క్యాంపును సురక్షితంగా రిట్రీట్ చేయించి, త్యాగ సాంప్రదాయాన్ని నెలకొల్పారు. పి.జి.ఏ. ప్రతిఘటనలో పాలక వర్గాల విశ్వాస కుక్క ఎస్.ఐ. సంజీవ్ మట్టి కరిచాడు. తమ పచ్చి హత్యాకాండను సమర్థించుకోవడానికి, ప్రజలను ప్రక్కదారి పట్టించడానికి "ప్రజలను నక్సలైట్లు వేధిస్తుంటే ప్రజల కోరిక మేరకు ఆ వేధింపులను అడ్డుకునేందుకు పోగా మాపైననే కాల్పులు జరిపారు. అందుకు ప్రతిగా మేము జరిపిన కాల్పుల్లో ఎనిమిది మంది నక్సలైట్లు చనిపోయారు" అని మరో కొత్తరకమైన కట్టుకథను సృష్టించారు.

12-3-2002న అనారోగ్యంతో వుండి చికిత్స చేయించుకొని దళం వద్దకు వస్తున్న కరీంనగర్ జిల్లా మహదేవ్ ఏరియా సాయుధ మహిళా టీంలోని సభ్యురాలు కా. వెన్నెల మరియు కొత్తగా రిక్రూట్ అయిన కా. పార్వతిలను యత్నారం గ్రామం వద్ద పట్టపగలు ప్రజల ముందు అరెస్టు చేసిన పోలీసులు అతి అమానుషమైన చిత్రహింసలు పెట్టి సింగారం గ్రామం సరిహద్దుల్లో కాల్చి చంపారు. తమ హత్యాకాండను కప్పిపుచ్చుకోవడానికి పోలీసులు " 11-3-2002 నాటి తుపాకుల గూడెం ఎన్‌కౌంటర్ నుండి బయటికి వచ్చిన నక్సలైట్లతో కాల్పులు జరిగి ఇద్దరు మహిళా నక్సలైట్లు చనిపోయారు" అని ప్రచారం చేసారు.

ఇంతటితోనే గాకుండా మరిన్ని హత్యలు చేయడానికి, తమ రక్త పిపాసను చల్లార్చుకోవడానికి ఈ అటవీప్రాంతంలో ఇప్పటికీ హంతక దళాల కూంబింగ్ కొనసాగుతూనే వున్నది. అంబుష్‌లు పెట్టడం కొనసాగిస్తూనే వున్నాయి. ప్రజలకు అర్థం కాకుండా రహస్యంగా దళం పాత మకాంలలో, బాటల వెంట, నీళ్ళ తావుల వద్ద మాటుగాయడం పెరిగిపోతూనే వుంది.

వరంగల్ నేడు నిప్పులు చెరుగుతున్న నిర్బంధ కుంపటిలో మలమల మాడిపోతున్నది. అంబుష్, కూంబింగ్, అరెస్టులు, చిత్రహింసలు, దాడులు, ఎన్‌కౌంటర్ హత్యలు సర్వసాధారణమై పోయాయి. ఈ విధంగా కొనసాగుతున్న పాలక వర్గాల కావలి కుక్కల దాడుల్లో జనవరి 2002 మాసంలో నర్సంపేట ఏరియాలో కర్లపల్లి అడవిలోని ఊటమడుగు వద్ద మహిళా దళ సభ్యురాలు కా. దీప అసువులు బాసింది. ప్రజలు, విప్లవ సానుభూతిపరులు నిరంతరం భయం నీడలో కాలం గడుపుతున్నారు. పైర్ల కావలి, రాత్రి పూట చేనుల వద్దకు పనుల కోసం పోయే రైతులు, పాలేర్లపై దాడి చేసి "అన్నల జాడ చెప్ప"మని హింసించడం, అంబుష్ పెట్టి మీదపడి కాల్చడం, యిదేమిటని ప్రజలు ప్రశ్నిస్తే "అన్నలు మీ గ్రామాలకు వస్తే మేము వస్తాం....అన్నలు రాకుంటే మేము రాము..... అంత వరకు ఇలాంటి దాడులు, కాల్పులు జరుగుతూనే వుంటాయి" అని పరకాల డిఎస్పీ, రేగొండ ఎస్.ఐ.లు జూబ్లినగర్ గ్రామస్తులను బెదిరించారు. అయితే ఈ మాటలు, దాడులు, అంబుష్‌లు కేవలం పరకాల డిఎస్పీ, రేగొండ ఎస్.ఐ.ల మాటలే కాదు, మొత్తం ఉత్తర తెలంగాణలోని పోలీసు అధికారుల మాటలు, జవాబు. ఇది ఉత్తర తెలంగాణ పోలీసుల న్యాయం. ఫిబ్రవరి 2002 మూడో వారంలో వరంగల్ జిల్లాలోని రేగొండ మండలం జూబ్లినగర్ గ్రామ రైతు తన చేను వద్దకు నీళ్ళు పెట్టకోవడానికి పోగా రేగొండ ఎస్.ఐ. నాయకత్వంలోని పోలీసులు పోలాల్లో వుండే కాలిబాటల్లో అంబుష్ పెట్టి మీదపడి కాల్పులు జరిపి తీవ్రంగా గాయ పర్చారు.

ఇంకొకవైపు గుంటూరు జిల్లాలో ఫిబ్రవరి రెండవ వారంలో ఒక కామ్రేడ్‌ను అరెస్టు చేసి కాల్చి చంపారు. విజయనగరం జిల్లా బోజనగూడ వద్ద 18-3-2002న దళంపై దాడిచేసి ఒక మహిళా కామ్రేడ్‌ను కాల్చిచంపారు.

అయితే ఈ దాడులన్నీ చర్చల పట్ల చంద్రబాబు ప్రభుత్వం యొక్క వైఖరిని తెలియజేస్తున్నాయి. ఒకవైపు సాధ్యమైన మేరకు విప్లవోద్యమాన్ని దెబ్బతీయడానికి దాడులను రహస్యంగా తీవ్రపరుస్తూ మరోవైపు ప్రజలకు, ప్రజాస్వామికవాదులకు చర్చలకు కట్టుబడి వున్నట్టు ప్రకటిస్తూ నమ్మించజూస్తున్నాడు. అందుకోసం ప్రతిపక్షాలతో అఖిలపక్ష సమావేశాలంటూ కాలయాపన చేస్తూ, చర్చలకు అనుకూల వాతావరణం కల్పించే చర్యలైన పోలీసు కూంబింగ్, దాడులు, ఎన్‌కౌంటర్ హత్యలను నిలుపడం లేదు. వీటి గురించి  కూడా చర్చల్లోనే మాట్లాడుకోవచ్చని అంటున్నాడు. అందుకు అనుగుణంగానే పథకం ప్రకారం తమ హంతక విధానాన్ని అమలు చేస్తున్నాడు.

ప్రపంచ బ్యాంకు నిర్దేశిత విధానాలను అమలు చేయడానికే కంకణబద్ధుడైన చంద్రబాబుకు చర్చల ప్రక్రియ మింగుడు పడని విషయం. ఈ చర్చల్లో ముందుకు వచ్చే పీడిత ప్రజల భూమి సమస్య, ప్రజాస్వామిక, పౌర హక్కుల సమస్య లాంటివి ప్రపంచ బ్యాంకు తొత్తు చంద్రబాబు పరిష్కరించలేనివి. చంద్రబాబు అసలు కార్యక్రమం రాష్ట్రాన్ని మొత్తంగా సామ్రాజ్యవాదుల పరం చేయడం, ఈ విధానాన్ని ప్రతిఘటించే ఎటువంటి శక్తులనైనా, పోరాటాలనైనా, ఉద్యమాలనైనా గొంతు నులిమి వేయడమే. ఈ వాస్తవం కూడా కరెంట్ చార్జీల పెరుగుదలపై రైతాంగం ఉద్యమించినప్పుడు బషీర్‌బాగ్‌ను మరో జలియన్‌వాలాబాగ్‌ను చేసినప్పుడు, అంగన్‌వాడీ వర్కర్లపై అమానుషత్వాన్ని ప్రదర్శించినప్పుడే స్పష్టం అయింది. అయితే ఈ మధ్య కాలంలో ప్రజలు, ప్రజాస్వామికవాదుల నుండి వస్తున్న వత్తిడితో చర్చలకు సిద్ధం అని అంగీకరించింది కూడా ప్రజలను మోసం చేయడానికేనన్నది తుపాకుల గూడెం హత్యాకాండే అద్దం పడుతున్నది. ఇది చంద్రబాబు మేకవన్నెపులితనాన్ని మరింతగా బయటపెడుతున్నది.

జీవిచే హక్కు కోసం, కనీస ప్రజాస్వామిక హక్కుల కోసం, ప్రజల నిజమైన అధికారం కోసం ప్రజలకు ప్రతిహింస అవసరం. అందుకు ప్రజలకు సాయుధ పోరాట మార్గం తప్ప మరో మార్గం లేదు. దీనికై మార్క్సిజం - లెనినిజం - మావోయిజం వెలుగులో సి.పి.ఐ.(ఎం-ఎల్) [పీపుల్స్‌వార్] నాయకత్వంలో ఏర్పడిన "ప్రజా గెరిల్లా సైన్యం"లో విస్తృతంగా చేరి తెగించి పోరాడాలి.

❑

# లొంగుబాటు జరిగినా – పోరుబాట ఆగదు

దేశం ఆర్థిక సంక్షోభంలోకి మరింతగా కూరుకుపోతూ ప్రజల బ్రతుకులు మరింతగా దుర్భరం అవుతున్నప్పుడు పాలకులు ప్రజల ఏ ఒక్క సమస్యను పరిష్కరించకపోగా ప్రజా పోరాటాలపై, విప్లవోద్యమాలపై ఫాసిస్టు నిర్బంధాన్ని తీవ్రతరం చేసినప్పుడు విప్లవ శక్తుల్లో, ప్రజల్లో వర్గకసితో బాటు మరొక వైపు భయాందోళనలు పెరగడం సహజం. ఈ నేపథ్యంలోనే విప్లవోద్యమాన్ని వదిలి ప్రభుత్వానికి లొంగిపోతున్న వారి సంఖ్య పెరిగినట్లుగానే, విప్లవించేందుకు పూర్తి కాలం కార్యకర్తలుగా పార్టీలోకి వస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతున్నది. సహజమైన ఈ పరిణామాన్ని సరిగా అర్థం చేసుకోలేక పెరుగుతున్న నిర్బంధాన్ని, లొంగుబాట్లను చూసి కొందరు ఆందోళన చెందుతుండగా, పాలక వర్గాలు కావాలని విప్లవ శక్తుల, ప్రజల విప్లవ ఆకాంక్షల్ని నిర్వీర్య పర్చేందుకు సకల ప్రయత్నాలు సాగిస్తున్నాయి.

పెరుగుతున్న ప్రభుత్వ ఫాసిస్టు నిర్బంధాన్ని, విప్లవ పరిస్థితుల్ని సరిగ్గా అంచనా కట్టక, సరిగా అర్థం చేసుకోలేక, త్యాగనిరతిని పెంచుకోలేక ఈ మధ్య కాలంలో దళ సభ్యుల నుండి జిల్లా కమిటీ స్థాయి వరకు గల చాలా మంది ప్రభుత్వానికి లొంగిపోవడం జరుగుతున్నది. తాము ఊహించనంతగా నిర్బంధం పెద్దయెత్తున అమలు అయినప్పుడల్లా విప్లవోద్యమ చరిత్రలో గతంలో కూడా పలుమార్లు యిలానే జరిగింది. నిర్బంధకాండ మరింత ఫాసిస్టు రూపం ధరిస్తున్న పరిస్థితుల్లో గత కొంత కాలంగా ఎక్కువ సంఖ్యలోనే లొంగిపోయారన్నది వాస్తవం. పెరుగుతున్న విప్లవోద్యమానికి తగ్గట్లుగా తమ చైతన్యాన్ని, కార్యాచరణను సృజనాత్మకంగా మెరుగుపర్చుకోలేక పరిమితులకు లోనైనవాళ్ళు, అనేక లోపాలకు, విమర్శలకు గురయినవాళ్ళు, తమ వ్యక్తిగత సమస్యలను పరిస్థితులకు, పార్టీ పద్దతులకు కట్టుబడి పరిష్కరించుకోలేని వాళ్ళు, పార్టీలోకి కొత్తగా రిక్రూట్ అయి విప్లవోద్యమాన్ని యింకా సరిగ్గా అర్థం చేసుకోలేని సమయంలో ఊహించనంతటి నిర్బంధాన్ని ఎదుర్కొని భయం చెందిన వాళ్ళు తదితరులు నిర్భందం, ఉద్యమం కొత్త మలుపులు తీసుకుంటున్న నేటి పరిస్థితుల్లో ఎక్కువగానే లొంగిపోయారు. పార్టీలో కొనసాగినప్పుడు ప్రజలచే అభిమానింపబడి, గౌరవింపబడిన వాళ్ళు ప్రభుత్వానికి లొంగిపోయి ప్రజలు అసహ్యించుకోవడాన్ని జీర్ణించుకోలేక, తమ బలహీనతల్ని నిజాయితీగా చెప్పుకోలేక, పార్టీని దుమ్మెత్తి పోసేందుకు, పోలీసులు పలికించినట్లుగా పలికేందుకు పూనుకుంటున్నారు. లొంగిపోతున్న వారినందరిని జమ చేసి ఒకేసారి ప్రకటించి చాలా పెద్ద సంఖ్యలో లొంగిపోతున్నట్లు, పీపుల్స్‌వార్ పార్టీ పూర్తిగా దెబ్బతినిపోతున్నట్లు, విప్లవోద్యమాన్ని నిర్మూలించగలుగుతున్నట్లు పోలీసు అధికారులు, పాలకులు పెద్దయెత్తున ప్రచారం చేస్తూ, ప్రజల్లో గందరగోళాన్ని లేపేందుకు ప్రయత్నిస్తున్నారు. నిర్బంధం ద్వారా, హత్యాకాండ ద్వారా, దుష్ప్రచారం ద్వారా, లొంగుబాట్ల పథకాల ద్వారా విప్లవోద్యమాన్ని దెబ్బతీయ పూనుకోవటం, వైఫల్యం పొందుతూ రావడం పాలక వర్గాలకు, పోలీసు డిపార్ట్‌మెంట్‌కు కొత్తేమీకాదు. వీరు ఆశించినట్లుగా, ప్రచారం చేసినట్లుగా జరిగినట్లైతే దశాబ్దాల క్రితమే పీపుల్స్‌వార్ పార్టీ నామారూపాలు లేకుండా పోవాల్సింది. కానీ, అలా ఎన్నడూ జరుగనట్లే, భవిష్యత్‌లో కూడా జరుగదనేది చారిత్రక సత్యం. ప్రజలు తెగించి పోరాటం చెయ్యక తప్పని పరిస్థితిని, సాయుధులై పోరాడక తప్పని పరిస్థితిని ప్రభుత్వాలు దిన దినం మరింతగా తీవ్రతరం చేస్తున్నందునే విప్లవోద్యమంలో లొంగిపోతున్నవారి కంటే విప్లవించేందుకు రిక్రూటై రాగలుగుతున్న వారి సంఖ్య ఎక్కువగా వుంటున్నది. అలా రిక్రూట్‌మెంట్ పెరుగుతూ వస్తున్నది కాబట్టే, ఎంత మంది అమరులైనా, ఎంత మంది దిగజారి లొంగిపోయినా పార్టీ పరిస్థితి దినదినం మరింతగా మెరుగవుతూ ప్లటూన్ల ఫార్మేషన్ తీసుకుంటూ, ప్రతిఘటనా పోరాటాన్ని తీవ్రతరం చేయగలుగుతూ వస్తున్నది. రిక్రూట్‌మెంట్ మరింతగా పెరిగి అనతికాలంలోనే ప్రజా గెరిల్లా సైన్యం కంపెనీ ఫార్మేషన్‌కు పరిణామం చెందగలదు. విప్లవోద్యమం ఈ విధంగా బలపడుతుందని పాలకులకు తెలుసు కాబట్టే నిర్బంధాన్ని తీవ్రతరం చేసేందుకు సాయుధ బలగాలను, సైనిక శిక్షణను, కమ్యూనికేషన్, ఇన్‌ఫర్మేషన్ నెట్ వర్క్‌ను పెంచుతున్నారు. ప్రజల్ని ఆకర్షించే సంస్కరణలను చేపట్టుతున్నారు. దీర్ఘకాలిక పథకాలతో, పకడ్బంది ప్లానులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ఆపరేషన్ కమాండ్ రూపంలో పనిచేసేందుకు పూనుకున్నాయి.

విప్లవోద్యమ తీవ్రతను చూసి ఒకవైపు గగ్గోలు పెడుతున్న సామ్రాజ్యవాదులు, భారత దళారీ పాలకులు మరోవైపు మేకపోతు గాంభీర్యంతో విప్లవోద్యమాన్ని దెబ్బతీయగలుగుతున్నట్లు ప్రజల్ని నమ్మించ పూనుకుంటున్నారు. విప్లవోద్యమం నల్లేరుపై బండిలాగా, సాఫీగా ఎన్నడూ వుండదు. బలమైన ప్రభుత్వాన్ని ఎదుర్కొంటున్నప్పుడు కొన్ని సమయాల్లో తగినంతగా ప్రతిఘటనా చర్యలు లేకపోవచ్చు. కొన్ని సార్లు ఎక్కువ నష్టాలు సంభవించనూ వచ్చు. ఉద్యమం స్థబ్దతకు గురికాబడనూ వచ్చు. ఉద్యమంలో ఈ ఆటుపోట్లు సర్వసాధారణమైన విషయమే. విప్లవోద్యమాన్ని, విప్లవ పరిస్థితిని, ఓటమి, విజయాలను సిద్ధాంత కోణంలో చైతన్యయుతంగా అర్థం చేసుకోకుండా, తమ బలహీనతల్ని వదిలించుకోకుండా, తమ బలహీనతల్ని అర్థం చేసుకోకుండా, త్యాగనిరతిని పెంచుకోకుండా ఉండే బలహీనులు ఉద్యమాన్ని వదిలి ప్రభుత్వానికి లొంగిపోవడం ఆశ్చర్యపడాల్సిందేమీ కాదు.

నిర్బంధం ద్వారా, బెదిరింపుల ద్వారా, ప్రచారాల ద్వారా, ప్రలోభాల ద్వారా, కౌన్సిలింగ్‌ల ద్వారా లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్న పోలీసులు ఆతర్వాత లొంగిపోయిన వారిని ఇంటి వద్ద సాధారణ జీవితం గడుపనివ్వడంలేదు. లొంగిపోయిన వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. లొంగిపోయిన వారిని ప్రజావ్యతిరేకులుగా, ఇన్ఫార్మర్లుగా, అరాచకులుగా మార్చేందుకు పూనుకుంటున్నారు. పార్టీకి సహకరించిన వారి పేర్లను, ఇండ్లను, డంపుల్ని చూపించాలని వత్తిడి చేస్తున్నారు. వారాల తరబడి పోలీసు స్టేషన్లలో ఉంచుకుంటూ, పోలీసు బ్యాచ్‌ల వెంట తిప్పుకుంటూ ప్రజలకు, పార్టీకి వ్యతిరేకంగా మారుస్తున్నారు. అడవుల్లో కూంబింగ్‌లు జరిపేటప్పుడు మాజీలను పైలెట్లుగా నడిపిస్తూ దళాల మకాంలు, నీళ్ళ తావులు, దారులు చూపించాలని బాధిస్తున్నారు. పలు విధాలుగా మాజీలను మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. ప్రజా వ్యతిరేకులుగా, విప్లవ ద్రోహులుగా మారిన వారిని ప్రజలు గానీ, పార్టీ గానీ శిక్షించాల్సి వస్తే లేదా పోలీసులతో తిరుగుతున్నప్పుడు జరిగే ఎదురుకాల్పుల్లో మాజీలు చనిపోతే అందుకు పోలీసులు బాధ్యత వహించక తప్పదు.

పాలకుల, పోలీసు అధికారుల దుష్ప్రచారాన్ని నమ్మకూడదని, విప్లవోద్యమాన్ని వదిలి లొంగిపోతున్న కారణాలను సరైన దృక్పథంతో అర్థం చేసుకోవాలని విప్లవ ప్రజానీకాన్ని కోరుతున్నాం. దోపిడి వర్గ ప్రభుత్వం కుట్ర పూరితంగా అమలు చేస్తున్న లొంగుబాటు పథకాలను, పన్నాగాలను వ్యతిరేకించాలని పిలుపునిస్తున్నాం. విప్లవోద్యమంలో పనిచేస్తున్న వారి కుటుంబ సభ్యులు విప్లవోద్యమాన్ని వదిలి లొంగిపోకుండా పార్టీకోసం, ప్రజల కోసం, విప్లవం కోసం విప్లవకారుల్లా బతికి, వీరుల్లాగానే పోరులో ఒరిగేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. బతుకు సమస్యల పరిష్కారం కోసం, విప్లవోద్యమ విజయం కోసం, ప్రజా రాజ్యాధికారం కోసం ప్రజా గెరిల్లా సైన్యంలో చేరి పోరాడేందుకు పూనుకోవాల్సిందిగా పీడిత ప్రజానీకానికి పిలుపునిస్తున్నాం. ❑

# తమ రక్తంతో గెరిల్లాజోన్ రహదారులు వేసిన ప్రజా గెరిల్లా సైనికులకు విప్లవ జోహార్లు!

తరతరాల దోపిడీ అణచివేతల నుండి కోట్లాది ప్రజలను విముక్తి చేసేందుకు బడా భూస్వాములు, దళారీ పెట్టుబడిదారుల దోపిడీ వ్యవస్థతో పోరాడుతూ నాటి తెలంగాణా పోరాటం నుండి నేటి వరకు సుమారు 14,000 మంది విప్లవకారులు తమ అమూల్యమైన ప్రాణత్యాగం ద్వారా విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేసి విస్తృత పరిచారు. మన జిల్లాలో ఇటీవల కాలంలో కా॥ భాస్కర్, యాదగిరి, శ్రీధర్, సాగర్, మురళి, సంజీవ్‌లు పై వీరోచిత సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ తమ రక్త తర్పణ ద్వారా గెరిల్లాజోన్‌కు బాటలువేసి నేలకొరిగారు.

గుంటూరు జిల్లాలో గెరిల్లాజోన్ నిర్మాణం వైపు నడక మొదలుపెట్టిన ఉద్యమాన్ని నామరూపాల్లేకుండా చేయాలనే కుట్రలో నాగంగానే పరమ క్రూరుడు జె. పూర్ణచంద్రరావుని ప్రభుత్వం జిల్లాకు యస్.పి.గా తీసుకొచ్చింది. ఇన్‌ఫార్మర్స్‌ను తయారు చేసుకొని దళాలను మట్టుబెట్టాలని నిరంతరం కూంబింగ్ ఆపరేషన్‌లు చేస్తున్నాడు. కలెక్టరుతో కలిసి ప్రజాసంఘాల కార్యకలాపాలకు పరిమితులు విధించారు. సభలు, సమావేశాలు జరుపుకునే హక్కులు లేకుండా చేశారు. పార్టీపై పత్రికలలో, టీ.వీ.లలో తీవ్ర స్థాయిలో విషపూరిత దుష్ప్రచారం చేశారు. వీటన్నింటికీ పరాకాష్టగానే 2001 మే 6వ తేదీన పెరికపాడు వద్ద బెల్లంకొండ దళంపై హఠాత్తుగా దాడిచేసి నిరాయుధంగా దొరికిన కా॥ భాస్కర్, యాదగిరి, శ్రీధర్‌లను గుంటూరులో పట్టుకొని మురళి, సంజీవులను అనాగరికంగా హింసించి ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేశారు.

## కామ్రేడ్ భాస్కర్ (రాఘవేంద్రరావు)

ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, చవటపాలెంలో పేద దళిత కుటుంబంలో జన్మించిన రాఘవేంద్రరావు (భాస్కర్) బి.ఎ. వరకు చదువుకున్నాడు. చిన్నతనం నుండి అంటరానితనాన్ని తీవ్రంగా నిరసించేవాడు. అశాస్త్రీయ విద్యా విధానాన్ని, అంటరానితనాన్ని, పేదరికాన్ని రూపుమాపాలని, అణగారిపోతున్న ప్రజల విముక్తికి జీవితాన్ని అంకితం చేయాలని నిశ్చయించుకొని 1987లో చదువుకొనే రోజుల్లోనే పూర్తికాలం విప్లవం కోసం పనిచేయటం మొదలుపెట్టాడు. '87 ఉండి 89 వరకు ప్రకాశం జిల్లా జననాట్యమండలి టీమ్‌లో సభ్యుడిగా వుండి చిరుహాస్యం, మంచి అభినయంతో వేలాది ప్రజలలో విప్లవ చైతన్యం కలిగించాడు. వెనుకబడిన ప్రాంతాలల్లో ఉద్యమాన్ని నిర్మించాలనే పార్టీ పిలుపులో భాగంగా 1990 చివరలో గుంటూరు జిల్లాకొచ్చి అమరుడు 'దస్తగిరి' నాయకత్వంలో శిరిగిరిపాడు కేంద్రంగా పనిచేసిన చంద్రవంక దళంలో సభ్యుడైనాడు. '90లో శిరిగిరిపాడు ప్రజలు భూస్వామ్య వ్యతిరేక పోరాటం అలలకు జీవం పోశాడు. ఈ క్రమంలో 1991లో గొట్టిపాళ్లవద్ద శిరిగిరిపాడు భూస్వాములు దళంపై దాడిచేసి మరో సభ్యునితోపాటు భాస్కర్‌ని పట్టుకొని తుపాకీ గుంజుకొని బంధించారు. ఆ రోజంతా భూస్వాములు అనేక రకాలుగా మానసికంగా హింసించారు. చెక్కుచెదరని మానసిక ధైర్యంతో భూస్వాముల దాడిని ఎదుర్కొని బయటపడ్డాడు. పార్టీ అవసరాల రీత్యా 1991-97 వరకు రాష్ట్రకమిటీకి కొరియర్‌గా సమయస్ఫూర్తితో బాధ్యత నిర్వహించాడు.

పార్టీ ఆదేశం మేరకు '97 నుండి మరలా గుంటూరు ఉద్యమంలో భాగమైనాడు. '97 జూలై నుండి '98 చివరి వరకు నాగులేటి దళ ఏరియాకమిటీ సభ్యునిగా ఏరియాలో జరిగిన మాన్యం, పట్టాభూముల పోరాటాలు, అనేక ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలలో, భూస్వాములపై జరిగిన సాయుధ దాడులలోనూ చురుకుగా పాల్గొన్నాడు. 1998 చివర నుండి '99 నవంబర్ వరకు చంద్రవంక దళంలో పనిచేశాడు. 1999 చివర నుండి బెల్లంకొండ ఏరియాలో పనిచేస్తూ అక్కడ ప్రజలపై కత్తికట్టిన భూస్వాములను లొంగదీయటంలో సంఘాల నిర్మాణంలో, కరెంటు కోసం జరిగిన పోరాటంలోను 2000 సంవత్సరంలో బెల్లంకొండ, అచ్చంపేట మండలంలలో భూస్వాముల పట్టాభూములపైకి ప్రజలను కదిలించటం లోను ముందున్నాడు.

2001 మే 6వ తేదీనాడు పెరికపాడు ప్రత్యేక పోలీసులు హఠాత్తుగా దళంపై చేసిన దాడిని తిప్పికొడ్తూ శత్రు చేతికి దొరికాడు. శత్రువు భాస్కర్‌ని తీవ్రంగా హింసించి కూడా ఎలాంటి రహస్యాలు రాబట్టలేక కాల్చి హత్యచేసి ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లాడు. చిరుహాస్యం, సాదాసీదా జీవితం, మంచి రచన శైలి, ప్రజల విశ్వాసం చూరగొనే లక్షణాలు భాస్కర్ జీవితం నుండి మనం నేర్చుకోవలసినవి.

## కామ్రేడ్ యాదగిరి (మేడి దావీదు)

గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం సారంగపల్లి అగ్రహారంలో దళిత వ్యవసాయ కూలీ కుటుంబంలో జన్మించాడు. 1991లో గ్రామ బాలల సంఘంలో పనిచేశాడు. '96 నుండి గ్రామ విప్లవ రైతుకూలీ సంఘంలో సభ్యునిగా, '97 నుండి కమిటీ సభ్యునిగా పనిచేశాడు.

సంఘ సభ్యుడిగా, కమిటీ సభ్యుడిగా వుంటూ ఏరియాలో జరిగిన అనేక ప్రచార కార్యకలాపాలలో పాల్గొన్నాడు. ప్రజల వద్ద వచ్చిన అనేక సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించటానికి కృషి చేశాడు. గ్రామంలో జరిగిన మాన్యం, భూస్వాముల పట్టా భూములపైకి ప్రజలను కదిలించటంలోను, నిర్బంధాన్ని తిప్పికొట్టడంలోను, ప్రజలకు ధైర్యం చెప్పటంలోను కృషి చేశాడు. ఏరియాలో భూస్వాములపై జరిగిన అనేక సాయుధ దాడులలో పాల్గొన్నాడు. పోలీసుల దాడులకు భయపడి కొంతమంది ముఖ్య సంఘ నాయకులు లొంగిపోయినా తాను ధైర్యంగా నిలబడి సంఘాన్ని, ప్రజలను నిలబెట్టాడు. భూపోరాటాన్ని దెబ్బతీయటానికి భూస్వాములు చేసిన కుట్రలను త్రిప్పికొట్టడంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఈ క్రమంలోనే భూస్వామ్యం పోకుండా భూమి దక్కదని, అంటరానితనం పోదని తెలుసుకొని 2001లో పూర్తికాలం కార్యకర్తగా బెల్లంకొండ దళంలో సభ్యుడైనాడు. పెరికపాడు బూటకపు ఎన్‌కౌంటర్‌లో గాయపడి నిరాయుధంగా శత్రువు చేతికి దొరికి చిత్రహింసలెన్నో నిబ్బరంగా ఎదుర్కొని పార్టీ రహస్యాలను తన గుండెల్లోనే దాచుకొని విప్లవ విజయంపట్ల విశ్వాసంతో చివరి శ్వాస వదిలాడు. కష్టపడి పనిచేయటంలో, క్రమశిక్షణకు విప్లవ ప్రయోజనాలకు కట్టుబడటంలో యాదగిరి ఆదర్శవంతంగా జీవించి అందుకోసమే అమరుడైనాడు. కామ్రేడ్ యాదగిరి భౌతికంగా మననుండి దూరమైనా తన ఆశయాలు, జ్ఞాపకాలు ప్రజలలో ప్రజా పోరాటాలలో సదా

నిలిచే వుంటాయి.

### కా|మేడ్ శ్రీధర్ (మందా దావీదు)

గుంటూరు జిల్లా మాచవరం మండలం, గాంధీనగర్‌కు చెందిన దళిత వ్యవసాయ కూలీ కుటుంబంలో శ్రీధర్ జన్మించాడు. శ్రీధర్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు కూలి డబ్బులతోనే కొడుకును బి.ఎ. చదివించారు. తమ గ్రామంలోనే ముఠా గొడవలలోనికి లాగబడి కక్షలు, కార్పణ్యాలు, హత్యలు, కేసులుతో ఆందోళనకరమైన జీవితం కొనసాగించలేక బెల్లంకొండ మండలంలోని ఎమ్మాజీగూడెం వచ్చారు. పరిసర గ్రామాలలో జరుగుతున్న విప్లవ కార్యకలాపాలకు ఉత్తేజితుడైన శ్రీధర్ కొద్దికాలంలోనే పార్టీకి పరిచయమైనాడు. తమ జీవితానికి ఉపయోగపడని అశాస్త్రీయ విద్యా విధానాన్ని ముఠా గొడవల అసలు రూపాన్ని అర్థం చేసుకొని నిరుద్యోగం, అంటరానితనం, పేదరికం లేని మంచి రాజ్యం కోసం పూర్తికాలం విప్లవ కార్యకర్తగా పనిచేయాలని నిశ్చయించుకుని దళంతో వుండగా పెరికపాడు బూటకపు ఎన్‌కౌంటర్‌లో గాయపడి శత్రువుకు దొరికాడు. కొత్తగా వచ్చిన మిలిటెంట్ అని అర్థం అవుతున్నా మానవత్వం లేని శత్రువు చిత్రహింసలు పెట్టి కాల్చి చంపి ఎన్‌కౌంటరన్నాడు.

### కా|మేడ్ కేళావత్ సైదులు నాయక్ (సాగర్)

గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం శ్రీనగర్‌లోని ఆదివాసీ వ్యవసాయ కూలీ కుటుంబంలో జన్మించిన మొదటి సంతానం. కా॥ సాగర్ తల్లిదండ్రులు ఎంతో కష్టంతో బి.కాం. వరకు చదివించారు. చదువుకునే రోజులలోనే అభ్యుదయ భావాలతో అనేకమంది విద్యార్థులతో స్నేహం చేసేవాడు. పార్టీలోకి వచ్చాక ఆ స్నేహితులను విప్లవ అవసరాలకు వినియోగించగలిగాడు. 1993 నాటికే డిగ్రీ చదువు పూర్తిచేసి కుటుంబానికి సహకరించటానికి 1, 2 చిరుద్యోగాలు చేశాడు. '95 చివరలో తమ గ్రామం చుట్టుప్రక్కల గ్రామాలలో జరుగుతున్న విప్లవ కార్యకలాపాలకు ఆకర్షితుడై పార్టీకి పరిచయమైనాడు. '94లోనే బుట్రుపాలెం తండాలో పెత్తందారులకు అండగా పెట్టిన పోలీసు క్యాంపును ఎత్తివేయించటానికి ప్రజలను కదిలించడంలో ముందున్నాడు. '96లో శ్రీనగర్‌లో విప్లవ రైతుకూలీ సంఘం స్థాపించి, నాయకత్వం వహించి అనేక ప్రజా సమస్యలన ప్రజాకోర్టులలో సామరస్య పూర్వకంగా పరిష్కరించాడు. బట్రుపాలెం, శ్రీనగర్ గ్రామాలలో ప్రజలకు వ్యతిరేకంగా నడుచుకున్న తన దగ్గర బంధువులను ప్రజాకోర్టులో పెట్టి శిక్షించాడు. '96లోనే శ్రీనగర్, రామాపురం, పొందుగల గ్రామాలలో భూస్వాములు ఆక్రమించుకున్న దేవుని మాన్యం భూములపైకి ప్రజలను కదిలించడంలో, పంపకంలో క్రియాశీలక పాత్ర పోషించాడు. ఇలాంటి ఆర్థిక సమస్యలెన్ని పరిష్కరించినా ప్రజల బ్రతుకులు మారవని, నూతన ప్రజాస్వామిక వ్యవస్థలోనే ప్రజలు మౌళిక సమస్యలు పరిష్కారం అవుతాయని గ్రహించి '96 చివరలో పూర్తికాలం కార్యకర్తగా నాగులేటి దళంలో సభ్యుడైనాడు. స్నేహ స్వభావం, కష్టపడేతత్వం, అంకితభావం, చొరవలతో కొద్ది కాలంలోనే తోటి దళ సభ్యులు, ప్రజలకు అభిమాన పాత్రుడైనాడు. సాగర్ జీవితం ప్రజలతో అలా అల్లుకు పోయింది.

1997 జూన్‌లో పార్టీ పిలుపు మేరకు పట్టణ ప్రాంత విద్యార్థి ఉద్యమ నిర్మాణ బాధ్యతలు చేపట్టాడు. 2000 జూన్ వరకు అదే రంగంలో కృషి చేశాడు. ఎలాంటి పరిచయాలు లేని స్థితి నుండి కొన్ని యూనిట్లు నిర్మించి విద్యార్థి సమస్యల మీద పోరాటాలు నిర్వహించాడు. 3 సంవత్సరాల పాటు నిరంతర తపన, చొరవ, ఉత్సాహంతో చేసిన కృషి ఫలితంగా కొందరు విద్యార్థులు పూర్తికాలం విప్లవ కార్యకర్తలుగా ఎదిగారు.

ఈ కాలంలో '98లో చంద్రవంక ఎన్‌కౌంటర్ (92)కు కారకుడైన ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ మస్తాన్‌వలి, గ్రీన్ టైగర్స్ సంస్థ సభ్యుడు (విప్లవ ద్రోహి) పోకూరి శ్రీనివాసాచారిని, పల్నాటి ప్రజల పాలిట పీడగా మారిన ఎస్.ఐ. నిమ్మకాయల కోటేశ్వరరావును అంతమొందించిన దళాలల్లో ప్రముఖ పాత్ర పోషించాడు. కా॥ సాగర్‌కు మిలటరీ రంగంలో గల ఈ ప్రత్యేక నైపుణ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పార్టీ స్పెషల్ యాక్షన్ టీంలో సభ్యుడిగా తీసుకొని విప్లవోద్యమంపై కత్తిగట్టిన పోలీసు అధికారులను, రాజకీయ నాయకులను అంతమొందించే బాధ్యత అప్పగించింది. ఈ కర్తవ్య నిర్వహణలో వుండగానే అనుకొని ప్రమాదంలో తమ దగ్గర గల మందుపాతరలు పేలి కా॥ రమణతో పాటు సెప్టెంబరు 4న ఏలూరు రైల్వేస్టేషన్‌లో అమరుడైనాడు. గుండెల నిండా విప్లవోత్సాహంతో విప్లవంలోకి దూకి నిరంతరం నూతనోత్తేజంతో విప్లవం కోసం అహర్నిశలు శ్రమించిన కా॥ సాగర్ మనకు దూరమయినా ఆయన సిద్ధాంతం, మహోన్నత ఆశయాలు నిరంతరం ప్రజల వెన్నుతడుతూనే వుంటాయి.

### కొండా లక్ష్మణ్ (మురళి)

నిజామాబాదు జిల్లా కామారెడ్డి పట్టణంలో నిరుపేద కుటుంబంలో పుట్టిన కొండ లక్ష్మణ్ తల్లిదండ్రుల రెక్కల కష్టంతో ఇంటర్ వరకు చదివించారు. 1989లో ఇంటర్ పూర్తిచేసిన మురళి కుటుంబానికి సహాయం చేయడం కోసం కొంతకాలం బీడీ కార్మికునిగా పనిచేశాడు. ఇదే సమయంలో ఉత్తర తెలంగాణాలో వెల్లువెత్తిన ప్రజా ఉద్యమంలో మురళి భాగమయ్యాడు. '91 వరకు అదే జిల్లాలో విద్యార్థి యువతరాన్ని కూడగట్టిన మురళి అరెస్టయి తీవ్ర చిత్రహింసలు అనుభవించి బయటకు రాగానే '92 చివరిలో మరికొందరు కామ్రేడ్స్‌తో పాటు గుంటూరు జిల్లా ఉద్యమంలో భాగమయినాడు. ఈ జిల్లా గ్రామీణ ఉద్యమము ప్రారంభ దినాల్లోని కష్టనష్టాలు తట్టుకోలేని సహచరులు నిజామాబాదు వెళ్ళిపోగా కా॥ మురళి మాత్రం ఈ జిల్లా కేడర్, ప్రజలతో కలిసిపోయి జిల్లా విప్లవ రైతాంగ పోరాటాలకు ఊపిరి ఊదిన వారిలో ఒకడైనాడు. కృష్ణపట్టి ఏరియాలో చేపల పావుకారుల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను కదిలించడంలో, జెలిటిన్‌తో నదిలో చేపల్నింటినీ చంపుతూ సామాన్య జాలరుల కడుపు కొడుతున్న దొంగలపై ప్రజాకోర్టులు నిర్వహించడంలో ముందున్నాడు.

చంద్రవంక ఎన్‌కౌంటర్ తరువాత బెల్లంకొండ దళం నుండి మిలటరీ అవసరాల రీత్యా కా॥ మురళిని చంద్రవంక దళంలోకి సభ్యుడిగా పంపడం జరిగింది. ఎగువ పల్నాడు ప్రాంతంలో ముఠాలు నడుపుతూ, దోపిడీలు, హత్యలు, మహిళలపై అత్యాచారాలు, దొంగతనాలు చేస్తూ ప్రజల పాలిట పీడకుడిగా మారిన పిన్నెల్లి సుందర రామిరెడ్డిని ఖతం చేయడంలో క్రియాశీలకంగా పాల్గొన్నాడు. కండ్లకుంట, పరిసర గ్రామాలలో పిన్నెల్లి లక్కారెడ్డి కుటుంబం, గెల్లి చలమారెడ్డి వంటి భూస్వాములు చేసిన అక్రమ వడ్డీ వ్యాపారము, భూముల ఆక్రమణ, అంటరానితనాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నడపటంలో పాలుపంచుకున్నాడు. '96లో అడిగొప్పల, నలమాలపాడులో జరిగిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలో ముఖ్యపాత్ర వహించాడు.

1997 జూన్ నుండి నల్లమల్ల ఏరియాలో టైగర్ ప్రాజెక్ట్ దళం డిప్యూటీ కమాండర్‌గాను వుంటూ ప్రజలను కదిలించి పోరాటాలు, నిర్మాణాలు చేయడంలో ప్రధాన బాధ్యత వహించాడు. ప్రజా గెరిల్లా సైన్యం నరసరావు పేట కాలేజీపై దాడిచేసి తుపాకులు స్వాధీనం చేసుకున్నాక పిచ్చెత్తిపోయిన పోలీసు అధికారులు వైద్య అవసరాల కోసం గుంటూరు వచ్చిన మురళీని ఇన్‌ఫార్మర్ సహాయంతో అరెస్టు చేసి దారుణంగా చిత్రహింసలు పెట్టి ఎలాంటి పార్టీ రహస్యాలు రాబట్టలేక కాల్చిచంపి శవాన్ని రామాపురం వద్ద పడవేసి ఎన్‌కౌంటర్ అని నమ్మమంటున్నారు.

కా॥ మురళి శత్రువు పెట్టిన చిత్రహింసల్లో మృతి చెందినా, తమ సహచరుల హృదయాలలో, ప్రజల జ్ఞాపకాలలో ఎల్లకాలం జీవించే వుంటాడు.

## కామ్రేడ్ సంజీవ్

గుంటూరు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందన గ్రామంలో దిగువ మధ్యతరగతి కుటుంబంలో ఇద్దరు అక్కచెల్లెళ్ళు మధ్య ఉప్పు కృష్ణ, సుబ్బమ్మ దంపతులకు ఒకే ఒక్క మగ సంతానం సంజీవ్. అప్పటికే విప్లవాభిమానులైన తల్లిదండ్రులు సంజీవ్‌కు విద్యాబుద్ధులు నేర్పి విప్లవాభిమానిగా తీర్చిదిద్దారు. ఇంటర్ చదువుకునే సంజీవ్ కుటుంబ అవసరాల కోసం రిక్షాలు తొక్కేవాడు, బిస్కెట్లు అమ్మేవాడు. 1997 నాటికే జిల్లాలో బలంగా కొనసాగుతున్న విప్లవ పోరాటాలు చూసి ఉత్తేజితుడైన సంజీవ్ పూర్తికాలం విప్లవ కార్యకర్తగా బెల్లంకొండ దళంలో సభ్యుడైనాడు. '97 నుండి 2000 వరకు బెల్లంకొండ ఏరియాలో జరిగిన ప్రచార కార్యక్రమాలు ప్రజా పంచాయితీలు, భూస్వాములపై సాయుధ దాడులు కూలిరేట్ల పోరాటం, మాన్యం పట్టా భూముల పోరాటంలోను, ప్రభుత్వ వ్యతిరేక పోరాటాల్లోను చురుకుగా పాల్గొని ప్రజల అభిమానం చూరగొన్నాడు. ముఖ్యంగా '98-2000 సం॥రం మధ్య పైలెట్‌గా వుండి దళానికి కళ్ళు, కాళ్ళూ తానై నడిపించాడు. పెరికపాడులో ప్రజలకు వ్యతిరేకంగా వుంటున్న తన బంధువులపై జరిగిన ప్రజాకోర్టులో చురుకుగా పాల్గొన్నాడు. కా॥ సంజీవ్‌లోని కష్టపడే స్వభావం, అంకిత భావం, క్రమశిక్షణను చూసి పార్టీ మిలటరీ ప్లాటూన్‌లో సభ్యుడిగా నియమించింది. పార్టీ అవసరాల నిమిత్తం గుంటూరు కొచ్చిన సంజీవ్‌ని 28-12-2001న పోలీసులు పట్టుకొని అనాగరికంగా చిత్రహింసలను పెట్టి కూడా ఏ చిన్న రహస్యం కూడా రాబట్టలేక పిచ్చెత్తిపోయి కత్తులతో శరీరమంతా కోసి బాయ్‌నెట్లతో పొడిచి హత్య చేసి గుత్తికొండ వద్ద ఎన్‌కౌంటర్ జరిగినట్టు ప్రచారం లంకించుకున్నారు. చర్చల ప్రహసనం నడుపుతూనే అత్యంత పాశవికంగా ప్రభుత్వం చేసిన ఈ హత్య చర్చల పట్ల ప్రభుత్వ నిజాయితీలేని తనాన్ని చెప్పకనే చెబుతుంది.

శత్రువు తనని చంపుతాడని స్పష్టంగా అర్థం అవుతున్నా ప్రాణబిక్ష, డబ్బు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పినా ఎలాంటి ప్రలోభాలకి లొంగకుండా తెలిసిన రహస్యాన్ని గుండెలో దాచుకొని నేలకొరిగాడు. సంజీవ్ విప్లవకారుల అంకురిత దీక్ష, అంకిత భావాల ముందు అసమర్థ ప్రభుత్వాలు ఎన్నటికైనా ఓడిపోక తప్పదు అని చారిత్రక సత్యాన్ని మరోసారి నిరూపించాడు సంజీవ్.

దారి పొడుగునా గుండె నెత్తురు చిందిస్తూ అనంతమైన త్యాగాలతో నడిచి విప్లవోద్యమం నేటి స్థితికి ఎదిగింది. ప్రజలపట్ల అంతిమ విజయంపట్ల కొనసాగించి వారు కలగన్న రాజ్యాన్ని నిర్మించి తీరుతామని ప్రతిజ్ఞ చేద్దాం.